PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 93 | విజయవాడ, శుక్రవారం 3 నవంబర్ 2023 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Friday 3 November 2023 | Rs

హ్యాక్ గుట్టు విప్పాల్సిందే..?

- ప్రతిపక్ష నేతలు, జర్నలిస్టులకు యాపిల్ అలర్ట్‌పై 'అత్యవసర సమావేశం' ఏర్పాటు చేయాలి
- ఐటి స్టాండింగ్ కమిటీ ఛైర్‌పర్సన్‌కు సిపిఐ(ఎం) ఎంపీ జాన్ బ్రిట్టాస్ లేఖ

7

8

రికార్డు గెలుపుతో సెమీస్‌కు టీమిండియా

- శ్రీలంకపై 302 పరుగుల తేడాతో అద్భుత విజయం

ఊరెళ్లిపోతోంది

- కర్నూలు జిల్లాలో మొదలైన వలసలు
- హైదరాబాద్, కర్ణాటకకు పయనం

ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి

కర్నూలు జిల్లాల్లో వలసలు మొదలయ్యాయి. ప్రతి ఏడాదీ లాగే ఈ ఏడాది కూడా వర్షాలు పడకపోవడంతో ఇళ్లు, వాకిలి వదిలి.. తట్ట, బుట్టలతో అన్నదాతలు, వ్యవసాయ కూలీలు వలసబాట పట్టారు. ఉన్న ఊరిలో పనులు దొరక్క...పొట్టనింపుకునేందుకు పక్క రాష్ట్రాలకు పయణమయ్యారు. ముసలి వాళ్లను ఇంటి వద్ద వదిలిపెట్టి.. కష్టాన్ని నమ్ముకుని గడపదాటుతున్నారు. తమ వారికి దూరంగా ఉంటూ ప్రతిరోజూ కూలిపనులకు వెళ్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటికే 30 వేల మంది వలసెళ్లిపోయారు. కర్నూలు జిల్లా వ్యాప్తంగా ఖరీఫ్ సీజన్‌లో 10.29 లక్షల ఎకరాల్లో పత్తి, మిరప, మొక్కజొన్న, ఉల్లి, వేరుశనగ, కంది, వరి తదితర పంటలను సాగు చేశారు. సరాసరిన ఒక్క ఎకరాకు రూ.50వేల నుంచి రూ. లక్ష ఖర్చు చేశారు. ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్‌లో వర్షాలు కురవకపోవడంతో దాదాపు 70 శాతం పంటలు దెబ్బతిన్నాయి. ఈ మూడు నెలల కాలంలో 65 శాతం లోటు వర్షపాతం ఏర్పడింది. నైరుతి రుతపవనాల నిష్క్రమణతో పంటలపైనా అన్నదాతలు ఆశలు వదులుకున్నారు. చేసిన అప్పులు తీర్చేందుకు ప్రతి ఏడాదిలాగే ఆ ఏడాది కూడా వలసబాట పట్టారు. తెలంగాణలోని రంగారెడ్డి, సంగారెడ్డి జిల్లాల్లో పత్తి విడిపించేందుకు కోసిగి, ఎమ్మిగనూరు, నందవరం, హోళగుంద, పెద్దకడబూరు మండలాల నుంచి గ్రామాలకు గ్రామాలు తరలిపోయాయి. ఒక్క కోసిగి మండలం లోనే 20 వేల మంది వలస వెళ్లారు. ఎమ్మిగనూరు మండలంలోని కడివెళ్ల, కలగట్ల, సొగనూరు, కంగనాతి, కోటగల్లు, దేవిబెట్ట, దైవందిన్నె, ఏనుగుబాల, పెసలదిన్నె గ్రామాల నుంచి ఇప్పటి వరకూ రెండు వేల మంది వలస వెళ్లారు. నందవరం మండల వ్యాప్తంగా 80 శాతం లోటు వర్షపాతం వల్ల పంటలు దెబ్బతిన్నాయి. దీంతో కనకవీడు, నందవరం, మాచాపురం, పులిచింత, పొనకలదిన్నె, సామలగూడూరు, మిట్టసోమాపురం గ్రామాల నుంచి ఇప్పటి వరకూ నాలుగు వేల మంది గుంటూరులో మిరప పనులకు, తెలంగాణలోని శాంతి నగర్, రంగారెడ్డి, సంగారెడ్డి ప్రాంతాల్లో పత్తి విడిపించేందుకు వెళ్లారు. హోళగుంద మండలంలోని గజహళ్లి, వందవాగలి, నెరణికి, హోళగుంద, హెబ్బటం గ్రామాల నుంచి వెయ్యి మంది బెంగళూరు, హైద్రాబాద్‌కు వలస వెళ్లారు. పెద్ద కడబూరు మండలంలోనూ అదే పరిస్థితి నెలకొంది. ప్రతి ఏడాదీ వలసలు కొనసాగుతున్నా వాటి నివారణకు అధికారులు శాశ్వత చర్యలు చేపట్టక పోవడం పట్ల విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

కోసిగి మండలం నుంచి వలస వెళ్తున్న కూలీలు

వర్షాలు కురవక పనుల్లేవు

ఈ ఏడాది వర్షాలు కురవకపోవడం వల్ల పంటలు ఎండిపోయాయి. పనులు లేవు. దీంతో కర్ణాటక రాష్ట్రం బెంగళూరుకు వలస వెళ్లాము. ఊర్లో ఉంటే రోజు తిండి దొరకదు చేసిన అప్పులు కూడా తీరవు. పిల్ల పాపలతో వలస వచ్చాము. ఇక్కడ ఆడవారికి రూ.400 మగవారికి రూ.600 కూలీ ఇస్తున్నారు. ప్లాస్టిక్ కవర్‌తో చిన్నగా గుడిసెలు వేసుకుని జీవనం చేస్తున్నాము. తాగడానికి రూ.10 పెట్టి ఫిల్టర్ నీళ్లు తెచ్చుకుంటాము. స్నానం చేయడానికి వారానికోసారి మమ్మల్ని కూలి పనికి పెట్టుకున్న వాళ్ల ఇళ్లలో నీరు తెచ్చుకుని స్నానం చేస్తాము. మా బాధను ఎవరికి చెప్పాలో అర్థం కావడం లేదు. **- నారాయణప్ప, గజ్జహళ్లి, హొళగుంద మండలం.**

కుటుంబం మొత్తం వలస

తీవ్ర వర్షాభావంతో పంటలు దక్కకపోవడంతో కర్ణాటక రాష్ట్రం చేగుంటకు వలస వెళ్తున్నాము. అక్కడ అయితే పత్తి తీసే పనులు ఉంటాయి. కిలోకు రూ.10 కూలీ ఇస్తారు. బతకడం కోసం కుటుంబం మొత్తం వలస వెళ్తున్నాము. ఊర్లో ఉపాధి పనులు చేసినా సరైన సమయానికి బిల్లులు అందడం లేదు. **- ఈరన్న, దుద్ది, కోసిగి మండలం.**

ఇడి విచారణకు కేజ్రీవాల్ గైర్హాజరు

- రాజకీయ ప్రేరేపితం అయిన సమన్లు వెనక్కి తీసుకోవాలని లేఖ

న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం కుంభకోణం కేసుకు సంబంధించి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) విచారణకు గురువారం ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ గైర్హాజరయ్యారు. తనకు జారీ చేసిన సమన్లు 'చట్ట విరుద్ధం, రాజకీయ ప్రేరేపితమైనవని, కావున వాటిని వెనక్కి తీసుకోవాలని ఇడి అధికారులను కేజ్రీవాల్ ఒక లేఖ రాశారు. మధ్యప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో ప్రచారానికి వెళ్లకుండా చేసేందుకే ఇడితో సమన్లు జారీ చేయించారని ఆయన ధ్వజమెత్తారు. బిజెపి స్క్రిప్టు మేరకే ఇదంతా నడుస్తోంది.విచారణకు తనను ఏ హోదాలో పిలిచారో స్పష్టంగా పేర్కొనలేదన్నారు. .'సాక్షిగా లేదా.. అనుమానితుడిగానా, వ్యక్తిగా నా, ఢిల్లీ ముఖ్యమంత్రిగానా లేక ఆప్ జాతీయ కన్వీనర్‌గానా ఏ హోదాలో పిలిచారో ఇడి చెప్పాలి. నా ప్రతిష్ట దెబ్బతీయడానికే ఇదంతా చేస్తున్నారని కేజ్రీవాల్ పేర్కొన్నారు. గురు వారం విచారణ తరువాత ఇడి తనను అరెస్టు చేస్తుందని బిజెపి నాయకులు చేస్తున్న ప్రచారం గురించి కూడా కేజ్రీవాల్ ఆ లేఖలో ప్రస్తావించారు.

ఎథిక్స్ కమిటీ సమావేశంలో గందరగోళం

- ప్రతిపక్ష ఎంపీల వాకౌట్
- ఇవేం నీచమైన ప్రశ్నలంటూ మొయిత్రా ఆగ్రహం

7

సదస్సులో సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న సిఎం జగన్మోహన్ రెడ్డి, కేంద్ర మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్

నీటి కొరతతో కరువు

- సవాళ్లను అధిగమించే నీటిపారుదల విధానం అవసరం
- ఐసిఐడి సమావేశంలో సిఎం జగన్ , కేంద్ర మంత్రి షెకావత్

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

రాష్ట్రం అనేక సవాళ్లను ఎదుర్కొంటోందని, నీటి కొరతతో వ్యవసాయరంగం కరువు పరిస్థితులు చవిచూస్తోందని ముఖ్యమంత్రి వైఎస్. జగన్మోహన్‌రెడ్డి అన్నారు. విశాఖ బీచ్ రోడ్డులోని రాడిషన్ బ్లూ హోటల్‌లో 25వ ఇంటర్నేషనల్ కమిషన్ ఆన్ ఇరిగేషన్ అండ్ డ్రైనేజ్ కాంగ్రెస్ (ఐసిఐడి) సదస్సును గురువారం కేంద్ర జలశక్తి శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ఎనిమిదవ తేది వరకు విశాఖలో జరగనున్న ఈ సదస్సుకు 90 దేశాల నుండి 300 మందికిపైగా, దేశంలోని వివిధ రాష్ట్రాల నుండి 500 మందికిపైగా ఈ సదస్సుకు హాజరయ్యారు. సాగునీటికోసం ప్రత్యామ్నాయ జలవనరుల వినియోగం, తక్కువ నీటితో అధిక విస్తీర్ణంలో పంటల సాగు తదితర అంశాలను ఈసదస్సులో చర్చించనున్నారు. సదస్సును ప్రారంభించిన అనంతరం సిఎం మాట్లాడుతూ సవాళ్లను అధిగమించేలా నీటిపారుదల నిర్వహణ విధానం ఉండాలన్నారు. సుస్థిర వ్యవసాయ నీటి నిర్వహణ అనే విస్తారమైన లక్ష్యానికి అనుగుణంగా ఐసిఐడిని స్థాపించారని గుర్తుచేశారు. ఎపిలో 40 ప్రధాన మధ్యతరహా, చిన్న నదులున్నాయని, వ్యవసాయం, నీటిపారుదల రంగాల్లో శతాబ్దాలుగా రాష్ట్రం గొప్ప వారసత్వాన్ని కలిగి ఉందని అన్నారు. ఎపి పెద్ద తీర ప్రాంతాన్ని కలిగి ఉన్నప్పటికీ రాయలసీమ, దక్షిణ కోస్తాలోని పశ్చిమ ప్రాంతాలు తక్కువ వర్షపాతం కారణంగా తరచూ కరువు బారిన పడుతున్నాయని వివరించారు. ఇది ఆయా ప్రాంతాల ప్రజల జీవన స్థితిగతులపై తీవ్ర ప్రభావం చూపుతోందన్నారు. ఆంధ్రప్రదేశ్ అన్నింటికన్నా దిగువ నదీ తీర రాష్ట్రంగా ఉన్నందున వంశధార, నాగావళి, గోదావరి, కృష్ణా, పెన్నా వంటి ప్రధాన అంతరాష్ట్ర నదీ పరివాహక ప్రాంతాల్లో తక్కువ వర్షపాతం నమోదైనప్పుడు నీటికొరత సమస్య ఎదురవుతోందని చెప్పారు. వర్షపాతం అధికంగా ఉండే జూన్ నుంచి సెప్టెంబర్ మాసాల్లో నీటిని ఒక బేసిన్ నుంచి మరో బేసిన్‌కు తరలించడం ద్వారానే నీటి కొరతను అధిగమించగలుగుతామన్నారు. నీటి నిర్వహణకు సంబంధించిన అన్ని సమస్యలనూ ఐసిఐడి సమగ్రంగా అధ్యయనం చేసి సాంకేతికంగా సాధ్యమయ్యే, ఆర్థికంగా లాభదాయకమైన, సామాజిక ఆమోదయోగ్యమైన పర్యావరణ అనుకూల పరిష్కారాలను చూపుతుందని తాను నమ్ముతున్నానన్నారు.

కేంద్ర జలశక్తి మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ మాట్లాడుతూ.. జలశక్తి మంత్రిత్వ శాఖ 2024 నాటికి 140 బిలియన్ యుఎస్ డాలర్లను నీటి, శానిటేషన్ రంగంలో సాధించాలన్న లక్ష్యాన్ని మోడీ సూచించారన్నారు. వ్యవసాయ ఉత్పత్తుల్లో సుస్థిర ఎగుమతిదారుగా భారత్ ఎదిగిందన్నారు. దేశం ఇరిగేషన్‌లో కీలక పాత్ర పోషిస్తోందన్నారు. ఐసిఐడి అధ్యక్షులు డాక్టర్ రగాబ్, ఉపాధ్యక్షులు కుష్వేందర్ ఓహ్రా, రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజని, ఐటి శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, రాష్ట్ర జలవనరుల శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శశిభూషణ్ కుమార్, అధికారులు పాల్గొన్నారు.

ఎఐజిలో చంద్రబాబు

రేపు ఎల్‌వి ప్రసాద్ ఆస్పత్రిలో కంటి పరీక్షలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మాజీ ముఖ్యమంత్రి, టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు గచ్చిబౌలిలోని ఏషియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ గ్యాస్ట్రోఎంట్రాలజీ (ఎఐజి) హైదరాబాద్‌లోని ఆస్పత్రిలో చేరారు. గురువారం ఉదయం ఆస్పత్రికి వచ్చిన చంద్రబాబుకు డాక్టర్ల బృందం పలు వైద్య పరీక్షలు నిర్వహించింది. డెర్మటాలజీ రిపోర్టులను నిశితంగా పరిశీలించిన అనంతరం వైద్యుల సూచన మేరకు ఆయన ఆస్పత్రిలో చేరారు. చంద్రబాబు వెంట కుటుంబ సభ్యులు నారా భువనేశ్వరి, నారా లోకేష్, బ్రాహ్మణితో పాటు పలువురు టిడిపి ముఖ్య నేతలు ఉన్నారు. శుక్రవారం మధ్యాహ్నం ఆస్పత్రి నుంచి చంద్రబాబు డిశ్చార్జి అవుతారని టిడిపి వర్గాలు తెలిపాయి. కాగా, కుడి కంటి సమస్యతో ఇబ్బందిపడుతున్న చంద్రబాబు శనివారం ఎల్‌వి ప్రసాద్ ఆస్పత్రికి వెళ్లనున్నారు. కుడి కంటికి క్యాటరాక్ట్ శస్త్రచికిత్స చేయాలని ఇప్పటికే వైద్యులు స్పష్టంచేసిన నేపథ్యంలో వైద్యులు చంద్రబాబుకు రెటీనా స్కానింగ్, కంటి కండరాల పరీక్షలు చేయనున్నారు. అనంతరం కుడి కంటికి క్యాటరాక్ట్ శస్త్రచికిత్స చేయనున్నారు.

చంద్రబాబుపై మరో కేసు

- ఇసుక తవ్వకాల్లో అక్రమాలకు పాల్పడ్డారంటూ ఆరోపణ

3

బిజెపితో దోస్తీ ప్రమాదం

- మత ఘర్షణలతో విషం చిమ్ముతున్న కేంద్రం
- విభజన హామీలు, పోలవరానికి ఏం చేశారో చెప్పండి?
- సిపిఎం అఖిల భారత నాయకులు విజూ కృష్ణన్
- మందసలో ప్రజా రక్షణభేరి యాత్ర ప్రారంభం

బస్సు యాత్రను ప్రారంభిస్తున్న సిపిఎం అఖిల భారత నాయకులు విజూ కృష్ణన్

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

రాష్ట్రంలోని వైసిపి, టిడిపి, జనసేన పార్టీలు బిజెపి అనే విష సర్పంతో స్నేహం కోసం పాకులాడుతున్నాయని సిపిఎం అఖిల భారత నాయకులు విజూ కృష్ణన్ అన్నారు. బిజెపితో దోస్తీ ప్రమాదకరమని ఆయన హెచ్చరించారు. శ్రీకాకుళం జిల్లా మందసలో సిపిఎం చేపట్టిన ప్రజా రక్షణ భేరి బస్సు యాత్రను గురువారం ఆయన ప్రారంభించారు. అనంతపురం, సత్యసాయి, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో ప్రజా రక్షణ భేరీ యాత్రలు జరుగుతున్న సంగతి తెలిసిందే. ఆ జాతాలకు ప్రజల నుండి భారీ ఆదరణ లభిస్తోంది. పెద్ద సంఖ్యలో ప్రజానీకం ఈ యాత్రల్లో భాగస్వాములవుతున్నారు. తాజాగా మందసలో ప్రారంభమైన బస్సుయాత్ర గురువారం శ్రీకాకుళం వరకు సాగింది. ఈ సందర్భంగా మందస, శ్రీకాకుళంలో నిర్వహించిన బహిరంగసభల్లో సభల్లో విజూ కృష్ణన్ మాట్లాడుతూ ఎం.ఎస్ స్వామినాథన్ సిఫార్సులను అమలు చేస్తామని చెప్పిన బిజెపి ప్రభుత్వం, అధికారంలోకొచ్చాక సాధ్యం కాదంటూ సుప్రీంకోర్టుకు సమర్పించిన అఫిడవిట్‌లో పేర్కొందని తెలిపారు. బిజెపి పదేళ్ల కాలంలో రైతులు, కౌలు రైతుల ఆత్మహత్యలు విపరీతంగా పెరిగాయన్నారు. విభజన హామీలు అమలు చేయకుండా, వెనుకబడిన జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వకుండా మోసం చేసిన సంగతిని గుర్తుచేశారు.

అమరావతి శంకుస్థాపనకు వచ్చిన ప్రధాని నరేంద్ర మోడీ చెంబుడు మట్టి, నీళ్లు ఇచ్చి వెళ్లారన్నారు. పోలవరం నిర్వాసితులకు బిజెపి ఏం చేసిందో చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్రానికి బిజెపి అన్యాయం చేస్తున్నా వైసిపి, టిడిపి, జనసేన ఆ పార్టీనే కావాలనుకుంటున్నాయని విమర్శించారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.తులసీదాస్ మాట్లాడుతూ.. మందస ప్రాంతంలో గిరిజనుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని నెల్లూరు, కడప, ఉభయగోదావరి జిల్లాలకు చెందిన వ్యక్తులు తప్పుడు పత్రాలతో వందలాది ఎకరాల భూములను ఆక్రమించుకుంటున్నారని తెలిపారు. మంత్రులు అప్పలరాజు, ధర్మాన ప్రసాదరావు గిరిజనులకు రక్షణ కల్పిస్తారా?, ఆక్రమణదారులకు కొమ్ము కాస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు. బిజెపితో అంటకాగే విషయంలో టిడిపి వైఖరేంటో చెప్పాలని డిమాండ్ చేశారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం మాట్లాడుతూ, కేంద్రంలోని మోడీ ప్రభుత్వం వల్లే ధరలు పెరుగుతున్నాయన్నారు. తమ హయాంలోనే అభివృద్ధి చేశామని వైసిపి, టిడిపి గొప్పలు చెప్పుకుంటున్నాయని, జిల్లా నుంచి మాత్రం గుజరాత్, ముంబయి ప్రాంతాలకు ప్రజలు వలసలు వెళ్లిపోతున్నారని ఇదేనా చేసిన అభివృద్ధి అని ప్రశ్నించారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం మాట్లాడుతూ అంబానీ, అదానీల ప్రయోజనాల కోసం తప్ప పేదల కోసం కేంద్ర ప్రభుత్వం ఆలోచించడం లేదని మిగతా 2లో

నేడు క్యాబినెట్

- చర్చకు పలు కీలక అంశాలు
- విశాఖకు తరలింపుపై తుది నిర్ణయం
- జిల్లాల పునర్విభజనపై చర్చ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర మంత్రిమండలి సమావేశం శుక్రవారం జరగనుంది. ఎన్నికలు సమీపిస్తుండటంతో ముఖ్యమైన నిర్ణయాలను సాధ్యమైనంత త్వరగా తీసుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది. దీంతో తాజా సమావేశంలోనూ పలు కీలక అంశాలు చర్చకు రానున్నాయని తెలిసింది. విశ్వసనీయ సమాచారం ప్రకారం పెట్టుబడుల అంశంతో పాటు విశాఖకు తరలివెళ్లడం, జిల్లాల పునర్విభజన తదితర అంశాలు చర్చకు వచ్చే అవకాశం ఉంది. విశాఖలో ట్రాన్సిట్ వసతి సౌకర్యాలపై రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన త్రిసభ్య కమిటీ ఇటీవల నివేదిక ఇచ్చిన నేపథ్యంలో ఈ అంశంపై తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని భావిస్తున్నారు. దీంతోపాటు నూతనంగా ఏర్పాటు చేసిన జిల్లాల్లో పాలనాపరంగా ఎదురవుతున్న మిగతా 2లో

క్యూబాపై దిగ్బంధనం ఎత్తివేయండి

- ఐరాస 187-2 ఓట్ల తేడాతో తీర్మానం
- ఇలా తీర్మానం చేయడం ఇది వరుసగా 31వ సారి

న్యూయార్క్: క్యూబాపై అమెరికా అక్రమ దిగ్బంధనాన్ని తొలగించాలని కోరుతూ ఐక్యరాజ్య సమితి ఒక తీర్మానాన్ని అత్యధిక మెజార్టీతో బుధవారం ఆమోదించింది. 63 ఏళ్లుగా ఈ చిన్ని సోషలిస్టు ద్వీప దేశంపై కొనసాగిస్తున్న దిగ్బంధనానికి స్వస్తి పలకాలని కోరుతున్న తీర్మానానికి అనుకూలంగా 187 దేశాలు ఓటు వేయగా, కేవలం రెండే రెండు దేశాలు (అమెరికా, ఇజ్రాయిల్) దీనిని వ్యతిరేకించాయి. ఉక్రెయిన్ ఓటింగ్‌కు గైర్హాజరైంది. అమెరికా దిగ్బంధనానికి వ్యతిరేకంగా ఐరాస తీర్మానం చేయడం వరుసగా ఇది 31వ సారి. క్యూబా విదేశాంగ మంత్రి బ్రూనో రొడ్రిగజ్ పెరిల్లా మాట్లాడుతూ, క్యూబాపై అమెరికా ఆర్థిక యుద్ధం సాగిస్తోందని, దాని ఒత్తిళ్లకు లొంగి తృతీయ దేశాల్లో బ్యాంకులు కూడా క్యూబాతో వ్యాపారానికి భయపడుతున్నాయని అన్నారు. లాటిన్ అమెరికా, కరీబియన్ దేశాల తరపు ప్రతినిధి ఇంగా రోద్నా కింగ్ మాట్లాడుతూ, క్యూబాను ఉగ్రవాద దేశాల జాబితాలో చేర్చి అమెరికా కొనసాగిస్తున్న ఆంక్షలను తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని చెప్పారు. ఐరాసలో వెనిజులా రాయబారి మెనిసా రాంబల్లి మాట్లాడుతూ,అమెరికా విధించిన ఈ ఆర్థిక దిగ్బంధనం ఐరాస నియమావళికి పూర్తి విరుద్ధమన్నారు. లండన్ కేంద్రంగా పనిచేస్తున్న క్యూబా సాలిడారిటీ క్యాంపెయిన్ మద్దతుదారులు బ్రిటన్‌లోని అమెరికా రాయబారికి ఒక లేఖ రాస్తూ, క్యూబాపై దిగ్బంధనాన్ని తక్షణమే ఎత్తివేయాలని, ఉగ్రవాద దేశాల జాబితా నుంచి క్యూబా పేరును తొలగించాలని డిమాండ్ చేశారు. ఐరాస జనరల్ అసెంబ్లీలో క్యూబాకు మద్దతుగా నిలిచిన అంతర్జాతీయ సమాజానికి క్యూబా విదేశాంగ మంత్రి రొడ్రిగజ్ కృతజ్ఞతలు తెలిపారు.

ఫిబ్రవరి 8న పాక్ ఎన్నికలు

ఇస్లామాబాద్ : పాకిస్తాన్ సార్వత్రిక ఎన్నికలు వచ్చే ఏడాది ఫిబ్రవరి 8న జరగనున్నాయి. అధ్యక్షుడు అరిఫ్ అల్వీ, పాకిస్తాన్ ఎన్నికల సంఘం గురువారం ఈ మేరకు ఒక అంగీకారానికి వచ్చాయి. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు ఇరువురి మధ్య జరిగిన సమావేశంలో ఈ మేరకు అంగీకారం కుదిరింది. దీంతో పాక్ ఎన్నికలపై నెలల తరబడి కొనసాగుతున్న అనిశ్చితికి తెరపడింది. అధ్యక్షుడితో సమావేశం అయిన తరువాత ప్రధాన ఎన్నికల కమిషనర్ రజా అధ్యక్షునికి పంపిన లేఖలో సాధారణ ఎన్నికలు ఫిబ్రవరి 11న జరపాలని ప్రతిపాదించారు. లేఖ అందిన గంట తరువాత అధ్యక్ష భవనం ఒక ప్రకటన చేస్తూ, సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు ఎన్నికల సంఘానికి చెందిన నల్గురు కమిషనర్లు అధ్యక్షునితో సమావేశమయ్యారని, ఫిబ్రవరి8న ఎన్నికలు నిర్వహించాలని ఏకగ్రీవంగా నిర్ణయించడం జరిగిందని తెలియజేసింది. దీంతో ప్రధాన ఎన్నికల అధికారి ఒక ప్రకటన చేస్తూ అధ్యక్ష భవనం చేసిన ప్రకటనతో ఏకీభవిస్తున్నామని తెలిపారు.

24 స్థానాల్లో పోటీ

- తొలి జాబితాలో 17 స్థానాల ప్రకటన
- బిజెపిని ఓడించడమే మా లక్ష్యం
- సిపిఐ పోటీ చేసే స్థానాల్లో మద్దతిస్తాం
- తెలంగాణ సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

అసెంబ్లీ ఎన్నికల్లో ఒంటరిగానే బరిలోకి దిగాలని నిర్ణయించామని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. అనివార్య పరిస్థితుల్లోనే విడిగా పోటీ చేయాలన్న నిర్ణయానికి వచ్చామనీ, దీన్ని ప్రజలంతా అర్థం చేసుకోవాలని కోరారు. 24 సీట్లకు పోటీ చేయాలని ప్రతిపాదనలు వచ్చాయనీ, మొదటి విడతలో 17 స్థానాలను ప్రకటిస్తున్నామని వివరించారు. రెండు, మూడు రోజుల్లో మిగిలిన స్థానాలనూ, అభ్యర్థులను ప్రకటిస్తామన్నారు. గురువారం హైదరాబాద్‌లోని ఎంబి భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... అవమానకరంగా పొత్తుల కోసం వెళ్లాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. మిర్యాలగూడ, వైరా ఇస్తే కాంగ్రెస్‌తో పొత్తులో ఉంటామనీ, లేదంటే తమ నిర్ణయాన్ని ప్రకటిస్తామంటూ నాలుగు రోజుల కిందటే ప్రకటించామని చెప్పారు. కాంగ్రెస్ విజ్ఞప్తి మేరకు గురువారం మధ్యాహ్నం వరకు వారి నిర్ణయం కోసం ఎదురు చూశామని అన్నారు. వారు ఏమీ తేల్చని స్థితిలో ఒంటరిగా బరిలోకి దిగాలని నిర్ణయించామని చెప్పారు. కాంగ్రెస్ అనుసరించిన అపసవ్యమైన విధానమే ఇందుకు కారణమన్నారు. అధికారంలోకి వచ్చాక వామపక్షాలకు చెరో ఎమ్మెల్సీ, మంత్రి పదవులిస్తామంటూ ఓ కాంగ్రెస్ మిగతా 2లో

యాత్ర బృందానికి స్వాగతం పలుకుతూ బైక్‌ర్యాలీ చేపట్టిన ప్రజానీకం

అభివృద్ధి పేరిట ఆదివాసీలకు అన్యాయం

- గిరిజనుల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్ర నిర్లక్ష్యం
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు
- అరకులోయ, డుంబ్రిగుడ, ముంచంగిపుట్టుల్లో ప్రజారక్షణ భేరి సభలు

డుంబ్రిగుడలో జరిగిన భారీ ర్యాలీలో వి.శ్రీనివాసరావు, సురేంద్ర తదితరులు

ప్రజాశక్తి - అరకులోయ (అల్లూరి సీతారామరాజు జిల్లా)

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అభివృద్ధి పేరుతో ఆదివాసీల కళ్లలో దుమ్ము కొడుతున్నాయని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు విమర్శించారు. పాలకులు అనుసరిస్తోన్న ప్రజా వ్యతిరేక విధానాలను తెలియజెప్పేందుకు పార్వతీపురం మన్యం జిల్లా సీతంపేటలో సిపిఎం ఆధ్వర్యాన ప్రారంభమైన ప్రజా రక్షణ భేరి బస్సు యాత్ర గురువారం అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి, అరకులోయ, డుంబ్రిగుడ, ముంచంగిపుట్టు మండలాల్లో సాగింది. ఆయా చోట్ల ఏర్పాటు చేసిన బహిరంగ సభల్లో వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ.. గిరిజన ప్రాంతంలోని ఖనిజ సంపదను దోచుకోవడానికి ఈ ప్రాంతంలో జాతీయ రహదారులు వేస్తున్నారని తెలిపారు. అదానీ వంటి కార్పొరేట్ శక్తులకే ఈ రహదారులు ఉపయోగపడనున్నాయని చెప్పారు. వాస్తవానికి మారుమూల గిరి గ్రామాలకు నేటికీ రోడ్లు లేవన్నారు. గిరిజనులకు విద్య, వైద్యం అందని ద్రాక్షగా మారాయని తెలిపారు. గిరిజనుల సంపదను గద్దల్లా తన్నుకుపోవడానికి కార్పొరేట్ శక్తులు ఏజెన్సీపై కన్నేశాయన్నారు. 15 ఏళ్ల క్రితం అటవీ సంరక్షణ చట్టం సిపిఎం పోరాట ఫలితంగా రాగా, ఆ చట్టాన్ని సవరించి గిరిజనులకు ద్రోహం చేయడానికి మోడీ ప్రభుత్వం పూనుకుందన్నారు. పట్టాలు ఇచ్చిన పోడు భూములను కూడా లాక్కోవడానికి కుట్రలు సాగుతున్నాయని తెలిపారు. ఆదివాసీల ఉనికిని దెబ్బకొట్టాలని చూస్తే ఖబడ్దార్ అని హెచ్చరించారు. గిరిజనుల సంపదను కొల్లగొడుతుంటే గిరిజన ఎమ్మెల్యేలు, ఎంపిలు కళ్లప్పగించి చూస్తున్నారని విమర్శించారు. బిజెపి ప్రభుత్వ హయాంలో గిరిజన సంస్కృతిపై దాడి తీవ్రమైందన్నారు. మోడీ పల్లకిని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మోస్తున్నారని విమర్శించారు. అరకు గడ్డపై గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు చేస్తామని ప్రకటించిన ముఖ్యమంత్రి ఎందుకు నిర్మించలేదో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఈసారి ఎన్నికల్లో డబ్బుతో ఓట్లు కొనే వారిని తరిమి కొట్టాలని పిలుపునిచ్చారు. ప్రపంచంలోనే గుర్తింపు పొందిన అరకు కాఫీకి గిట్టుబాటు ధర కరువైందన్నారు. ఏజెన్సీ ప్రాంతంలోని సంపాదంతా దళారుల పాలవుతోందని తెలిపారు. టిడిపి, జనసేనలు కేంద్రం మోసాలపై నోరు మెదపకపోవడం సరికాదన్నారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కిల్లో సురేంద్ర మాట్లాడుతూ ఏజెన్సీలో సమస్యల పరిష్కారానికి విప్లవ వీరుడు అల్లూరి స్ఫూర్తితో పోరాటం చేయాలని కోరారు. వైసిపి హయాంలో నాలుగున్నరేళ్లలో ఏ ఒక్క గిరిజన సమస్యా పరిష్కారం కాలేదన్నారు. యాత్రలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు డి.సుబ్బారావు, అశోక్, అల్లూరి జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స, రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

యాత్రా బృందానికి స్వాగతం

అరకులోయలోని ఎన్‌టిఆర్ గ్రౌండ్ నుంచి గిరిజన మ్యూజియం వరకు చేపట్టిన థింసా నృత్యాలు అలరించాయి. మండల కేంద్రాల్లో వందలాది మందితో భారీ ప్రదర్శన సాగింది. గిరిజన మ్యూజియంలో పని చేస్తున్న తమకు కలెక్టర్ గెజిట్ ప్రకారం ఐటిడిఎ అధికారులు జీతాలు పెంచలేదంటూ పలువురు వి.శ్రీనివాసరావు ఎదుట తమగోడును వెళ్లబోసుకున్నారు. పోడు భూముల సమస్యలపై పలువురు వినతిపత్రాలు అందజేశారు.

రాష్ట్రంలో కుర్చీల కొట్లాట

- ప్రజా ప్రణాళికను పార్టీల ముందుంచుతాం
- ప్రజారక్షణ భేరీ సభలో సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎంఎ.గఫూర్

ప్రజాశక్తి- యంత్రాంగం

రాష్ట్రంలో కుర్చీల కొట్లాట సాగుతున్నదని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎంఎ.గఫూర్ అన్నారు. అధికార వైసిపి, ప్రతిపక్ష పార్టీలకు ప్రజాసమస్యలు పట్టడం లేదని విమర్శించారు. యాత్రలకు అడుగడుగునా ప్రజలు స్వాగతం పలికారు. యాత్ర బృందానికి సంఘీభావం తెలుపుతూ వందలాది మంది ప్రజలు ప్రదర్శన చేపట్టారు. అనంతపురం నగరంలో టవర్‌క్లాక్ నుంచి బహిరంగ సభ జరిగే నగర పాలక సంస్థ కార్యాలయం వరకు భారీ ప్రదర్శన జరిగింది. అనంతరపురం గుత్తిలో ప్రారంభమైన యాత్ర, పామిడి, అనంతపురం, పెనుకొండ, హిందూపురం మీదుగా పుట్టపర్తికి చేరుకుంది. పలు చోట్ల జరిగిన బహిరంగ సభల్లో ఎంఎ.గఫూర్ ప్రసంగించారు. విభజన హామీలు అమలు చేయకుండా రాష్ట్రానికి బిజెపి ఏ రకంగా మోసం చేసిందో ప్రజలకు వివరించారు. రాష్ట్రంలో తీవ్రమైన కరువు పరిస్థితులు నెలకొన్నాయన్నారు. ఈ నాలుగున్నరేళ్లలో రాష్ట్రం ప్రభుత్వం తీసుకొచ్చిన అప్పులు రూ.10 లక్షల కోట్లు అని, సంక్షేమం కింద ఖర్చు చేసింది కేవలం రూ.2.50 లక్షల కోట్లు మాత్రమేనని పేర్కొన్నారు. వైఎస్.జగన్మోహన్‌రెడ్డి కుర్చీ దిగితే తాము కుర్చీ ఎక్కాలన్న యోచన తెలుగుదేశం పార్టీ ఉందన్నారు. వారికి ప్రజా సమస్యలు పట్టడం లేదని విమర్శించారు. ఇందుకోసమే ప్రజా సమస్యలను ప్రధాన అజెండాగా తీసుకుని ప్రజారక్షణ భేరి యాత్రను సిపిఎం చేపట్టిందని వివరించారు. రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. కరువు మండలాల ప్రకటనలోనూ ప్రభుత్వం సరైన విధానాన్ని అనుసరించలేదని తెలిపారు. రాష్ట్రకమిటీ సభ్యులు దయా రమాదేవి మాట్లాడుతూ.. విభజన హామీలను అమలు చేయకుండా రాష్ట్రానికి బిజెపి అన్యాయం చేసిందన్నారు. కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేస్తామన్న హామీని అధికారంలోకి వచ్చాక సిఎం విస్మరించారని సిపిఎం రాష్ట్ర నాయకులు ఉమామహేశ్వరరావు విమర్శించారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.కృష్ణయ్య, వి.రాంభూపాల్, తదితరులు పాల్గొన్నారు.

యాత్ర బృందానికి సమస్యలు ఏకరువు

అనంతపురం, సత్యసాయి జిల్లాలో జరుగుతున్న పర్యటనలో అనేక సమస్యలను బృందం దృష్టికి ప్రజలు తీసుకొచ్చారు. అర్హులైన వారికి ఇళ్ల పట్టాలివ్వాలని, కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని, తదితర సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని, సమస్యలను పరిష్కరించే దిశగా పోరాటాలు చేయాలని కోరుతూ నాయకులకు వినతిపత్రాలు అందజేశారు. ఈ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా నవంబర్ 15వ తేదీన విజయవాడలో జరిగే సభలో ప్రజాఅజెండాను అందరి ముందుంచుతామని నాయకులు పేర్కొన్నారు.

రాజకీయ లబ్ధి కోసమే కెసిఆర్ వ్యాఖ్యలు

- సజ్జల రామకృష్ణారెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆంధ్రప్రదేశ్‌లో రోడ్ల పరిస్థితిపై వాస్తవాలు తెలుసుకోకుండా రాజకీయ లబ్ధి కోసం అధ్వానంగా వున్నాయని తెలంగాణ సిఎం కెసిఆర్ విమర్శలు చేయడం తగదని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి అన్నారు. రాష్ట్రంలోని రోడ్లపై కెసిఆర్ చేసిన వ్యాఖ్యలపై గురువారం సజ్జల మీడియాతో మాట్లాడారు. తెలంగాణ కంటే ఆంధ్రప్రదేశ్ అన్ని రంగాల్లో ముందుందన్నారు. ఏడు విలీన మండలాల ప్రజలు మళ్లీ తెలంగాణకు వెళ్లేందుకు ఏమాత్రం సుముఖత వ్యక్తం చేయడం లేదన్నారు. రాష్ట్ర సరిహద్దు గ్రామాల్లోని తెలంగాణ ప్రజలు తమకు ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి కావాలని కోరుకుంటున్నారని తెలిపారు. ఎపిలో పెన్షన్ పంపిణీ బాగుందని కెసిఆర్ స్వయంగా ప్రకటన చేశారని గుర్తుచేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కోటి 60 లక్షల కుటుంబాలకు నేరుగా సంక్షేమ పథకాలు అందుతున్నాయని తెలిపారు. ఈ రికార్డును ఎవరూ కాదనలేని సత్యమని పేర్కొన్నారు. చంద్రబాబు అబద్ధాలతో బెయిల్ తెచ్చుకున్నారని అన్నారు. అనారోగ్యంగా వుంటే 14 గంటలపాటు కారులో ఎలా కూర్చుంటారని ప్రశ్నించారు. హైదరాబాద్‌లో తమ ప్రైవేటు వ్యాపారాలను రక్షించుకునే వారు ర్యాలీలో పాల్గొన్నారన్నారు. తమ పార్టీ ఎమ్మెల్యేలు కూడా ఆ తరహా ర్యాలీలు చేయగలరని ఎద్దేవా చేశారు. వాహనాలు అడ్డంగా పెట్టి ట్రాఫిక్ జామ్ చేశారని అన్నారు.

పొగాకు బోర్డు చైర్మన్‌గా యశ్వంత్

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

భారత పొగాకు బోర్డు నూతన చైర్మన్‌గా సిహెచ్.యశ్వంత్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ప్రకాశం జిల్లాకు చెందిన యశ్వంత్‌ను బోర్డు చైర్మన్‌గా క్యాబినెట్ వ్యవహారాల నియామకాల కమిటీ ఎంపిక చేసింది. గుంటూరులోని పొగాకు బోర్డు కేంద్ర కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రైతుల సంక్షేమం కోసం కృషి చేస్తానని తెలిపారు. రైతులకు, వ్యాపారులకు మధ్య సమన్వయం చేసుకుంటూ బోర్డును అభివృద్ధి పథంలో నడిపిస్తానని చెప్పారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

గిరిజన ఉప ప్రణాళిక నిధులపై..

శ్వేతపత్రం విడుదల చేయాలి

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

ప్రజాశక్తి - అరకులోయ (అల్లూరి సీతారామరాజు జిల్లా)

గిరిజన ప్రాంత అభివృద్ధి, ఉప ప్రణాళిక నిధులపై ప్రభుత్వం శ్వేత పత్రం విడుదల చేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. పాలకుల నిర్లక్ష్యం వల్లే గిరిజన ప్రాంతం వెనుకబాటుతనానికి గురైందని తెలిపారు. సిపిఎం చేపట్టిన ప్రజా రక్షణ భేరి బస్సు యాత్ర గురువారం అల్లూరి సీతారామరాజు జిల్లా అరకులోయకు చేరుకుంది. ఈ సందర్భంగా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటీ ఈ ప్రాంతంలో నెరవేరలేదన్నారు. గిరిజన ప్రాంతం వెనుకబాటుతనానికి మోడీ, జగన్‌మోహన్‌రెడ్డే బాధ్యత వహించాలన్నారు. గిరిజనుల కోసం విజయనగరంలో ఏర్పాటు చేసిన కేంద్రీయ విశ్వవిద్యాలయంలో ఎటువంటి సౌకర్యాలూ లేవని తెలిపారు. రాజమండ్రి నుంచి విజయనగరం వరకు వేస్తున్న జాతీయ రహదారి ఎవరి అభివృద్ధి కోసమని ప్రశ్నించారు. గిరిజనులపై ప్రేమ, మమకారం ఉంటే మారుమూల గిరిజన ప్రాంతాలకు రోడ్డు సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. జాతీయ రహదారి గిరిజనుల అభివృద్ధి కోసం కాదని, అదానీలాంటి వారి అభివృద్ధి కోసమని చెప్పారు. ఏజెన్సీ ప్రాంతంలో నిక్షిప్తమై ఉన్న సంపదను లూటీ చేయడం కోసమే ఆ రహదారి వేస్తున్నారని తెలిపారు. అనంతగిరి మండలంలో రేషన్ బియ్యం విడిపించుకోవడానికి 12 నుంచి 20 కిలోమీటర్ల వరకు నడిచి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో 107 పాఠశాలలను మూసివేయడం దారుణమన్నారు. ఈ ప్రాంతంలోని వెయ్యి ఉపాధ్యాయ పోస్టులను తొలగించినట్లు తెలిపారు. గిరిజన ప్రాంతంలో ఒక్క ఇంజినీరింగ్ కళాశాల కూడా లేకపోవడం బాధాకరమన్నారు. ఒక్క జగనన్న ఇళ్లు కూడా ఏజెన్సీలో నిర్మితం కాలేదన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనుల పక్షాన నిరంతరం పోరాడుతున్నది సిపిఎం మాత్రమేనన్నారు. బిజెపికి మద్దతునిచ్చే ఏ పార్టీతోనూ తాము పొత్తు పెట్టుకునే ప్రసక్తి లేదని విలేకరులు అడిగిన ఓ ప్రశ్నకు సమాధానమిచ్చారు. రానున్న ఎన్నికల్లో అరకు అసెంబ్లీ, పార్లమెంటు స్థానాల్లో సిపిఎం పోటీ చేస్తుందని, ప్రజలు ఆదరించి బలపరచాలని, అప్పుడే గిరిజన ప్రాంతంలోని సమస్యలకు పరిష్కార మార్గం దొరుకుతుందని తెలిపారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కిల్లో సురేంద్ర, అల్లూరి జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స, పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు డి.సుబ్బారావు, అశోక్, నాయకులు ఎం.సూర్యనారాయణ, హైమావతి పాల్గొన్నారు.

మడ అడవుల రక్షణకు చర్యలు

- అధికారులకు సిఎస్ ఆదేశం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో మడ అడవులు ఆక్రమణలకు గురికాకుండా కాపాడటంతోపాటు మరిన్ని ప్రాంతాల్లో పెంపకానికి చర్యలు తీసుకోవాలని అధికారులను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కెఎస్ జవహర్‌రెడ్డి ఆదేశించారు. గురువారం వెలగపూడి సచివాలయంలో సిఎస్ అధ్యక్షతన కాంపా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సిఎస్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న మడ అడవులు ఆక్రమణకు గురికాకుండా కాపాడటంతోపాటు తీర ప్రాంత జిల్లాల్లో అవకాశం ఉన్నచోట్ల మరిన్ని ప్రాంతాల్లో పెంచేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. అంతకుముందు పిసిసిఎఫ్ వై మధుసూదన్‌రెడ్డి పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా అజెండా అంశాలను వివరిస్తూ 2022-23 వార్షిక ప్లాను ఆఫ్ ఆపరేషన్స్ అమలుకు సంబంధించి తీసుకున్న చర్యలను వివరించారు. అదే విధంగా కాంపా 2023-24 వార్షిక ప్లాన్ ఆపరేషన్స్‌కు సంబంధించి రూ.259 కోట్ల ప్లానును నేషన్ అథారిటీ ఆఫ్ కాంపా ఆమోదానికి సమర్పించామని తెలిపారు. వీటితోపాటు అజెండాలో వివిధ అంశాలను వాటిపై తీసుకుంటున్న చర్యల గురించి వివరించారు. కాంపా పిసిసిఎఫ్ బికె సింగ్, ఎపి పిసిఎఫ్ శాంతిప్రియ పాండే, ఇఎఫ్ఎస్‌టి స్పెషల్ సెక్రటరీ పివి చలపతిరావు తదితరులు పాల్గొన్నారు.

పలాస, రాయగడ రైలు సేవలు పునఃప్రారంభం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

వాల్తేరు డివిజన్‌లో విశాఖపట్నం - పలాస ప్యాసింజర్ రైలును గురువారం పునఃప్రారంభించారు. రోజువారీ ప్రయాణికులు, ఉద్యోగులు, విద్యార్థుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని అందుబాటులో ఉన్న స్టాక్‌తో రైళ్లను నడపడానికి డిఆర్‌ఎం సౌరభ్ ప్రసాద్ చొరవ తీసుకున్నారు. రైలు ప్రమాదంపై రైల్వే సేఫ్టీ కమిషనర్ విచారణ రెండో రోజైన గురువారమూ కొనసాగింది. రైలు ప్రమాదంలో మృతి చెందిన వారికి సంతాపంగా రెండు నిమిషాలపాటు అధికారులు మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌ఎం సౌరభ్ ప్రసాద్, ఎడిఆర్‌ఎం ఇన్‌ఫ్రా సుధీర్ కుమార్‌గుప్తా, ఎడిఆర్‌ఎం ఆపరేషన్స్ మనోజ్‌కుమార్ సాహూ, డిఆర్‌ఎం కార్యాలయంలోని అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ ఇడి కార్యాలయానికి ర్యాలీగా వెళ్తున్న కార్మికులు

'ఉక్కు' యాజమాన్యం కుట్రలపై కార్మికుల ధర్నా

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

స్టీల్‌ప్లాంట్‌పైనా, కార్మికులపైనా యాజమాన్యం అవలంబిస్తోన్న కుట్రలను ఉద్యమాలతో తిప్పికొడతామని స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) గౌరవాధ్యక్షులు జె.అయోధ్యరామ్ అన్నారు. స్టీల్ కార్మికులకు సకాలంలో వేతనాలు చెల్లించాలని, పూర్తి స్థాయి ఉత్పత్తితో కర్మాగారం నడిచేలా చూడాలని డిమాండ్ చేస్తూ స్టీల్ సిఐటియు, మిత్రపక్షాల ఆధ్వర్యంలో స్టీల్‌ప్లాంట్ మెయిన్ గేటు వద్ద గురువారం ధర్నా జరిగింది. అనంతరం కార్మికులంతా ఇడి కార్యాలయానికి పాదయాత్రగా వెళ్లి అక్కడ ఆందోళన చేశారు. ఈ సందర్భంగా అయోధ్యరామ్ మాట్లాడుతూ యాజమాన్యం కావాలనే ఉద్యోగులకు సకాలంలో జీతాలు చెల్లించడం లేదన్నారు. సంఘం ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి మాట్లాడుతూ ప్లాంట్‌ను అష్టదిగ్బంధనం చేసి ఏదో విధంగా జిందాల్‌ను ప్లాంట్‌లోకి తీసుకురావాలనే కుట్రలో భాగంగానే విశాఖ ఉక్కుకు నష్టాలు వచ్చేలా చేస్తున్నారన్నారు. స్టీల్ సిఎమ్‌డి తన వైఖరిని మార్చుకోకుంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కోకతప్పదని హెచ్చరించారు. సంఘం అధ్యక్షులు వైటి.దాస్, మిత్రపక్షాల నాయకులు డివి.రమణారెడ్డి, డి.సురేష్ బాబు, సిహెచ్.సన్యాసిరావు మాట్లాడుతూ జిందాల్‌ను ఎట్టి పరిస్థితుల్లోనూ ప్లాంట్‌లోకి రానిచ్చేదిలేదన్నారు. కార్యక్రమంలో నాయకులు పి.శ్రీనివాసరాజు, బి.అప్పారావు, గంగాధర్, పెద్ద సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

జగన్ మానసిక స్థితిపై నివేదిక పంపాలి : లోకేష్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

తమ పార్టీ అధినేత చంద్రబాబుపై రోజుకో తప్పుడు కేసు పెడుతోన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మానసిక పరిస్థితి ఆందోళనకర స్థాయికి చేరిందని టిడిపి ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ విమర్శించారు. సిఎం పదవిలో ఉండేందుకు జగన్ అనర్హులని, గవర్నరు తక్షణమే జోక్యం చేసుకుని కేంద్రానికి నివేదిక పంపాలని గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. సిఐడిని వైసిపి అనుబంధ విభాగంగా మార్చుకుని ప్రతిపక్ష నేతపై కేసుల మీద కేసులు పెట్టడం దేశచరిత్రలో ఎక్కడా లేదని పేర్కొన్నారు. అధికారాన్ని రాజకీయ కక్షసాధింపు కోసం వాడుకుంటున్న పరిస్థితిపై కేంద్రానికి నివేదికలు పంపాల్సిన అవసరం ఉందని అన్నారు. జగన్ దోపిడీని కప్పిపుచ్చుకునేందుకు చంద్రబాబుపై రోజుకో అక్రమ కేసు బనాయిస్తున్నారని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కె అచ్చెన్నాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఇసుక మాఫియా ద్వారా రూ.40 వేలకోట్లు దోచేసిన ఇసుకాసురుడు జగన్ అని ఆరోపించారు. సిబిఐ, ఇడి తన అక్రమాలను విచారణ చేయడానికి ముందే అవే అంశాల్లో చంద్రబాబును బద్నాం చేద్దామని జగన్ కుట్ర పన్నారని ఆ పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి విమర్శించారు.

మొక్కుబడిగా కరువు మండలాల ప్రకటన : ధూళిపాళ్ల నరేంద్ర

రాష్ట్ర వ్యాప్తంగా 470 మండలాల్లో కరువు ఉంటే, రాష్ట్ర ప్రభుత్వం మొక్కుబడిగా 103 మండలాలనే ప్రకటించిందని టిడిపి నేత ధూళిపాళ్ల నరేంద్రకుమార్ విమర్శించారు. ప్రాంతాలవారీ పడాల్సిన వర్షం, పడిన వర్షాన్ని లెక్కలోకి తీసుకోకుండా ప్రకటించడం బాధాకరమన్నారు. రైతుల్ని మోసగించడానికే మొక్కుబడిగా ప్రకటించారని విమర్శించారు.

నేడు క్యాబినెట్

(మొదటి పేజీ తరువాయి)

సమస్యలను చర్చించనున్నారని తెలిసింది. కొన్ని జిల్లాలను రద్దు చేయడంతో పాటు పోలవరం జిల్లాను నూతనంగా ప్రతిపాదించే అంశంపై చర్చ జరిగే అవకాశం ఉందని సమాచారం. మంత్రివర్గంలో వ్యక్తమయ్యే అభిప్రాయాలకు అనుగుణంగా దీనిపై నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. చంద్రబాబు హయాంలో భారీ అవినీతి జరిగిందని ఆరోపిస్తున్న నేపథ్యంలో దానికి సంబంధించి చర్యలు తీసుకోవడానికి ఒకటి, రెండు ప్రభుత్వ శాఖలకు మంత్రిమండలి అనుమతి ఇచ్చే అవకాశం ఉందని తెలిసింది. పేదలకు ఇళ్ల స్థలాల కేటాయింపుపై కూడా నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని సమాచారం.

సిఐ నరేంద్రరెడ్డిపై చర్య తీసుకోవాలి

- ఎస్‌సి కమిషన్‌కు ప్రజా సంఘాల వినతి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కులం పేరుతో దూషించిన సిఐ నరేంద్రరెడ్డిపై చర్య తీసుకోవాలని ప్రజా సంఘాల నాయకులు, కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం నాయకులు ఎస్‌సి కమిషన్‌ను కోరారు. ఈ మేరకు కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంద్ర మాల్యాద్రి, నాయకులు చింతల శ్రీనివాస్, గోరుగుంట అరుణ, డివైఎఫ్ఐ నాయకులు జి రామన్న గురువారం విజయవాడలోని ఎస్‌సి కమిషన్ కార్యాలయంలో కమిషన్ ఛైర్మన్ విక్టర్ ప్రసాదుకు వినతిపత్రం సమర్పించారు. అనంతపురం జిల్లా గార్లదిన్న మండలం కల్లూరులో ప్రభుత్వ స్థలంలో గత నాలుగేళ్లుగా 150 మంది పేదలు గుడిసెలు వేసుకుని జీవిస్తుండగా, నవంబరు ఒకటో తేదీ తెల్లవారుజామున పోలీసులు కూల్చివేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. పేదలకు అండగా హైకోర్టు ఆర్డర్ ఉండగా, అనంతపురం రూరల్ డిఎస్‌పి ఆధ్వర్యాన ఐదుగురు సిఐలు, ఎమినిమిమంది ఎస్ఐలు, పదుల సంఖ్యలో పోలీసులు, నాలుగు జెసిబిలతో స్థానిక అధికార పార్టీ అనుచరులను వెంటబెట్టుకుని ఇంటిలో నిద్రిస్తున్న వారిని భయపెట్టి ఇళ్లను కూల్చివేశారన్నారు. విషయం తెలుసుకున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి రాంభూపాల్ అక్కడకు వెళ్లగా ఇటుకలపల్లి సిఐ వై నరేంద్రరెడ్డి.. రాంభూపాల్‌ను కొట్టి, కాలర్ పట్టి లాగుతూ బండ బూతులు తిడుతూ దౌర్జన్యం చేశారని కమిషన్‌కు వివరించారు. కుల దురహంకార ఘటనకు కారణమైన సిఐ నరేంద్రరెడ్డిపై చర్యలు తీసుకోవాలని ఎస్‌సి కమిషన్‌కు విజ్ఞప్తి చేశారు. అలాగే కూల్చివేసిన గుడిసెలను పునరుద్ధరించాలని కోరారు. వినతిపత్రంపై వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి వెంకటేశ్వర్లు, కెవిపిఎస్ సహాయ కార్యదర్శి క్రాంతికుమార్ కూడా సంతకం చేశారు.

మందసలో ప్రదర్శనగా వెళ్తున్న సిపిఎం నాయకులు

ఒక్కో లేఖలో ఒక్కో అంకెలా..?

యనమలకు బుగ్గన ప్రశ్న

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

మాజీ ఆర్థికమంత్రి యనమల రామకృష్ణుడు రాష్ట్ర ఆర్థికస్థితిపై రాస్తున్న ఉత్తరాల్లో ఒకే అంశంపై ఒక్కో లేఖలో ఒక్కో అంకెను పేర్కొంటున్నారని ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. గురువారం సచివాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆ విధంగా లేఖలు రాయడం యనమలకు తగదని అన్నారు. వార్షిక రుణంపై ఒక్కో లేఖలో ఒక్కో అంకెను చెబుతున్నారని విమర్శించారు. నాలుగున్నరేళ్లలో 4.5 లక్షల కోట్లు రుణంగా తీసుకున్నట్లు చెబుతున్నారని, అయితే అందులో తెలుగుదేశం హయాంలో చేసిన అప్పుకూడా ఉందన్నది యనమల మరచినట్టున్నారని అన్నారు.

ఆదాయంపైనా ఆయన అసత్య ప్రచారం చేస్తున్నారని, వారి హయాంలో కేవలం ఆరు శాతం ఆదాయ వృద్ధి కనిపించగా, తమ పాలనలో 16.7 శాతం వృద్ధి నెలకొందని చెప్పారు. కరోనా కాలంలో కష్టాలు ఉన్నప్పటికీ ఆదాయం పెరిగిందని గుర్తు చేశారు.

సబ్‌ప్లాన్‌లో టిడిపి చేసిందేమిటి

అట్టడుగు వర్గాలకు తెలుగుదేశం పాలనలో చేసిందేమీ లేదని బుగ్గన వ్యాఖ్యానించారు. 2014-15 నుంచి 2019 వరకు బిసి సబ్‌ప్లాన్‌కు రూ.30,975 కోట్లు, గిరిజన సబ్‌ప్లాన్‌కింద రూ.11,454 కోట్లు, ఎస్‌సి సబ్‌ప్లాన్ కింద రూ.33,032 కోట్లు మాత్రమే ఖర్చుచేశారని చెప్పారు. మైనార్టీలకు ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయలేదన్నారు. అయితే 2019 నుంచి 2023 వరకు తమ పాలనలో మైనార్టీ సంక్షేమం కోసం 11,154 కోట్లు ఖర్చు చేయగా, గిరిజన సబ్‌ప్లాన్ కోసంరూ. 25,323 కోట్లు, ఎస్సీ సబ్‌ప్లాన్ కోసంరూ 74,429 కోట్లు ,బిసి సబ్‌ప్లాన్ కింద ఏకంగా రూ1,12,759 కోట్లు వ్యయం చేసినట్లు బుగ్గన తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబుపైనా ఆయన పలు విమర్శలు చేశారు. చంద్రబాబు ముఖ్యమంత్రి కాకముందు ఐటి రంగంలో రాష్ట్రం మూడో స్థానంలో ఉండేదని, ఆయన దిగిపోయేనాటికి ఐదో స్థానానికి పడిపోయిందని చెప్పారు.

సీమెన్స్‌దీ ఒక శిక్షణేనా?

స్కిల్ డెవలప్‌మెంట్ అంశంలో సీమెన్స్ పాత్రపై తలెత్తుతున్న వివాదాలపై స్పందించిన ఆయన సీమెన్స్‌దీ ఒక శిక్షణేనా అని ప్రశ్నించారు. ఆ సంస్థ సరైన శిక్షణ ఇవ్వలేదని అన్నారు.

సీమెన్స్ మాన్యువల్‌లోఉచితంగా శిక్షణ ఇస్తున్నట్లు ఉందని అయినా ప్రభుత్వం భారీగా నిధులు ఖర్చు చేసిందన్నారు. ఈ కేంద్రాల ఏర్పాటుకు టెండర్లు ఎందుకు పిలువలేదని ప్రశ్నించారు.

రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహించాలన్న బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు పురంధ్రీశ్వరి డిమాండ్‌పైనా బుగ్గన స్పందించారు. ఇప్పటికే రిజర్వ్‌బ్యాంకు, కాగ్ వంటి అత్యున్నత సంస్థలు ఆడిట్ చేస్తున్నాయి కదా... ఇప్పుడు కొత్తగా ఫోరెన్సిక్ ఆడిట్ ఎందుకని బుగ్గన ప్రశ్నించారు.

24 స్థానాల్లో పోటీ

(మొదటి పేజీ తరువాయి)

నాయకుడు వ్యాఖ్యానించారని అన్నారు. ప్రధాని పదవి ఇస్తామన్నా తృణప్రాయంగా వదిలేసిన చరిత్ర సిపిఎంకు ఉందన్నారు. కమ్యూనిస్టుల నిర్ణయాలకు ప్రాతిపదిక విధానాలే తప్ప పదవులు కాదన్నారు. తాము పోటీ చేయని నియోజకవర్గాల్లో బిజెపిని ఓడించగలిగేది బిఆర్ఎస్ అయితే బిఆర్ఎస్‌కు, కాంగ్రెస్ అయితే కాంగ్రెస్‌కు మద్దతు ఇస్తామని స్పష్టం చేశారు. బిజెపిని ఓడించడమే తమ లక్ష్యమన్నారు. కాంగ్రెస్‌తో సిపిఐ తెగదెంపులు చేసుకుని వస్తే మంచిదన్నారు. ఒకవేళ వారికి కాంగ్రెస్‌తో పొత్తున్నా సిపిఐ పోటీ చేసే చోట తాము పోటీ చేయబోమనీ, సిపిఐకే మద్దతిస్తామని స్పష్టం చేశారు. తాము ప్రకటించిన 17 స్థానాల్లోనూ ఒకటి, రెండు మార్పులుండొచ్చని అన్నారు. బిఆర్ఎస్, కాంగ్రెస్‌ను ఓడించడం తమ లక్ష్యం కాదని విలేకర్లు అడిగిన ఓ ప్రశ్నకు సమాధానమిచ్చారు. మ్యానిఫెస్టో కమిటీ వేశామనీ, త్వరలోనే విడుదల చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి, పోతినేని సుదర్శన్, జాన్ వెస్లీ, మల్లు లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పోటీ చేసే స్థానాలు

1. భద్రాచలం (ఎస్‌టి)
2. అశ్వరావు పేట (ఎస్‌టి)
3. పాలేరు
4. మధిర (ఎస్‌సి)
5. వైరా (ఎస్‌టి)
6. సత్తుపల్లి (ఎస్‌సి)
7. ఖమ్మం
8. మిర్యాలగూడ
9. నల్లగొండ
10. నకిరేకల్ (ఎస్‌సి)
11. భువనగిరి
12. హుజుర్‌నగర్
13. కోదాడ
14. జనగాం
15. ఇబ్రహీంపట్నం
16. పటాన్‌చెరు
17. ముషీరాబాద్

బిజెపితో దోస్తీ ప్రమాదం

(మొదటి పేజీ తరువాయి)

విమర్శించారు. డబుల్ ఇంజిన్ సర్కార్ అంటూ బిజెపి చెప్తోందని, తమకు మాత్రం రైతులు, కార్మికులు, కష్టజీవులే ట్రిపుల్ ఇంజిన్లు అని అన్నారు.

మా సమస్యలు పరిష్కారమయ్యేలా చూడరూ...

తమ సమస్యలు పరిష్కారమయ్యేలా చూడాలంటూ బస్సు యాత్ర బృందానికి రైతులు, గిరిజనులు, వ్యాపారులు, ఉపాధ్యాయులు, స్కీమ్‌వర్కర్లు వినతిపత్రాలు అందించారు. జీడి పిక్కలకు గిట్టుబాటు ధర దక్కలేదంటూ రైతులు అందించిన వినతిపత్రంపై విజూ కృష్ణన్ స్పందిస్తూ కేంద్ర వాణిజ్య మంత్రి, వ్యవసాయ మంత్రి దృష్టికి తీసుకెళ్తామని భరోసానిచ్చారు. తమ భూములు ఆక్రమణకు గురవుతున్నాయంటూ పలువురు గిరిజనులు అందించిన విన్నపంపై స్పందిస్తూ గిరిజన గ్రామాలను ఐదో షెడ్యూల్‌లో చేర్చే అంశానికి తమ వంతు మద్దతు ఉంటుందన్నారు. రాష్ట్రపతి, గిరిజనశాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్తామని హామీనిచ్చారు. సిపిఎస్ రద్దు, పాఠశాలల విలీనం సమస్యలపై యుటిఎఫ్ ఆధ్వర్యాన ఉపాధ్యాయులు, తమకు ఉద్యోగ భద్రత, పలుసమస్యలపై అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్యర్యాన అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు వినతిపత్రం అందించారు. సమస్యల పరిష్కారం కోసం తమవంతు కృషి చేస్తామని నాయకులు హామీనిచ్చారు.

అడుగడుగునా ఘన స్వాగతం

యాత్ర బృందానికి అడుగడుగునా ఘన స్వాగతం లభించింది. తొలుత మందస ప్రాంతానికి చేరుకున్న బృందం వీరగున్నమ్మ స్థూపానికి నివాళు లర్పించింది. మందస హైస్కూల్ నుంచి భారీ ప్రదర్శన చేపట్టారు. డప్పు కళాకారులు వాయిద్యాలతో స్వాగతం పలికారు. తప్పెట్లగుళ్ళు ప్రదర్శించారు. శ్రీకాకుళం మండలం పెద్దపాడు సమీపంలోని జాతీయ రహదారి నుంచి ఏడు రోడ్ల కూడలి వరకు భారీ ర్యాలీతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఎ.వి నాగేశ్వరరావు, కె.ధనలక్ష్మి, సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

'స్కిల్' అక్రమాల్లో నిగ్గు తేల్చండి

- 12 మంది ఐఎఎస్‌లపై సిఐడికి ఫిర్యాదు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

స్కిల్ డెవలప్‌మెంటు కార్పొరేషన్ అక్రమాల కేసులో 12 మంది ఐఎఎస్‌లను విచారించాలంటూ న్యాయవాది ప్రసాద్ సిఐడికి ఫిర్యాదు చేశారు. టిడిపి హయాంలో సీమెన్స్ ప్రాజెక్టు అమలు, పర్యవేక్షణ కమిటీల్లోని అధికారులను విచారణ పరిధిలోకి తీసుకురావాలని ఆయన ఫిర్యాదులో కోరారు. అజయ్‌కల్లం రెడ్డి, అజయ్ జైన్, ఎస్ఎస్ రావత్, రవిచంద్ర, ఉదయలక్ష్మి, ప్రేమ్‌చంద్రారెడ్డి, సిసోడియా, కెవి సత్యనారాయణ, శామ్యూల్ ఆనంద్‌కుమార్, కృతికా శుక్లా, అర్జున్ శ్రీకాంత్, జయలక్ష్మిపై కేసు నమోదు చేసి విచారించాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్రస్తుత స్కిల్ డెవలప్‌మెంటు కార్పొరేషన్ ఛైర్మన్ కొండూరు అజయ్‌రెడ్డి, అప్పటి సిఎమ్‌డి బంగారు రాజుతో పాటు కార్పొరేషన్‌లోని సిఎఫ్ఒ, సిఇఒ, ఇడిని విచారించాలని కోరారు. స్కిల్ డెవలప్‌మెంటు కార్పొరేషన్‌లో కాంట్రాక్టు కేటాయింపు, చెక్ పవర్‌తో సంబంధం ఉన్న వివిధ స్థాయిల్లోని అధికారులను కూడా విచారించాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

పశువుల కొనుగోలులో కుంభకోణం : నాదెండ్ల మనోహర్

ప్రజాశక్తి-తెనాలి (గుంటూరు జిల్లా)

చేయూత పథకం అధికార పార్టీ నాయకులకు కామధేనువుగా మారిందని, పాడి పశువుల కొనుగోలులోనూ కోట్లాది రూపాయల కుంభకోణానికి పాల్పడ్డారని జనసేన పిఎసి ఛైర్మన్ నాదెండ్ల మనోహర్ ఆరోపించారు. గుంటూరు జిల్లా తెనాలిలోని జనసేన పార్టీ కార్యాలయంలో ఆయన గురువారం మీడియాతో మాట్లాడుతూ.. 3.94 లక్షల పాడి పశువులను కొనుగోలు చేసినట్లు ప్రభుత్వం అసెంబ్లీలో ప్రకటించగా క్షేత్రస్థాయిలో 8 వేల పశువులే లెక్కతేలాయని అన్నారు. సెప్టెంబర్ 25న మహిళా సాధికారితపై శాసనసభలో జరిగిన చర్చలో మహిళా శిశు సంక్షేమశాఖ మంత్రి మాట్లాడుతూ మహిళల ఆర్థిక స్వావలంబన కోసం 2,08,790 పశువులను కొనుగోలు చేసినట్లు చెప్పారని, ఆ మరుసటి రోజు వ్యవసాయ పరిస్థితులపై జరిగిన చర్చలో పాలవెల్లువ కింద 3.94 లక్షల పశువులను కొనుగోలు చేసినట్లు వ్యవసాయశాఖ మంత్రి చెప్పారని తెలిపారు. ఒక్క రోజులోనే 1,85,210 పాడి పశువులు ఎలా పెరిగాయో ఆ మంత్రులు, ప్రభుత్వానికే తెలియాలని ఎద్దేవా చేశారు. పాడి పశువుల కొనుగోలుకు వైఎస్సార్ చేయూత కింద రూ.2,887 కోట్ల అవినీతికి పాల్పడినట్లు మంత్రుల మాటలు స్పష్టం చేస్తున్నాయని, దీనిపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు.

పేదల ఇళ్లు కూల్చివేత దుర్మార్గం

- మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్
- కల్లూరు బాధితులకు పరామర్శ

కల్లూరులో ఇళ్లు కూల్చివేసిన ప్రాంతంలో పేదలతో మాట్లాడుతున్న గేయానంద్

ప్రజాశక్తి-గార్లదిన్నె, అనంతపురం

నిరుపేద దళితులు, సంచార గిరిజనులు నాలుగేళ్లుగా గుడిసెలేసుకుని జీవనం సాగిస్తుంటే.. ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా పోలీసులు, రెవెన్యూ అధికారులు ఉన్నఫలంగా వచ్చి ఇళ్లు కూల్చివేయడం దుర్మార్గమని మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ తెలిపారు. బాధితులకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతపురం జిల్లా గార్లదిన్నె మండలం కల్లూరు గ్రామంలో అధికారులు కూల్చివేసిన ఇళ్లు, గుడిసెలను మానవ హక్కుల వేదిక నాయకులు ఎస్.ఎం.బాషా, సిఐటియు నాయకులు ఎజి.రాజమోహన్‌తో కలిసి ఆయన గురువారం సందర్శించారు. బాధితులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ 'నిలువ నీడలేని వాళ్లం.. రోజు కూలిపనులకెళ్లి జీవనం సాగించేవాళ్ల.. తమకు ప్రభుత్వం ఇంటి స్థలం ఇవ్వకపోవడంతో కల్లూరులో శివారులో 132 కుటుంబాల వాళ్లం గుడిసెలేసుకుని జీవనం సాగిస్తున్నాం.' అని తెలిపారు. ఇది దేవుడి మాన్యం అంటూ అధికారులు నాలుగు జెసిబిలతో వచ్చి దౌర్జన్యంగా తమ ఇళ్లను కూల్చివేశారని కన్నీటిపర్యంతమయ్యారు. తమకు మద్దతుగా వచ్చిన సిపిఎం నాయకుల పట్ల సిఐ నరేంద్రరెడ్డి దురుసుగా ప్రవర్తించారని తెలిపారు. చిన్నపిల్లలు, బాలింతలు, గర్భిణులు ఉన్నారని వేడుకున్నా వినకుండా ఇళ్లు కూల్చారని వాపోయారు.

ఈ సందర్భంగా గేయానంద్ మాట్లాడుతూ.. నిలువ నీడలేని నిరుపేదలు చిన్నపాటి గుడిసెలు వేసుకుంటే పోలీసులు, రెవెన్యూ అధికారులు రౌడీల్లాగా వ్యవహరిస్తూ వాటిని కూల్చివేయడం దుర్మార్గమని అన్నారు. హైకోర్టు ఉత్తర్వులు ఉన్నా పట్టించుకోకుండా అధికారులు వ్యవహరించిన తీరు ఆక్షేపణీయమన్నారు. ఇప్పటికైనా బాధితుల పట్ల దురుసుగా వ్యవహరించిన సిఐపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం డిఐజి అమ్మిరెడ్డిని కలిసి సిపిఎం నాయకుల పట్ల దురుసుగా వ్యవహరించిన సిఐను సస్పెండ్ చేయాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. కలెక్టర్ గౌతమిని కలిసి బాధితుల సమస్యను ఆమెకు వివరించారు. ఎటువంటి నోటీసులూ ఇవ్వకుండా అధికారులు ఇళ్లు కూల్చివేశారని తెలిపారు. కల్లూరు బాధిత పేదలకు న్యాయం చేయాలని కోరారు. ఆర్‌డిఒ ద్వారా విచారణ జరిపిస్తామని,బాధితులకు జగనన్న ఇళ్లు మంజూరు చేస్తామని, నష్టపరిహారం అందేవిధంగా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చారు.

ప్రభుత్వ విధానాలపై రఘురామ పిల్

ప్రజాశక్తి-అమరావతి

రాష్ట్ర ప్రభుత్వ లోపభూయిష్ట విధాన నిర్ణయాలపై సిబిఐ దర్యాప్తునకు ఆదేశించాలని కోరుతూ వైసిపి ఎంపి కె రఘురామ కృష్ణరాజు హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, అటవీశాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, సిఎం రాజకీయ సలహాదారుడు సజ్జల రామకృష్ణారెడ్డి, ఎంపి విజయసాయిరెడ్డి, ఎపి బెవరేజెస్ కార్పొరేషన్ ఎమ్‌డి వాసుదేవరెడ్డిని వ్యక్తిగత ప్రతివాదులుగా పేర్కొన్నారు. ఇతర ప్రతివాదులుగా జగతి పబ్లికేషన్స్, ఇందిరా టెలివిజన్, భారతి సిమెంట్, సాగర్ సిమెంట్, ది ఇండియా సిమెంట్స్, దాల్మియా సిమెంట్, పెన్నా సిమెంట్, శ్రీజయజ్యోతి సిమెంట్స్, మైహోం ఇండస్ట్రీస్, భారతి షాలీమర్స్ ఇండియా, అరబిందో ఫార్మా ఫౌండేషన్ తదితర సంస్థలను పేర్కొన్నారు. వీరితోపాటు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, కేంద్ర హోంశాఖ కార్యదర్శి, సిబిఐ డైరెక్టరు, జిఎడి, ఆర్థిక, రెవెన్యూ, సమాచార, గనులశాఖ ముఖ్య కార్యదర్శులను కూడా ప్రతివాదులుగా చేశారు. ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా ప్రజాధనాన్ని తమకు అనుకూలమైన సంస్థల్లోకి మళ్లించారని, ప్రకటనలన్నీ సాక్షికే ఇస్తున్నారని ఆరోపించారు. సిమెంట్ కొనుగోళ్లు కూడా ఏకపక్షంగా చేస్తోందన్నారు. 2020లో తెచ్చిన సిమెంటు విధానం లోపభూయిష్టంగా ఉందన్నారు. ఇసుక ఇతర గనుల తవ్వకాలు చట్ట వ్యతిరేకంగా చేస్తున్నారని చెప్పారు. మద్యం కొనుగోళ్ల పేరుతో లూటీ జరుగుతోందన్నారు. ఇందుకుగానూ వీరిపై క్రిమినల్ కేసుల నమోదుకు ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. వీటిపై హైకోర్టు పర్యవేక్షణలో కేసుల దర్యాప్తునకు ఆదేశించాలన్నారు.

జాతీయ స్కాలర్‌షిప్‌లకు దరఖాస్తులు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

యూనివర్సిటీ, కళాశాలల విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం అందించే స్కాలర్‌షిప్ పథకానికి దరఖాస్తు చేసుకోవాలని ఇంటర్మీడియట్ బోర్డు కార్యదర్శి సౌరభ్ గౌర్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. కేంద్ర మానవ వనరులశాఖ 2023-24 విద్యా సంవత్సరానికి ఆన్‌లైన్ పోర్టల్ www.scholarships.gov.in ప్రారంభించిందని తెలిపారు. కొత్తగా దరఖాస్తు చేసుకునే విద్యార్థులు, రెన్యూవల్ చేసుకునే విద్యార్థులు డిసెంబరు 12 వరకు పోర్టల్‌లో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చునని వెల్లడించారు. అన్ని కళాశాలల ప్రిన్సిపల్స్... విద్యార్థులతో దరఖాస్తు చేయించేలా చూడాలని ఆర్ఐఒలకు ఆదేశాలు జారీ చేశారు.

ఫైబర్ నెట్ కేసులో నిందితుల స్థిరాస్తుల అటాచ్‌మెంట్

- హోంశాఖ ఉత్తర్వులు

ప్రజాశక్తి- అమరావతి బ్యూరో

ఆంధ్రప్రదేశ్ ఫైబర్‌నెట్ కార్పొరేషన్ కేసులో నిందితులకు చెందిన స్థిరాస్తుల అటాచ్‌మెంట్‌కు రాష్ట్ర హోంశాఖ అనుమతులు ఇచ్చింది. ఈ కేసులో చంద్రబాబు నాయుడు సన్నిహితులుగా వున్న టెరాసాఫ్ట్ కంపెనీకి చెందిన హరిప్రసాద్‌తోపాటు ఈ కేసులో మరికొందరి స్థిరాస్తుల అటాచ్‌మెంట్‌కు సిఐడి ప్రతిపాదనలకు గురువారం హోంశాఖ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు వారి స్థిరాస్తులను అటాచ్ చేయాలని ఉత్తర్వులు జారీ చేసింది. అటాచ్ చేసే ఆస్తుల్లో గుంటూరులో ఇంటి స్థలం, విశాఖపట్నంలో ఓ ఫ్లాట్, హైదరాబాద్‌లోని నాలుగు ప్లాట్లు, తెలంగాణలోని రంగారెడ్డి జిల్లాలో వ్యవసాయ భూమి తదితర ఆస్తుల అటాచ్‌మెంట్‌కు అనుమతులు ఇచ్చింది. కేసులో మరో నిందితుడు కనుమూరి కోటేశ్వరరావు పేరిట గుంటూరులో 797 చదరపు అడుగుల ఇంటి స్థలం కూడా వుంది. కనుమూరి కోటేశ్వరరావు డైరెక్టరుగా ఉన్న నెప్‌టాప్స్ ఫైబర్ సొల్యూషన్స్‌కు చెందిన విశాఖపట్నం కిర్లంపూడి లేఅవుట్‌లోని ఓ ఫ్లాట్, టెరాసాఫ్ట్ కంపెనీ ఎమ్‌డి టి గోపీచంద్ పేరిట హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లో ఉన్న ఫ్లాట్, శ్రీనగర్ కాలనీలో ఉన్న మరో ఫ్లాట్, హైదరాబాద్ యూసఫ్‌గూడలో ఉన్న ఫ్లాట్, గోపీచంద్ భార్య పవనదేవి పేరిట తెలంగాణలోని రంగారెడ్డి జిల్లా మొయినాబాద్‌లో వ్యవసాయ భూమి ఉంది. వారి స్థిరాస్తులను అటాచ్ చేయడానికి రాష్ట్ర హోంశాఖ అనుమతినిచ్చింది. ఈ అటాచ్‌మెంట్ ఉత్తర్వులతో శుక్రవారం సిఐడి ఎసిబి కోర్టులో పిటిషన్ వేసే అవకాశం వుంది.

చంద్రబాబుపై మరో కేసు

- ఇసుక తవ్వకాల్లో అక్రమాలకు పాల్పడ్డారంటూ ఆరోపణ

ప్రజాశక్తి- అమరావతి బ్యూరో

టిడిపి అధినేత చంద్రబాబు నాయుడుపై మరో కేసు నమోదైంది. ఇప్పటికే స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఇన్నర్ రింగ్‌రోడ్డు, మద్యం అమ్మకాలు, ఫైబర్‌నెట్ అంశాలపై చంద్రబాబుపై కేసులను నమోదు చేసిన రాష్ట్ర ప్రభుత్వం గురువారం మరో కేసు నమోదు చేసింది. టిడిపి హయాంలో ఇసుక అక్రమాలపై ఆంధ్రప్రదేశ్ మినరల్ డెవలప్‌మెంటు కార్పొరేషన్ డైరెక్టరు వెంకటరెడ్డి ఫిర్యాదు మేరకు ఎపి సిఐడి కేసు నమోదు చేసింది. ఈ కేసులో ఎ-1గా మాజీ మంత్రి పీతల సుజాత, ఎ-2గా మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఎ-3గా దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, ఎ-4గా జలవనరులశాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావును చేరుస్తూ సిఐడి కేసు నమోదు చేసింది. రాష్ట్ర ప్రభుత్వ ఖజానాకు తీవ్రనష్టం చేశారనే అభియోగంతో సిఐడి కేసు నమోదు చేసింది. చంద్రబాబు హయాంలో విచ్చలవిడిగా ఇసుక అక్రమ తవ్వకాలు జరిగాయని, ఆయన ఇంటి పక్కనే అక్రమ తవ్వకాలు జరిగినా చంద్రబాబు పట్టించుకోలేదని, ఇందుకు ఎన్‌జిటి రాష్ట్ర ప్రభుత్వానికి రూ.100 కోట్ల జరిమానా విధించిందని పేర్కొంది.

'స్కిల్' కేసు ఎఫ్ఐఆర్, ఛార్జిషీట్లు న్యాయస్థానాల్లో చెల్లవు

- టిడిపి ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

చంద్రబాబుపై స్కిల్ కేసులో నమోదు చేసిన ఎఫ్ఐఆర్, ఛార్జిషీట్లు న్యాయస్థానాల్లో చెల్లవని టిడిపి ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ అన్నారు. టిడిపి కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సిఐడి చీఫ్, అడిషనల్ ఎజి, సజ్జల, మంత్రులు పదేపదే నోటికొచ్చిన అబద్ధాలతో దుష్ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం సీమెన్స్ ఇండస్ట్రీ సాఫ్ట్‌వేర్ ప్రైవేట్ లిమిటెడ్‌తో చేసుకున్న ఒప్పందంలో 90:10 నిష్పత్తి ప్రతిపాదనలు ఉన్నాయని చెప్పారు. దీనిపై వైసిపి ప్రభుత్వం, మంత్రులు ఏం సమాధానం చెబుతారని, కేంద్ర ప్రభుత్వంపై కూడా కేసు నమోదు చేయమంటారా? అని ప్రశ్నించారు. జర్మనీలోని సీమెన్స్ సంస్థ ప్రధాన కార్యాలయాన్ని సంప్రదించకుండా ఆ కంపెనీతో ఒప్పందం లేదని ప్రభుత్వం, సిఐడి ఎలా చెబుతున్నాయని ప్రశ్నించారు. స్కిల్ ప్రాజెక్టు ఏర్పాటు ఆలస్యమైందని, ఉత్తర్వులు ఇచ్చిన తరువాత ప్రతిపాదనలు పంపాలని గత ప్రభుత్వంలో పనిచేసిన నీలం సహాని నోట్‌ఫైల్‌లో పేర్కొన్నారని తెలిపారు. ఇదే ఫైల్ ప్రేమచంద్రారెడ్డికి, అజయ్‌కల్లం రెడ్డికి కూడా వెళ్లిందన్నారు. ఫైల్‌ను మంత్రిమండలి ఆమోదానికి పంపకపోతే ముఖ్యమంత్రి బాధ్యులు అవుతారా? అని ప్రశ్నించారు. అదే నిజమైతే నోట్‌ఫైల్‌పై అభిప్రాయాలు రాసిన ముగ్గురు ఐఎఎస్ అధికారులపై ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోలేదు? అరెస్టు చేసి ఎందుకు విచారించలేదు? అని ప్రశ్నించారు.

రూ.784 కోట్లతో 202 పంచాయతీరాజ్ రోడ్ల నిర్మాణం

ప్రజాశక్తి-అమరామతి బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో రద్దీ ఎక్కువగా ఉండే మరో 202 రోడ్లను రూ.784.22 కోట్లతో పూర్తి స్థాయిలో మరమ్మతులతోపాటు పునర్నిర్మాణం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. 26 జిల్లాల్లో 1,035 కిలోమీటర్ల మేర ఈ రోడ్ల నిర్మాణం చేపట్టనున్నారు. రాష్ట్రంలో 258 రోడ్లు పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగం పరిధిలో ఉండగా, వాటిలో 56 రోడ్ల మరమ్మతులకు ప్రభుత్వం గతంలోనే అనుమతులు ఇవ్వగా, పనులు పురోగతిలో ఉన్నాయి. మిగిలిన 202 రోడ్ల పునర్నిర్మాణ పనులు కోసం పంచాయతీరాజ్‌శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి రాజశేఖర్ ఆదేశాలు జారీ చేశారు. ఈ నెల 6 నుంచి ఆన్‌లైన్ విధానంలో కాంట్రాక్టర్లు బిడ్లు దాఖలు ప్రక్రియ మొదలవుతుందని పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ ఇఎన్‌సి బాలునాయక్ తెలిపారు. 14 రోజుల పాటు టెండర్లు దాఖలుకు గడువు ఉంటుందని, నవంబరు నెలాఖరు నాటికి టెండర్ల ప్రక్రియ పూర్తి చేసి డిసెంబరు మొదటివారంలోనే ఆయా రోడ్ల పనులు ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆయన చెప్పారు. ఆర్‌అండ్‌బి శాఖ పరిధిలో గుర్తించిన హై ఇంపాక్ట్ కేటగిరి రోడ్లకు ప్రభుత్వం ఆ శాఖ ఆధ్వర్యంలో అనుమతులు మంజూరు చేసిందన్నారు. ఆ పనులు కూడా మొదలైనట్లు వెల్లడించారు.

మత్స్యకార వ్యతిరేక విధానాలు తగవు

- కేంద్రం తక్షణమే ఉపసంహరించుకోవాలి
- ఎఐఎఫ్ఎఫ్‌డబ్ల్యుఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి స్టాన్లీ

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జాతీయ ప్రధాన కార్యదర్శి స్టాన్లీ

ప్రజాశక్తి- కాకినాడ ప్రతినిధి

మత్స్యకారులకు వ్యతిరేకంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తోన్న విధానాలను తక్షణమే ఉపసంహరించుకోవాలని అఖిల భారత మత్స్యకారులు, మత్స్య కార్మిక సమైక్య (ఎఐఎఫ్ఎఫ్ డబ్ల్యుఎఫ్) జాతీయ ప్రధాన కార్యదర్శి స్టాన్లీ డిమాండ్ చేశారు. దేశ వ్యాప్తంగా మత్స్యకారుల సమస్యలపై పోరాడుతున్న ప్రతినిధులతో ఎఐఎఫ్ఎఫ్‌డబ్ల్యుఎఫ్ జాతీయ సమావేశాలు ఈ నెల 3 నుంచి 5వ తేదీ వరకు కాకినాడలో నిర్వహించున్నామని, ఈ సమావేశాల్లో దేశవ్యాప్తంగా 16 రాష్ట్రాల నుంచి ప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు. కాకినాడలోని సుందరయ్య భవన్‌లో ఆయన గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దేశ వ్యాప్తంగా 7 వేల కిలో మీటర్లకుపైగా ఉన్న సముద్ర తీర ప్రాంతాన్ని నమ్ముకుని కోట్లాది మంది మత్స్యకారులు, కార్మికులు ఉపాధి పొందుతున్నారని తెలిపారు. వేటే జీవనాధారంగా జీవిస్తున్నారన్నారు. వీరికి కేంద్ర ప్రభుత్వం ఎటువంటి సంక్షేమ పథకాలు అమలు చేయట్లేదని, అయినప్పటికీ నిస్వార్థంగా మత్స్య సంపదను తీసుకొచ్చి ఆయా రాష్ట్రాలకు రూ.వేల కోట్లు విదేశీ మారక ద్రవ్యాన్ని అందిస్తున్నారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం కేటాయిస్తున్న రూ.5 వేల కోట్ల బడ్జెట్‌ను సగానికి తగ్గించి మత్యకారులకు అన్యాయం చేశారన్నారు. బ్లూ ఎకానమీ ఆఫ్ షోర్ ఏరియాస్ మినరల్ డెవలప్‌మెంట్ అండ్ రెగ్యులేషన్ యాక్ట్ పేరుతో సముద్రంలో ఉన్న 138 లోహాలను వెలికితీయడానికి పార్లమెంట్‌లో చట్టం చేసి సముద్ర తీరాన్ని 100 కిలో మీటర్లు చొప్పున ముక్కలు చేసి ప్రయివేటు బ్యాంకుల ద్వారా కార్పొరేట్లకు కట్టబెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా జిఒ 217 ద్వారా ఆక్వా హబ్‌లను పేర మత్స్య రంగాన్ని కార్పొరేట్‌పరం చేస్తుందన్నారు. ఈ జిఒను మత్స్యకారుల సంఘాలు వ్యతిరేకించినా చాప కింద నీరులా జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం అమలు చేస్తోందని తెలిపారు. ఈ విధానాలను తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కర్రి చంద్రశేఖర్, కొల్లాటి శ్రీనివాసరావు, రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ సభ్యులు చెక్క రమణి, పశ్చిమ బెంగాల్ ప్రతినిధులు జరోనహల్ వల్లే, జిన్నహాలే, కేరళ ప్రతినిధులు పాల్గొన్నారు.

పురుషోత్తపురం చెక్‌పోస్టుపై ఎసిబి దాడులు

- రూ.1.30 లక్షల నగదు స్వాధీనం



తనిఖీలు చేస్తున్న ఎసిబి అధికారులు

ప్రజాశక్తి - ఇచ్ఛాపురం

శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురంలోని ఆంధ్రా-ఒడిశా సరిహద్దులోని పురుషోత్తపురం మోటార్ వెహికల్ చెక్‌పోస్టుపై బుధవారం అర్ధరాత్రి ఎసిబి అధికారులు దాడులు చేశారు. చెక్‌పోస్టులోని రవాణా శాఖ కౌంటరులో రికార్డులను తనిఖీ చేశారు. సహాయ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ అనీల్ కుమార్, ఇద్దరు కానిస్టేబుళ్ల వద్ద రూ.1.30 లక్షల అనధికార సొమ్మును గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎసిబి డిఎస్‌పి రమణమూర్తి విలేకరులతో మాట్లాడుతూ చెక్‌పోస్టులో అవినీతి జరుగుతుందని ఫిర్యాదులు రావడంతో దాడులు చేపట్టామని తెలిపారు. రూ.1.30 లక్షల అనధికార నగదును స్వాధీనం చేసుకున్నామని చెప్పారు.

ఎస్‌డబ్ల్యుఎఫ్ నాయకులు సర్దార్ బాషాకు సంతాపం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కర్నూలు ఆర్‌టిసి రీజియన్ ఆంధ్రప్రదేశ్ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ మాజీ అధ్యక్షులు, ప్రస్తుతం కర్నూలు ఆర్‌టిసి బస్టాండులో ఎడిసి ఎస్ సర్దార్ బాషా మృతికి ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర కమిటీ సంతాపం తెలిపింది. ఈ మేరకు గురువారం ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు ఎస్‌కె జిలాని బాషా, రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్ సుందరయ్య, ప్రధాన కార్యదర్శి అయ్యపరెడ్డి ఒక ప్రకటన విడుదల చేశారు. సర్దార్ బాషా కర్నూలు జిల్లాలో 1987 నుంచి ఆర్‌టిసి ఉద్యోగులు, కార్మికుల సమస్యలపై పనిచేశారని వారు పేర్కొన్నారు. 1987 నుంచి ఆర్‌టిసిలో ఎస్‌డబ్ల్యుఎఫ్ కార్యకర్తగా, కర్నూలు 1 డిపో కార్యదర్శిగా, రీజనల్ అధ్యక్షులుగా సంఘం కోసం పనిచేసిన సర్దార్ బాషా మృతి సంఘానికి తీరని లోటని పేర్కొన్నారు.

డాక్టర్ హత్య కేసులో నిందితుడు అరెస్టు

ప్రజాశక్తి - గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు కొత్తపేటకు చెందిన ఫిజియోథెరపిస్టు డాక్టర్ సీతారామాంజనేయులు హత్య కేసులో నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. కేసుకు సంబంధించిన వివరాలను ఎస్‌పి నచికేట్ షెల్కే గురువారం మీడియాకు వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. వైద్యుడు సీతారామాంజనేయులు గుంటూరువారి తోటలోని సురక్ష ఆస్పత్రిలో వైద్యునిగా పనిచేస్తున్నారు. అదే ఆస్పత్రిలో డాక్టర్‌గా పనిచేస్తున్న ఒక యువతితో పరిచయం ఏర్పడింది. ఈ పరిచయం ప్రేమగా మారింది. వారి ప్రేమ విషయం నచ్చని యువతి తండ్రి శ్రీనివాసరెడ్డి ఆమెను ఏడాది క్రితం ఉన్నత చదువుల నిమిత్తం విదేశాలకు పంపించారు. ఈ క్రమంలో సీతారామాంజనేయులు ఆ యువతిని గుంటూరుకు రావాలని ఒత్తిడి చేస్తున్న విషయం శ్రీనివాసరెడ్డికి తెలిసింది. ఉన్నత చదువులు పూర్తయిన తరువాతే గుంటూరుకు రావాలని శ్రీనివాసరెడ్డి తన కుమార్తెకు షరతు విధించారు. మరోవైపు సీతారామాంజనేయులు సదరు యువతిని ఒత్తిడి చేస్తున్న విషయం తెలుసుకున్న శ్రీనివాసరెడ్డి గతనెల 29న రాత్రి సీతారామాంజనేయులు ఉంటున్న ఇంటికి వెళ్లి ఘర్షణపడ్డాడు. కోపోద్రిక్తుడైన శ్రీనివాసరెడ్డి సుత్తితో సీతారామాంజనేయులు తలపై కొట్టి హతమార్చారు. 30వ తేదీన హత్య ఉదంతం వెలుగుచూసింది. ఈ కేసును సిఐ అన్వర్‌బాష దర్యాప్తు చేశారు. పరారీలో ఉన్న నిందితుడు శ్రీనివాసరెడ్డిని ఫిరంగిపురంలో అరెస్టు చేశారు.

అదాని ఎంటర్‌ప్రైజెస్ ఫలితాలు డీలా

- లాభాల్లో 51% పతనం
- రెవెన్యూలో 41 శాతం క్షీణత



న్యూఢిల్లీ : గౌతం ఆదానికి చెందిన కీలక కంపెనీ అదాని ఎంటర్‌ప్రైజెస్ ఆర్థిక ఫలితాలు డీలా పడ్డాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం సెప్టెంబర్‌తో ముగిసిన ద్వితీయ త్రైమాసికం (క్యూ2)లో 50.5 శాతం పతనంతో రూ.227.82 కోట్ల నికర లాభాలకు పరిమితమయ్యింది. గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.460.94 కోట్ల లాభాలు నమోదు చేసింది. కాగా.. 2023 జూన్ త్రైమాసికం లాభాలు రూ.673.93 కోట్లతో పోల్చితే ఏకంగా 66.1 శాతం పతనాన్ని చవి చూసింది. గడిచిన క్యూ2లో అదాని ఎంటర్‌ప్రైజెస్ రెవెన్యూ 41 శాతం క్షీణించి రూ.22,517.33 కోట్లుగా చోటు చేసుకుంది. గతేడాది ఇదే కాలంలో రూ.38,175.23 కోట్ల రెవెన్యూ ఆర్జించించింది. గడిచిన త్రైమాసికంలో కంపెనీ వాణిజ్య మైనింగ్ నష్టాలు రూ.340 కోట్లకు పెరిగాయి. 2022 ఇదే జులై- సెప్టెంబర్‌లో రూ.132 కోట్ల నష్టాల్లో ఉంది. అదాని ఎంటర్‌ప్రైజెస్‌లో ఎనర్జీ, వంట నూనెలు, అహారోత్పత్తులు, రక్షణ, స్టోరేజీ, లాజిస్టిక్ సహా పలు ప్రాథమిక పరిశ్రమలు భాగంగా ఉన్నాయి.

టాటా మోటార్స్‌కు రూ.3,764 కోట్ల లాభాలు

దిగ్గజ ఆటోమొబైల్ కంపెనీ టాటా మోటార్స్ ఆకర్షణీయ ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. 2023-24 సెప్టెంబర్‌తో ముగిసిన ద్వితీయ త్రైమాసికం (క్యూ2)లో రూ.3,764 కోట్ల నికర లాభాలు సాధించింది. గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.944.61 కోట్ల నష్టాలు చవి చూసింది. 2023 జూన్‌తో ముగిసిన త్రైమాసికం రూ.3,202.80 కోట్ల లాభాలతో పోల్చితే గడిచిన క్యూ2లో 17.5 శాతం వృద్ధిని కనబర్చింది. ఏడాదికేడాదితో పోల్చితే కంపెనీ మొత్తం రెవెన్యూ 32 శాతం పెరిగి రూ.1.05 లక్షల కోట్లకు చేరింది. జాగ్వర్ లాండ్ రోవర్ రెవెన్యూ 30 శాతం పెరిగి 6.9 బిలియన్ పౌండ్లుగా చోటు చేసుకుంది.

ఎల్ఐసి హౌసింగ్ ఫైనాన్స్ లాభాలు నాలుగు రెట్లు

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం సెప్టెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో ఎల్ఐసి హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ నికర లాభాలు నాలుగు రెట్లు పెరిగి రూ.1,188 కోట్లుగా నమోదయ్యాయి. ఎల్ఐసికి చెందిన ఈ సంస్థ గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.305 కోట్ల లాభాలు ఆర్జించింది. క్రితం త్రైమాసికంలో సంస్థ రెవెన్యూ 6,753 కోట్లుగా చోటు చేసుకుంది. వడ్డీ ఆదాయం రూ.6,707 కోట్లుగా ఉంది. గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.5,049 కోట్ల వడ్డీ ఆదాయం నమోదయ్యింది.

రాష్ట్రానికి పూమా, చీతాలు

- అసోం నుంచి రైనా కూడా
- అటవీశాఖ ప్రతిపాదనలు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

పిల్లి జాతిలో పెద్దదైన పూమా (వీటిని మౌంటెన్ లయన్, కౌగార్, పాంథార్ అని కూడా పిలుస్తారు) లను రాష్ట్రానికి దిగుమతి చేసుకునేందుకు అటవీశాఖ అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు. వీటితోపాటే చిరుతలను కూడా రప్పించాలని భావిస్తున్నారు. రాష్ట్రంలోని జంతు ప్రదర్శనశాలల్లో వీటిని ఉంచాలన్నది అధికారుల ప్రతిపాదన. దీనికి సంబంధించి ఇప్పటికే చర్చల ప్రక్రియ జరుగుతోంది. అదేవిధంగా ఇతర రాష్ట్రాల నుండి జిరాఫీలు, రైనాలను కూడా రాష్ట్రానికి తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నారు. పూమాలు పరిమాణంలో చిరుతల స్థాయిలోనే ఉన్నప్పటికీ, వాటిని పెద్ద పిల్లి జాతిగానే పరిగణిస్తారు. ఇవి అమెరికాలోనే ఎక్కువగా కనిపించినప్పటికీ, తరువాత కాలంలో ఇతర దేశాలకు కూడా వ్యాప్తి చెందుతున్నట్లు అటవీ అధికారులు చెబుతున్నారు. మన దేశంలోని కొన్ని జంతుప్రదర్శన శాలల్లో నల్ల పూమా (బ్లాక్ పాంథర్) ఉన్నప్పటికీ, అడవులలో కనిపించవు. అందువల్ల రాష్ట్రంలోని జంతుప్రదర్శనశాలల్లో కూడా వీటిని ఉంచాలన్నది అధికారుల ప్రతిపాదన. చీతాలను కూడా రాష్ట్రంలోని రెండు ప్రధాన జంతు ప్రదర్శన శాలలకు తీసుకురావాలని యోచిస్తున్నారు. ప్రస్తుతం విశాఖ జంతు ప్రదర్శనశాలలో ఒక జిరాఫీ, ఒక జీబ్రా ఉన్నాయి. వీటికి అదనంగా మరికొన్ని జీబ్రాలు, జిరాఫీలను రప్పించాలని యోచిస్తున్నారు. ఇక అసోం నుంచి ఒక రైనాను కూడా తెప్పించనున్నారు. దీనికి సంబంధించి ఆ రాష్ట్ర ముఖ్యమంత్రికి మన రాష్ట్ర సిఎం నుండి లేఖ రాయించాలని భావిస్తున్నారు.

పోస్టల్ శాఖతో రూ.2వేల నోట్ల మార్పిడి

న్యూఢిల్లీ : బ్యాంక్‌ల్లో రూ.2,000 నోట్ల మార్పిడిని నిలిపివేసిన నేపథ్యంలో ఆర్‌బిఐ రీజినల్ ఆఫీసుల ముందు జనం వరుస కడుతున్నారు. తమ కార్యాలయానికి వెళ్లకుండా నోట్లను బ్యాంకు ఖాతాల్లో డిపాజిట్ చేయవచ్చని ఆర్‌బిఐ పేర్కొంది. దగ్గర్లో ఆర్‌బిఐ కార్యాలయం లేని వాళ్లు పోస్టల్ శాఖ సర్వీసు ద్వారా నోట్లను తమకు పంపవచ్చని పేర్కొంది. టిఎల్ఆర్ ఫామ్ ద్వారా రూ.2 వేల నోట్లను బ్యాంకు ఖాతాలో డిపాజిట్ చేసుకోవచ్చని తెలిపింది.

కోటక్ జనరల్ ఇన్సూరెన్స్‌లో జూరిచ్ ఇన్సూరెన్స్‌కు మెజారిటీ వాటా

ముంబయి : తమ కోటక్ జనరల్ ఇన్సూరెన్స్‌లో స్విట్జర్లాండ్‌కు చెందిన జూరిచ్ ఇన్సూరెన్స్ 51 శాతం వాటా కొనుగోలు చేయనుందని కోటక్ మహీంద్రా బ్యాంక్ వెల్లడించింది. ఈ కొనుగోలు ఒప్పంద విలువ రూ.4,051 కోట్లుగా ఉందని పేర్కొంది. కంపెనీ విస్తరణ కోసం కొత్తగా మూలధనాన్ని అందించడంతో పాటు షేర్ల కొనుగోలు రూపంలో జూరిచ్ ఇన్సూరెన్స్ ఈ కొనుగోలును పూర్తి చేయనుందని తెలిపింది. రాబోయే మూడేళ్లలో మరో 19 శాతం వాటాను కూడా కొనుగోలు చేసేలా ఒప్పందం కుదిరిందని పేర్కొంది. ఈ డీల్‌కు ఆర్‌బిఐ, ఐఆర్‌డిఎఐ, సిసిఐల నుంచి అనుమతులు లభించాల్సి ఉంటుంది.

మార్కెట్లోకి లావా బ్లేజ్ 2 స్మార్ట్‌ఫోన్



న్యూఢిల్లీ : స్మార్ట్‌ఫోన్ ఉత్పత్తుల కంపెనీ లావా ఇంటర్నేషనల్ కొత్తగా బ్లేజ్ 2 5జి స్మార్ట్‌ఫోన్‌ను ఆవిష్కరించింది. 4జిబి ర్యామ్, 64జిబి స్టోరేజీ ధరను రూ.9,999గా, 6జిబి, 128జిబి ధరను రూ.10,999గా నిర్ణయించింది. మూడు రంగుల్లో లభించే ఈ ఫోన్ నవంబర్ 9 నుంచి ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ మార్కెట్లో లభ్యం అవుతుందని తెలిపింది. 6.56 అంగుళాల హెచ్‌డి ప్లస్ ఐపిఎస్ డిస్‌ప్లే కలిగిన ఈ ఫోన్‌లో 50 ఎంపి రేర్ కెమెరా, 8ఎంపి సెల్ఫీ కెమెరాతో విడుదల చేసింది.

సంపాదకీయం

కరువు కనబడదా?

రాష్ట్రానికి రాష్ట్రంగానే కరువు రక్కసి జడలు విప్పగా అన్నదాతల వ్యధ నింగినంటగా ప్రభుత్వానికి ఇవేమీ కనిపించట్లేదు వినిపించట్లేదనడానికి కరువు మండలాల ప్రకటనే నిదర్శనం. ఎన్నికలకు ముందు 'నేను విన్నాను నేను చూశాను' అనే నినాదాన్ని మారు మోగించిన నాయకుని పాలనలోనే తీవ్ర దుర్భిక్ష పరిస్థితులు అంతర్ధానమవడం విస్తుగొల్పే విషయం. సాగు లేక బీడు పడ్డ లక్షల ఎకరాలు, ఎండుతున్న పంటలు, నీటి నిల్వల్లేక అడుగంటిన ప్రాజెక్టులు, తేమ ఇంకిపోయి నెర్రెలిచ్చిన భూములు.. అక్కడ ఇక్కడ అనే భేదం లేకుండా రాష్ట్ర వ్యాప్తంగా అన్ని చోట్లా ఇవే దృశ్యాలు సాక్షాత్కరిస్తున్నాయి. అయినా ప్రభుత్వం మాత్రం ఆచితూచి ఏడు జిల్లాల్లోని 103 మండలాల్లో కరువును గుర్తించి మంగళవారం ఉత్తర్వులిచ్చింది. రెండు మండలాలు మాత్రమే కోస్తాలోనివి. తతిమ్మా 101 మండలాలూ రాయలసీమలోనివి. ప్రకటించిన వాటిలోనూ తీవ్ర స్థాయి కరువు 80 మండలాలు, మధ్యస్థ స్థాయి 23 మండలాలుగా వర్గీకరించింది. రాష్ట్ర వ్యాప్తంగా ఖరీఫ్ ముగిసే సెప్టెంబర్ ఆఖరు నాటికి కనీసం 300 మండలాల్లో తీవ్ర దుర్భిక్షం ఉందని ప్రభుత్వ నివేదికలే తెలుపుతున్నాయి. మరి 103 మండలాలకే సర్కారు ఎందుకు పరిమితమైందో పెద్ద పజిల్. గ్రామాల్లో చీమ చిటుక్కుమన్నా ఇట్టే క్షణాల్లో రాష్ట్ర కేంద్రానికి చేరవేసే సచివాలయ, వలంటీర్ల వ్యవస్థ, రైతు సమస్యలన్నింటికీ పరిష్కారంగా పేర్కొనే రైతు భరోసా కేంద్రాలు, రాష్ట్రంలో కరువు కబళింపుపై ప్రభుత్వానికి సమాచారం ఇవ్వకపోవడం విచిత్రమే.

ఖరీఫ్ ప్రారంభానికి ముందే ఎల్‌నినో ముప్పు ఉందని లోకం కోడై కూసినా ప్రభుత్వానికి కరువు ధ్యాస లేదు. ముందస్తు సన్నద్ధతలో నెలకొన్న వైఫల్యం ఆ విషయాన్ని తేటతెల్లం చేసింది. జులైలో సరైన వానల్లేవు. ఆగస్టులో 55 శాతం వర్షపు లోటు ఏర్పడి అనావృష్టి ఛాయలు అలముకున్నాయి. ఈ సంకేతాలతోనైనా సర్కారు అప్రమత్తం కాలేదు. ఆఖరుకొచ్చేసరికి వ్యవసాయ పంటల సాధారణ సాగులో 24 లక్షల ఎకరాలు విత్తనం పడక బీడు పడ్డాయి. ఉద్యానవన పంటలు ఆరు లక్షల ఎకరాల్లో వేయలేదు. ఉత్తరోత్తరా 30 లక్షల ఎకరాల్లో సేద్యం లేకుండా పోయింది. వేరుశనగ, మొక్కజొన్న, ఆముదాలు, పత్తి, కందులు సహా వేసిన పంటలు ఎండి పోయాయి. వరి పొలాలు సైతం నీటి కొరత ఎదుర్కొంటున్నాయి. సగానికి సగం దిగుబడుల క్షీణత ఉంది. అక్టోబర్‌లో అయితే కొన్ని దశాబ్దాల్లో కనీవినీ ఎరుగని విధంగా 90 శాతం తక్కువ వర్షం నమోదైంది. దుర్భిక్షంపై మీడియా, పత్రికలు ఘోషిస్తున్నా ప్రభుత్వంలో చలనం లేదు. అడపాదడపా కురిసే సగటు వర్షాలను చూపించి కరువును కప్పెట్టేందుకు ఆఖరు వరకు ప్రయత్నించింది. ప్రతిపక్షాల, రైతుల ఆందోళనల, సాంకేతిక కారణాల దృష్ట్యా అరకొరగా హడావుడిగా కరువు మండలాలను ప్రకటించింది. ఈ ప్రహసనం కంటి తుడుపు చర్యగా తలపిస్తోంది.

కరువు మండలాల గుర్తింపులో శాస్త్రీయత ఏకోశాన లేదు. ముఖ్యమంత్రి ఇలాక కడప జిల్లా తీవ్ర దుర్భిక్షంలో మగ్గుతుండగా ఇక్కడ ఒక్క మండలాన్నీ ప్రకటించకపోవడానికి కారణాలేమిటో ఒక పట్టాన అంతుబట్టదు. తిరుపతి జిల్లా ఆది నుంచీ వర్షాభావాన్ని ఎదుర్కొంటోంది. ఇక్కడా ఒక్క మండలమూ ప్రకటించలేదు. అనంతపురం తర్వాత దుర్భిక్ష జిల్లాగా ఉన్న ప్రకాశంలోనూ అంతే. రాష్ట్రంలోనే తక్కువ వర్షపాతం నమోదైన నెల్లూరునూ విస్మరించారు. శ్రీకాకుళం, విజయనగరం, అనకాపల్లి, పల్నాడు...చెప్పుకుంటూ పోతే అన్ని మెట్ట ప్రాంతాల్లోనూ తీవ్ర అనావృష్టి తాండవిస్తోంది. తూతూ మంత్రంలా కాకుండా శాస్త్రీయ అంచనాలతో ప్రభుత్వం కరువు మండలాలను ప్రకటించాలి. కరువును తక్కువ చేసి మండలాలకు కోతలు పెట్టడం ఇప్పుడే చూస్తున్నాం. అందుకే తొలి ప్రకటనపై పున:పరిశీలన చేయాలి. రాజకీయ కారణాలతో కరువు మండలాల ప్రకటనపై గిల్టీగా ఫీలవడం తగనిపని. అందువల్ల బాధితులు నష్టపోతారు. కరువు మండలాలు ప్రకటించడంతోనే సరిపోదు. సముచిత స్థాయిలో రైతులకు పంట నష్టపరిహారం, బీమా, పశు గ్రాసం, పశువులకు తాగునీరు, ప్రజలకు తాగునీరు, రైతు రుణాల వాయిదా, వడ్డీ మాఫీ, కొత్త రుణాలు, పండిన పంటలకు ధరలు, వ్యవసాయ కార్మికులకు ఉపాధి పనులు వంటి అన్ని సహాయక చర్యలనూ యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలి. కేంద్రంపై ఒత్తిడి చేసి నిధులు రాబట్టాలి.

మహనీయుల మాట

అక్రమ సంపాదనతో చేసే
విందు భోజనం కన్నా
కష్టార్జితంతో తాగే
గంజినీరు ఎంతో సంతృప్తినిస్తుంది.

- మోక్షగుండం విశ్వేశ్వరయ్య,
ఇంజనీరు, పండితుడు, రాజనీతిజ్ఞుడు.

Mokshagundam visvesvaraya

వ్యాఖ్య

గాజాపై ఇజ్రాయిల్ యుద్ధం - మతోన్మాదుల వైఖరి

కేరళలోని కలామస్సెరిలో క్రిస్టియన్ గ్రూపు సమావేశంపై జరిగిన బాంబు పేలుళ్ళను మతతత్వ పెట్టుబడిగా చేసుకోవాలన్న ఆత్రంతో కేంద్ర మంత్రి రాజీవ్ చంద్రశేఖర్ చేసిన యత్నాలు జుగుప్స కలిగిస్తున్నాయి. గాజాపై ఇజ్రాయిల్ యుద్ధానికి సంబంధించి బిజెపి-ఆర్‌ఎస్‌ఎస్ వర్గాల ప్రచారం తాలూకు విషపూరిత స్వభావాన్ని ఇది బయటపెట్టింది.

బాంబు పేలుళ్ల సంభవించిన వెంటనే, చంద్రశేఖర్ మాట్లాడుతూ, క్రిస్టియన్ సమావేశాన్ని జిహాదీ శక్తులు లక్ష్యంగా చేసుకున్నాయని అవాకులు చవాకులు పేలారు. ఆ సమావేశంలో ప్రసంగించేందుకు హమాస్ నేతను కేరళ ప్రభుత్వం అనుమతించిందని, పర్యవసానంగా 24 గంటల్లో బాంబు పేలుడు సంభవించిందని నిందించారు. సిపిఎం, కాంగ్రెస్‌లు బుజ్జగింపు రాజకీయాలకు పాల్పడుతున్నాయని ఆరోపించారు. హమాస్ మాజీ చీఫ్ ఇస్మాయిల్ హనియె చేసిన ప్రసంగ పాఠం ఇంటర్‌నెట్‌లో అందుబాటులో వుంది, దాన్ని ఎవరైనా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు, అంతే తప్ప హమాస్ నేత ప్రసంగాన్ని అనుమతించే ప్రశ్నే లేదు. పైగా, చంద్రశేఖర్, ఆయన పార్టీ చెబుతున్నట్లుగా హమాస్ ఐక్యరాజ్య సమితి ప్రకటించిన తీవ్రవాద సంస్థ కాదు.

బాంబు పేలుడు జరిగిన కొద్ది గంటల వ్యవధిలోనే, ఒక వ్యక్తి పోలీసులకు లొంగిపోయాడు. ఈ దాడికి తనదే బాధ్యత అని ప్రకటించాడు. ఆ వ్యక్తి క్రైస్తవ గ్రూపులోని అసమ్మతి సభ్యుడు. ఇది మంత్రి చంద్రశేఖర్‌కు ఇబ్బందికరంగా పరిణమించింది కాబోలు. ఆయన చేసిన వ్యాఖ్యల్లోని విషాన్ని నిర్లక్ష్యం చేయరాదు. ఎందుకంటే, బిజెపి, హిందూత్వ శక్తులకు సంబంధించిన సోషల్ మీడియా గ్రూపులు అదే పనిగా సాగిస్తున్న పాలస్తీనా వ్యతిరేక మతోన్మాద ప్రచారం తరహాలో ఈ వ్యాఖ్యలు వున్నాయి. పాలస్తీనియన్లందరూ జిహాదీలని, హమాస్ తీవ్రవాద సంస్థ అని ముద్ర వేశారు. ఇజ్రాయిల్ ఇప్పుడు ఎలాగైతే తీవ్రవాద హింసను ఎదుర్కొంటోందో అలాగే భారత్‌లో ముస్లింల నుండి కూడా హిందువులు ఇటువంటి ముప్పే ఎదుర్కొంటారని వారు హెచ్చరిస్తున్నారు. ఇస్లామా ఫోబియాను పెంపొందించేందుకు పాలస్తీనియన్లు, హమాస్ అత్యాచారాలకు పాల్పడ్డారంటూ కట్టుకథలు అల్లి, వాటిని విస్తృతంగా ప్రచారంలో పెడుతున్నారు. ఇస్లామిక్ తీవ్రవాదంపై పోరాటంలో ఇజ్రాయిల్‌ను ఒక నమూనాగా చూపుతున్నారు. ఈ మతోన్మాద ప్రాపంచిక దృక్పథం స్వతంత్ర దేశం కోసం పాలస్తీనియన్లు జరుపుతున్న పోరాటాన్ని ముస్లిం సమస్యగా చూస్తోంది. పాలస్తీనియన్లను వారి మాతృభూమి నుండి వెళ్ళగొట్టి జాతి ప్రక్షాళన గావించాలని చూస్తున్న యూదు దురహంకార ప్రాజెక్టుకు సహజంగానే మద్దతునిస్తోంది. తమ హక్కుల కోసం పోరాడుతున్న పాలస్తీనియన్లను తీవ్రవాదులుగా చిత్రిస్తూ ఇజ్రాయిల్ ప్రభుత్వం, యూదు తీవ్రవాదులు సాగించే ప్రచారాన్నే మక్కీకి మక్కీగా ఆర్‌ఎస్‌ఎస్-బిజెపి అనుసరిస్తున్నాయి. హిందూత్వ వ్యవస్థాపకుడు వి.డి.సావర్కర్ కాలం నుండి హిందూ మితవాద జాతీయవాదులు యూదువాదానికి... అరబ్బులను, పాలస్తీనియన్లను తరిమికొట్టడం ద్వారా ఇజ్రాయిల్ దేశ ఏర్పాటుకు మద్దతునిస్తూనే వున్నారు.

తమ హక్కుల కోసం పోరాడుతున్న పాలస్తీనియన్లను తీవ్రవాదులుగా చిత్రిస్తూ ఇజ్రాయిల్ ప్రభుత్వం, యూదు తీవ్రవాదులు సాగించే ప్రచారాన్నే మక్కీకి మక్కీగా ఆర్‌ఎస్‌ఎస్-బిజెపి అనుసరిస్తున్నాయి. హిందూత్వ వ్యవస్థాపకుడు వి.డి.సావర్కర్ కాలం నుండి హిందూ మితవాద జాతీయవాదులు యూదువాదానికి...అరబ్బులను, పాలస్తీనియన్లను తరిమికొట్టడం ద్వారా ఇజ్రాయిల్ దేశ ఏర్పాటుకు మద్దతునిస్తూనే వున్నారు. ఈ హిందూత్వ ప్రపంచ దృక్పథమే ఈనాడు మోడీ ప్రభుత్వ వైఖరిని నిర్దేశిస్తోంది. ఇజ్రాయిల్‌ను పూర్తిగా సమర్థిస్తూ, గాజాపై కాల్పుల విరమణకు ఇచ్చే పిలుపులను తిరస్కరిస్తూ జో బైడెన్, రిషి సునాక్, ఒలాఫ్ షుల్జులతో నరేంద్ర మోడీ కూడా జతగట్టారు.

PEOPLE'S DEMOCRACY
THE WEEKLY PAPER OF THE COMMUNIST PARTY OF INDIA (MARXIST)

ఈ హిందూత్వ ప్రపంచ దృక్పథమే ఈనాడు మోడీ ప్రభుత్వ వైఖరిని నిర్దేశిస్తోంది. ఇజ్రాయిల్‌ను పూర్తిగా సమర్థిస్తూ, గాజాపై కాల్పుల విరమణకు ఇచ్చే పిలుపులను తిరస్కరిస్తూ జో బైడెన్, రిషి సునాక్, ఒలాఫ్ షుల్జులతో నరేంద్ర మోడీ కూడా జతగట్టారు. మానవతా సంధి కోసం పిలుపిస్తూ ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీ చేసిన తీర్మానంపై జరిగిన ఓటింగ్‌లో గైర్హాజరవడం ద్వారా భారత్, ప్రపంచ పేద దేశాల వైఖరికి దూరం పాటించింది. ఇజ్రాయిల్‌కు గుడ్డిగా మద్దతిస్తున్న పశ్చిమ దేశాల సరసన చేరింది. ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీ తీర్మానానికి 120 దేశాలు మద్దతిచ్చాయి. గాజాపై ఆటవిక దాడి, దండయాత్ర జరుగుతుంటే, ఇజ్రాయిల్ సాయుధ బలగాలు పాల్పడుతున్న యుద్ధ నేరాలపై భారత ప్రభుత్వం మౌనం వహిస్తోంది. వంద మందికి పైగా పౌరులు మరణించినటువంటి ఉత్తర గాజాలోని జబాలియా శరణార్థ శిబిరంపై బాంబు దాడి తర్వాత కొన్ని యూరోపియన్ దేశాల విదేశాంగ మంత్రులు యుద్ధంలో అంతర్జాతీయ నిబంధనలకు కట్టుబడి ఉండాలని ఇజ్రాయిల్‌ను కోరారు. కానీ భారత విదేశాంగ శాఖ మాత్రం ఈ విషయంలో మౌనం వహించింది.

ప్రత్యేక స్వతంత్ర దేశం కావాలని కోరుతున్న పాలస్తీనియన్ల ఆశయం పట్ల నిబద్ధత ఉందంటూనే, మరో పక్క ఇజ్రాయిల్‌కు మద్దతును ఇస్తూ రెండింటినీ సమతుల్యం చేస్తున్నామనే సాకుతో దానికి తిలోదకాలిస్తున్నది. మహిళలు, చిన్నారులతో సహా గాజాలోని ప్రజలపై మూకుమ్మడి హత్యలకు, తినడానికి తిండి, తాగడానికి నీరు లేక సామూహిక ఆకలిచావులకు పాల్పడేందుకు నెతన్యాహు ప్రభుత్వానికి అమెరికా పూర్తి స్వేచ్ఛ ఇచ్చింది. ఈ అమానవీయమైన వ్యూహానికి మోడీ ప్రభుత్వం సహకరిస్తోంది. ఇంతటి విపత్కర పరిస్థితుల్లో పాలస్తీనా ప్రజలకు మద్దతునివ్వకపోగా, పాలస్తీనియన్లకు మద్దతుగా, ఇజ్రాయిల్ దూకుడుకు వ్యతిరేకంగా జరుగుతున్న నిరసనలు, ఆందోళనలను కేంద్రంలోని మోడీ ప్రభుత్వం, రాష్ట్రాల్లోని బిజెపి ప్రభుత్వాలు అణచివేస్తున్నాయి. పాలస్తీనా ప్రజలకు మద్దతుగా సమావేశాన్ని నిర్వహించేందుకు యత్నించిన 92 ఏళ్ళ మాజీ జనసంఘ్ నేతను జమ్మూలో అరెస్టు చేయడం ఇందుకు తాజా ఉదాహరణ.

కాల్పుల విరమణకు ఇజ్రాయిల్ ప్రభుత్వం తిరస్కరిస్తుండడం చూస్తుంటే గాజాలో యుద్ధం సుదీర్ఘంగా సాగేలా కనిపిస్తోంది. ఈ పరిస్థితుల్లో పాలస్తీనియన్లకు సంఘీభావంగా వామపక్షాలు, ప్రజాస్వామ్య శక్తులు తమ పోరాటాన్ని, ఉద్యమాలను మరింత విస్తరించి, ఉధృతం చేయాల్సిన అవసరం వుంది. ఈ అంశంపై మోడీ ప్రభుత్వ విప్లవ ప్రతీఘాత, మతోన్మాద వైఖరిని ఎండగట్టాల్సి వుంది.

('పీపుల్స్ డెమోక్రసీ' సంపాదకీయం)

★

జనవాక్యం

ఎన్నికల బాండ్లు : పారదర్శకత!

ఎన్నికల బాండ్ల విధానంలో తప్పొప్పులపై ఐదుగురు సుప్రీం న్యాయమూర్తుల బెంచ్ వాదనలు వింటోంది. ఐదేళ్ల క్రితం మొదలైన ఈ విధానం అనతి కాలంలోనే ఎన్నికల ఫండింగ్‌లో కీలకంగా మారింది. పార్టీలకు వచ్చే నిధుల్లో అరవై శాతం ఇదే మార్గాన వస్తుండడం విశేషం. అనుకున్నట్టుగానే వచ్చే నిధుల్లో 56 శాతం అంటే మిగతా పార్టీలకు వచ్చే నిధులకన్నా ఎక్కువ శాతం అధికార పార్టీకే దక్కుతున్నాయి. ఈ విధానంలో ఎవరైనా సంస్థలు, వ్యక్తులు తమ పేర్లు వెల్లడించకుండా స్టేట్ బ్యాంకులో డబ్బు చెల్లించి బాండ్లు కొని వాటిని తమకు నచ్చిన పార్టీకి డొనేట్ చెయ్యొచ్చు. ఆ పార్టీ వాటిని డబ్బుగా మార్చి ఎన్నికలకైనా, ఇతర సంబంధిత అవసరాలకైనా వాడుకోవచ్చు. ఇంతకు ముందు అలా డబ్బు రూపంలో అయితే డొనేట్ చెయ్యడానికి ఆ సంస్థ లాభాల్లో 7.5 శాతం మించకూడదన్న నియమం ఉండేది. ఈ విధానంలో అలాంటిదేమీ లేదు. పైగా నష్టాలొచ్చినా చెయ్యొచ్చు. విదేశీ సంస్థలైనా చెయ్యొచ్చు. ఎవరు వాటిని సమకూర్చారో బయటకు చెప్పనక్కరలేదు. కాబట్టి ఈ విధానం వల్ల ప్రజాస్వామ్య పద్ధతిలో కీలకమైన ఎన్నికలు పారదర్శకత లేకుండా తయారవుతున్నాయని ఒక వాదన. ఒక రకంగా అది నిజమే. ఒక పార్టీ ఎవరి ద్వారా నిధుల్ని పొందుతుందో తెలిస్తే ఆ పార్టీ ప్రాధాన్యతలపై ప్రజలకు అవగాహన ఉంటుంది. ఒకరికి ఒకరు సహకరించుకోవడం బహిర్గతమై కొంత అదుపు ఉంటుంది. తప్పుడు మార్గాల్లో వస్తున్న నిధులు...అంటే కుదేలైన సంస్థలు ఇచ్చే నిధులు బయటపడి అంతరార్థాలు అర్థమవుతాయి. అభ్యర్థి నేర చరిత్ర తెలిస్తే ఎలాంటి లాభమో, పార్టీ సేకరించిన నిధుల మూలాలు తెలుసుకున్నా అలాంటి లాభమే ఉంటుంది. ఏదైనా పార్టీలు సేకరించే నిధులపై కూడా అభ్యర్థుల ఎన్నికల ఖర్చుపై ఉన్నట్టుగానే సీలింగ్ ఉండాలి. లేదా వచ్చిన ఎన్నికల విరాళాల్ని గుర్తింపు పొందిన అన్ని పార్టీలకు సమానంగా పంచే తటస్థ వ్యవస్థ ఉండాలి. లేదంటే కర్ర ఉన్నవాడిదే బర్రె తరహాలో నిధులన్నీ ఒకవైపే ప్రవహిస్తాయి. న్యాయస్థానం ఈ విషయంపై ఏం తీర్పు చెప్పనున్నదో చూడాలి.

- డా. డి.వి.జి.శంకర రావు, మాజీ ఎంపీ, పార్వతీపురం.

ఆన్‌లైన్ మోసాలు

కరోనా పుణ్యమాని ఆన్‌లైన్‌లో నగదు కార్యకలాపాలు అలవాటయ్యాయి. మోసగాళ్లు ఇదే అదనుగా మన నగదును మనకు తెలియకుండా కాజేస్తున్నారు. అయితే ఖాతాదారులు కొన్ని అంశాలను తెలుసుకోవడం అవసరం. ఎ.టి.యం లలో నగదు తీసేటప్పుడు రహస్య పిన్ ను ఎవరికీ కనిపించకుండా కీ బోర్డ్‌పై ఒత్తాలి. శివారు ప్రాంతాల్లో ఉన్న కేంద్రాల నుండి కాక జనావాసాలు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లోని ఎటియంల నుండి నగదును తీసుకోవాలి. అనుమానితులు ఉంటే అక్కడ నగదు తీయకూడదు. ఏ ఒక్క బ్యాంకు అధికారి కాల్ చేసి ఖాతాకు సంబంధించిన వివరాలు అడగరు. అలాగే మనకు వచ్చే ఒ.టి.పి ఎవరికీ చెప్పకూడదు. ఆన్‌లైన్‌లో లావాదేవీలు చేసేటప్పుడు బ్యాంకుకి సంబంధించిన వెబ్‌సైట్ మాత్రమే ఉపయోగించాలి. ఆన్‌లైన్‌లో ఫోన్ నంబర్లను నమ్మగూడదు. అనుమానిత లింకులను తెరవగూడదు. యు.పి.ఐ లతో జాగ్రత్తగా లావాదేవీలు చెయ్యాలి. సామాజిక మాధ్యమాల్లో వ్యక్తిగత సమాచారాన్ని, ఫోటోలను ఉంచగూడదు. అసభ్యకరమైన సైట్లను తెరువగూడదు. ఉచితాలను, లాటరీలను నమ్మగూడదు. ఇంట్లో చిన్న పిల్లలకు ఫోన్ ఇచ్చేటప్పుడు జాగ్రత్తగా ఉండాలి. మొబైల్‌ని లాక్ చేసుకోవాలి. ఇక ఏదైనా అక్రమ లావాదేవీలు జరిగితే వెంటనే బ్యాంకుకు ఫోన్ చేసి తెలియచేయాలి. ప్రభుత్వం ప్రవేశపెట్టిన 1930 నంబరుకి కాల్ చేసి జరిగిన విషయాన్ని చెప్పి కంప్లైంట్ ఇవ్వాలి.

- జనక మోహనరావు, అధ్యాపకుడు, ఆమదాలవలస, శ్రీకాకుళం జిల్లా

విమర్శ

అమెరికా కోసం భారత కోళ్ల రైతుల బలి

సత్య



తాజాగా నరేంద్ర మోడీ సర్కార్ అమెరికాతో కుదుర్చుకున్న ఒప్పందాలలో భాగంగా అక్కడ తినటానికి తిరస్కరించే కోడి కాళ్లను మన దేశం దిగుమతి చేసుకొనేందుకు, భారీగా పన్ను తగ్గించేందుకు అంగీకరించింది. అమెరికా మోజులో ఉన్న నరేంద్ర మోడీకి అక్కడి కోడి కాళ్లు, ఉత్పత్తిదారులు, వారి లాభాలు తప్ప భారతీయ కోడి మాంసం, దాని ఉత్పత్తి, మార్కెటింగ్‌లో భాగస్వాములయ్యే లక్షల మంది రైతులు, కార్మికులు, చిన్న వ్యాపారులు గుర్తుకు రాలేదు. నిత్యం పారాయణం చేసే దేశభక్తి, స్వప్రయోజనాలను తుంగలో తొక్కారా లేక విశ్వగురువుగా నీరాజనాలందుకొనేందుకు అమెరికాకు దాసోహం అన్నారా?

ఇటీవల మన ప్రధాని నరేంద్ర మోడీ 106వ మన్ కీ బాత్ సుభాషితాల్లో 'స్థానిక వస్తువులనే కొనండి' అని మరోసారి పునరుద్ఘాటించారు. ఆ మాటలు విన్న తరువాత నీతులు ఇతరులకు చెప్పడానికేనా అన్న సందేహం రాకమానదు. ప్రపంచంలో కోడి మాంసం ఎక్కువగా ఉత్పత్తి చేసే దేశాల్లో ఎఫ్ఏఓ సంస్థ 2021 వివరాల ప్రకారం భారత్ (36,70,156 టన్నులతో) ఆరవ స్థానంలో ఉంది. అమెరికా (2,06,52,971 టన్నులతో) మొదటి స్థానంలోను, చైనా (1,47,00,000), బ్రెజిల్ (1,46,36,478), రష్యా (46,17,338), ఇండోనేషియా (38,44,346 టన్నుల ఉత్పత్తితో) తర్వాతి నాలుగు స్థానాల్లోను వున్నాయి. తొలి పది స్థానాల్లో మన తరువాత మెక్సికో, జపాన్, అర్జెంటీనా, టర్కీ ఉన్నాయి. చైనా, మన దేశం జనాభాలో ఒకే విధంగా ఉన్నప్పటికీ జనాభా కొనుగోలు శక్తి ఎక్కువ గనుక చైనా ఇంకా దిగుమతి చేసుకుంటోంది. మన దగ్గర ఉత్పత్తి అవుతున్న కోడి మాంసం, గుడ్లనే పూర్తిగా విని యోగించలేని స్థితిలో ఇతర దేశాలకు ఎగుమతి చేస్తున్నాం. 2014-2019 సంవత్సరాల్లో తలసరి సగటు కోడి మాంస వినియోగం చైనాలో 12.1 నుంచి 14.9 కిలోలకు పెరగ్గా మన దేశంలో 2.49 నుంచి 3.17 కిలోలకు పెరిగింది. పాకిస్తాన్‌లో 5.11 నుంచి 6.8 కిలోలకు పెరిగింది. ప్రపంచంలో 2021లో బహమాస్ 70.2 కిలోలతో ప్రథమ స్థానంలో ఉంది. తాజాగా నరేంద్ర మోడీ సర్కార్ అమెరికాతో కుదుర్చుకున్న ఒప్పందాలలో భాగంగా అక్కడ తినటానికి తిరస్కరించే కోడి కాళ్లను మన దేశం దిగుమతి చేసుకొనేందుకు, భారీగా పన్ను తగ్గించేందుకు అంగీకరించింది. అమెరికా మోజులో ఉన్న నరేంద్ర మోడీకి అక్కడి కోడి కాళ్లు, ఉత్పత్తిదారులు, వారి లాభాలు తప్ప భారతీయ కోడి మాంసం, దాని ఉత్పత్తి, మార్కెటింగ్‌లో భాగస్వాములయ్యే లక్షల మంది రైతులు, కార్మికులు, చిన్న వ్యాపారులు గుర్తుకు రాలేదు. నిత్యం పారాయణం చేసే దేశభక్తి, స్వప్రయోజనాలను తుంగలో తొక్కారా లేక విశ్వగురువుగా నీరాజనాలందుకొనేందుకు అమెరికాకు దాసోహం అన్నారా? ఏడు సంవత్సరాల క్రితం మన కోళ్ల పరిశ్రమ మార్కెట్ విలువ రూ.యాభై వేల కోట్లు, 2022లో రూ.1,90,530 కోట్లకు పెరిగింది, 2028 నాటికి రూ.3,40,780 కోట్లకు చేరుతుందని అంచనా. లక్షలాది మంది ఉపాధి పొందుతున్నారు. ఇలాంటి పరిశ్రమకు కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పెద్ద దెబ్బ అని భావిస్తున్నారు. అమెరికా నుంచి దిగుమతి చేసుకొనే కోడి మాంసం, ఇతర కొన్ని దిగుమ తుల మీద భారీగా పన్నుల తగ్గింపును అడ్డుకో నేందుకు కొందరు సుప్రీంకోర్టుకు వెళ్లనున్నట్లు ప్రకటిం చారు. కోర్టులో ఎవరు ఏం వాదిస్తారో చెప్పలేం. ప్రభుత్వ విధాన నిర్ణయాలను సాధారణంగా కోర్టులు సమర్థిస్తాయి.

తమ కోళ్ల ఉత్పత్తులను మన దేశంలో కుమ్మరించేందుకు అమెరికా చాలా కాలం నుంచి చూస్తోంది. బెదిరింపు, ఒత్తిడి వంటి అనేక రూపాల్లో అది ప్రయత్నించి చివరికి అనుకున్నది సాధించింది. 2007లో మన్మోహన్ సింగ్ ప్రధానిగా ఉన్న నాటి యుపిఏ ప్రభుత్వం అమెరికా కోళ్ల ఉత్పత్తులపై నిషేధం విధించింది. అది చెల్లదంటూ అమెరికా ప్రపంచ వాణిజ్య సంస్థలో కేసు దాఖలు చేసింది. అమెరికా తన కోళ్ల ఉత్పత్తుల్లో 15 నుంచి 20 శాతం వరకు ఎగుమతులు చేస్తున్నది. 2014లో అమెరికా కేసు గెలిచింది. అధికారానికి వచ్చిన తొలి రోజులు గనుక మోడీ సర్కార్ ఆ తీర్పును అమలు చేసేందుకు భయపడింది. ప్రపంచ వాణిజ్య సంస్థ ద్వారా భారత్ మీద ఆంక్షలను విధింపచేయిస్తామని అమెరికా బెదిరించటంతో కేంద్ర ప్రభుత్వం చికెన్‌లెగ్స్ దిగుమతులకు అనుమతిస్తున్నట్లు 2017లో తెలిపింది. నిజానికి మన దేశంలో ఉత్పత్తి అవుతున్న చికెన్ మాంసం, గుడ్లు అవసరాలకు మించి ఉండటంతో 2016-17 లోనే రూ.532 కోట్ల మేరకు వివిధ దేశాలకు ఎగుమతి చేశాము. నరేంద్ర మోడీ రెండవసారి విజయం సాధించిన తరువాత నాటి అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఒకవైపు మోడీని పొగడ్తలు, ఆలింగనాలతో ముంచెత్తుతూనే మరోవైపు మరింత ఒత్తిడి పెంచాడు. అప్పటి వరకు మన దేశం నుంచి అమెరికాకు ఎగుమతి చేస్తున్న వస్తువుల మీద జిపిఎస్ పేరుతో 600 కోట్ల డాలర్ల మేర ఇస్తున్న దిగుమతి పన్ను రాయితీలను రద్దు చేస్తున్నట్లు ప్రకటించాడు. దానికి ప్రతిగా మన దేశం కూడా అమెరికా నుంచి దిగుమతి చేసుకుంటున్న యాపిల్స్ వంటి 28 రకాల వస్తువులపై దిగుమతి పన్ను పెంచింది. మన మార్కెట్‌ను మరింతగా తెరవాలని డిమాండ్ చేస్తున్న అమెరికా ఇంతవరకు జిపిఎస్‌ను పునరుద్ధరించలేదు. ట్రంప్ పోయి బైడెన్ వచ్చినా జరిగిందేమీ లేదు గానీ మన దేశం మాత్రం అమెరికా వస్తువుల మీద విధించిన పన్నులను మోడీ సర్కార్ తాజాగా తగ్గించింది. అమెరికా-చైనా వాణిజ్య పోరుతో మన దేశం లబ్ధి పొందవచ్చని కొందరు ఆశించారు. అది కార్యరూపం దాల్చలేదు. తొలి రోజుల్లో అమెరికా మీద మోడీ సర్కార్ చూపిన పరిమిత ప్రతిఘటన తరువాత నీరుగారింది. ఇప్పుడు పూర్తిగా లొంగిపోయింది. నిజానికి నరేంద్ర మోడీ జూన్ నెలలో అమెరికా వెళ్లినపుడే పన్నుల తగ్గింపు నిర్ణయం తీసుకున్నారు, సెప్టెంబరులో వెల్లడిం చారు.

కోళ్ల పరిశ్రమలో మార్కెట్‌ను మరింత తెరిచారు. రైతాంగ స్పందన చూసిన తరువాత అమెరికా, ఐరోపా, ఇతర దేశాల నుంచి పాల ఉత్పత్తులను అనుమతించి పాడి పరిశ్రమకూ మంగళం పాడేందుకు చూస్తున్నారు. అన్నీ ఒకేసారి చేస్తే ప్రతిఘటన తీవ్రంగా ఉంటుంది గనుక దశలవారీ నిర్ణయాలు తీసుకుంటారు. మన దేశంలో పాల పదార్థాల ధరల్లో సగానికి దిగుమతి చేసుకున్న వాటిని విక్రయిస్తారని గతంలోనే అనేక మంది చెప్పారు. 2020లో మన దేశంలో పాల పొడి ధర కిలో రూ.130 నుంచి 150 వరకు ఉండగా 30 శాతం దిగుమతి పన్నుతో సహా అమెరికా నుంచి రూ.70కే దిగుమతి చేసుకోవచ్చని తేలింది. ఇప్పుడు కూడా ధరల్లో మార్పులు ఉండవచ్చు తప్ప విదేశాలు ఇచ్చే సబ్సిడీలు భారీ ఎత్తున ఉంటాయి. చైనాతో అమెరికా 2018లో ప్రారంభించిన వాణిజ్య యుద్ధం ఇంకా కొనసాగుతూనే ఉంది. అందువలన అమెరికన్లు తమ వస్తువులకు కొత్త మార్కెట్ల కోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు.

అమెరికా ఒత్తిడిని అడ్డుకొనేందుకు మనసుండాలేగానీ మార్గం దొరక్కపోదు. గతంలో మన్మోహన్ సింగ్ ప్రభుత్వం అమెరికాలో వ్యాపించిన బర్డ్ ఫ్లూను పేర్కొంటూ కోళ్ల ఉత్పత్తుల దిగుమతులను నిషేధించింది. నరేంద్ర మోడీ ఆంక్షలను, దిగుమతి పన్నులను సడలిస్తున్న సమయంలో అమెరికాలోని వాణిజ్య పౌల్ట్రీ ఫారాల్లో ఫ్లూ కనిపించింది. 2022 నుంచి ఇప్పటి వరకు ఈ వ్యాధికి అక్కడ 5.88 కోట్ల కోళ్ళు, టర్కీ కోళ్లు మరణించినట్లు 2023 అక్టోబరు పదవ తేదీన రాయిటర్స్ వార్తా సంస్థ పేర్కొన్నది. అమెరికాలో అతి పెద్ద గుడ్ల ఉత్పత్తి సంస్థ కాల్ మైన్ ఫుడ్స్ విక్రయించే గుడ్ల ధర గత ఏడాది కాలంలో 48 శాతం పడిపోయింది. సెప్టెంబరు రెండవ తేదీ నాటికి అంతకు ముందు నాలుగు నెలల్లో అమ్మకాలు 30 శాతం పడిపోయినట్లు పేర్కొన్నది. బర్డ్ ఫ్లూ మనుషుల్లో కూడా సులభంగా వ్యాప్తి చెందవచ్చని ప్రపంచ ఆరోగ్య సంస్థ, ప్రపంచ జంతు ఆరోగ్య సంస్థ కూడా జులై నెలలో హెచ్చరికలు జారీచేశాయి. 2022లో 67 దేశాల్లో వ్యాధి కారణంగా 13 కోట్ల కోళ్లను వధించటం లేదా మరణించినట్లు లెక్కలు ఉన్నాయి. ఈ ఏడాది ఇప్పటి వరకు మరో 14 దేశాల్లో వ్యాధి కనిపించింది. అందువలన ఈ కారణంగా కూడా అమెరికా ఉత్పత్తులను అడ్డుకోవచ్చు.

భారీ మొత్తాలు సబ్సిడీ ఇస్తున్న అమెరికా నుంచి దిగుమతి చేసుకున్న చికెన్ లెగ్స్ మన దేశంలో ప్రస్తుతం ఉన్న ధరల కంటే తక్కువకే దొరుకుతాయని, అది మన పరిశ్రమకు తీరని దెబ్బ అని సంయుక్త కిసాన్ మోర్చా హెచ్చరించింది. అమెరికాలో చికెన్స్ లెగ్స్ ఉత్పాదన ఖర్చు టన్నుకు 700 నుంచి 800 డాలర్లు ఉంటుందని, వంద శాతం పన్ను విధిస్తే 1,500 నుంచి 1,600 డాలర్లకు దిగుమతి చేసుకోవచ్చని, మన దేశంలో టన్ను ఉత్పత్తి ఖర్చు 1,800 డాలర్లుగా ఉందని ఒక ప్రకటనలో పేర్కొన్నది. అదే ఐదు, పది శాతం పన్ను మాత్రమే విధిస్తే ఎంత చౌకగా మన మార్కెట్‌ను ముంచెత్తుతారో ఊహించుకోవాల్సిందే.

★

కవిత్వం

మృగ వినోదం

మంటలు మంటలు
మంటలు
ప్రపంచంలో ఏదో ఓ మూల
ఎప్పుడూ మంటలు
ఎప్పుడూ ఆర్తనాదాలు
ఎప్పుడూ ఆకలి కేకలు
పసిపిల్లల తల్లుల రోదనలు
ఆప్తులు దూరమౌతున్న నిశిరాత్రులు
దాక్కునే జాగా లేక
తమదంటూ అంగుళం భూమి లేక
తమ స్థలంలోనే కాందిశీకులై
బిక్కుబిక్కుమంటూ
క్షణాలు లెక్కపెడుతూ
బతుకీడుస్తున్న అభాగ్యులు
తమ బాధలకు కారణమైనవాడినీ
కీర్తిస్తున్న జనాల్ని చూసి
ఏ మానవత్వంకోసం
ఎదురు చూస్తారు పాపం
మండేది ఎవరైనా
మండిస్తున్నవాడు ఎప్పుడూ ఒకడే
మంటల్ని పండిస్తున్నవాడు
ఎప్పుడూ వాడే మరి
కమిలిన దేహాల వాసనలే
వాడి ముక్కుపుటాలకు సుగంధం
మరి
ఎవరో ఒకరు
ఎప్పుడూ చస్తుండాలి వాడికి
ఎవరో ఒకరు
ఎప్పుడూ చంపుతుండాలి వాడికి
మనుషులేమైపోతే వాడికేం
మృగ వినోదం వాడికి ఇష్టం మరి
మనిషి మొహం పెట్టుకున్న
జంతువే వాడు.

- జంధ్యాల రఘుబాబు,
సెల్ : 9849753298

మీ వ్యాసాలు 5000 క్యారెక్టర్లు లేదా 700 పదాలు వుండాలి. పంపాల్సిన మెయిల్ :
editpageps@gmail.com

సహాయకుల పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లా మహిళా, శిశు సంక్షేమ, సాధికారత కార్యాలయంలో సాక్షం అంగన్వాడీ పోషణ్ 2.0 కింద కాంట్రాక్ట్ పద్ధతిన జిల్లా కో-ఆర్డినేటరు, ప్రాజెక్టు సహాయకుల పోస్టులు కాంట్రాక్ట్ పద్ధతిన ఏడాది పాటు భర్తీకి గానూ అర్హత కలిగిన అభ్యర్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు జిల్లా మహిళా, శిశు సంక్షేమ, సాధికారత అధికారిణి ఎంఎన్ రాణి తెలిపారు. పూర్తి చేసిన దరఖాస్తుతో తమ కార్యాలయంలో ఈనెల 10 తేదీ సాయంత్రం 6గంటల్లోపు అందజేయాలని తెలిపారు.

ఎంపిటిసిలకు జీతాల్లేవ్..!

- పదవి చేపట్టిన రెండేళ్లవుతున్నా అందని వేతనాలు
- రూ.మూడు వేలు కూడా ఇవ్వలేని దుస్థితిలో ప్రభుత్వం
- ఇదేం దారుణమంటున్న ఎంపిటిసిలు
- పలుచోట్ల బిల్లులు పెట్టినట్లు చెబుతున్నా అందని పరిస్థితి
- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 870 మంది ఎంపిటిసిలు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

స్థానిక ప్రజాప్రతినిధులైన ఎంపిటిసిలకు గెలిచిన తర్వాత ఇప్పటివరకూ జీతాలివ్వని పరిస్థితి నెలకొంది. దీంతో అసలు ఎంపిటిసిలకు జీతాలిస్తారా?లేదా? అన్న అనుమానం నెలకొంది. పలుమండలాల్లో బిల్లులు పెట్టినట్లు చెబుతున్నా జీతాలు మాత్రం అందడం లేదు. ఉమ్మడి జిల్లాలో 48 మండలాలుండగా 870 మంది వరకూ ఎంపిటిసిలున్నారు. వీరంతా ఎంతో ఖర్చుపెట్టి ఎన్నికల్లో గెలిచారు. ఎంపిటిసిలకు గ్రామాల్లో సరైన ప్రాధాన్యత లేకుండాపోయింది. ప్రతిపక్ష పార్టీలకు చెందిన ఎంపిటిసిల పరిస్థితి అయితే వేరేచెప్పనక్కర్లేదు. కనీసం వేతనాలు కూడా ఇవ్వడం లేదు. ఎంపిటిసిలకు నెలకు రూ.మూడు వేలు గౌరవ వేతనంగా ప్రభుత్వం నిర్ణయించింది. ఎంపిటిసిలు పదవీబాధ్యతలు చేపట్టి రెండేళ్లు గడిచిపోయింది. ఇప్పటి వరకూ జీతాల ఊసే లేదు. దాదాపు ఒక్కో ఎంపిటిసికి వేతనం కింద రూ.70వేలకు పైగా అందాల్సి ఉంది. ప్రజాప్రతినిధులకు నిత్యం అనేకవిధాలుగా ఖర్చులు ఉంటాయి. పెండింగ్ జీతం ఇస్తే ఏదో ఒక ఖర్చుకు వస్తుందన్న భావన ఎంపిటిసిల్లో వ్యక్తమవుతోంది. ఏజెన్సీతోపాటు, ఎస్‌సి, బిసి సామాజిక తరగతికి చెందిన పలువురు ఎంపిటిసిల్లో రోజువారీ పనిచేసుకుని జీవించేవారు సైతం ఉన్నారు. ప్రజాప్రతినిధిగా ఎంపికైన తర్వాత గ్రామాల్లో తిరగడం వంటి అనేక పనులు ఉండటంతో ఖర్చులు తప్పవు. ప్రభుత్వం నుంచి వేతనాల రూపంలో రావాల్సిన సొమ్ములు రాకపోవడంతో చాలామంది ఎంపిటిసిలు ఇబ్బందులు పడుతున్నారు. ఎంపిటిసిల్లో వేతనాల గురించి పట్టించుకునేవారు ఎవరున్నారంటూ చర్చ నడుస్తోంది. ఎంపిటిసిలంతా ధనవంతులు కాదని, రిజర్వేషన్ సీట్లలో రోజువారీ పనిచేసుకునే నాయకులు సైతం ఉన్న పరిస్థితి నెలకొంది. ఎంపిటిసిల జీతాల గురించి ఏ ఒక్కరూ మాట్లాడటం లేదు. ఎంఎల్‌ఎలకు, ఎంపీలకు ప్రతినెలా ప్రభుత్వం జీతాలు ఇచ్చేస్తోంది. మరి స్థానిక ప్రజాప్రతినిధులకు మాత్రం ఏళ్లతరబడి జీతాలివ్వడం లేదు. పంచాయతీ సర్పంచులు ఎన్నికై రెండున్నరేళ్లు దాటిపోగా తొమ్మిది నెలల వేతనంగా ఏలూరు జిల్లాలో దాదాపు రూ.1.50 కోట్లను రెండురోజుల క్రితం ప్రభుత్వం విడుదల చేసింది. ఎంపిటిసిలకు మాత్రం అదికూడా లేకుండా పోయింది. గ్రామాల అభివృద్ధిలో స్థానిక ప్రజాప్రతినిధులదే కీలకపాత్ర. ఎంఎల్‌ఎలకు, ఎంపిలకు రూ.లక్షల్లో జీతాలు, అలవెన్సులు ఇస్తున్న ప్రభుత్వం స్థానిక ప్రజాప్రతినిధులైన సర్పంచులకు, ఎంపిటిసిలకు మాత్రం రూ.మూడువేలు వేతనం మాత్రమే ఇస్తోంది. ఆ సొమ్ము కూడా సకాలంలో ఇవ్వని పరిస్థితి నెలకొంది. ప్రజలకు నిత్యం దగ్గరగా సర్పంచులు, ఎంపిటిసిలే ఉంటారు. అలాంటి ప్రజాప్రతినిధుల పట్ల ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. పలు చోట్ల ఎంపిటిసిలకు కొన్నినెలల వేతన సొమ్ము జమైనట్లు చెబుతున్నా స్పష్టత లేకుండా పోయింది. ఎంపిటిసిల జీతాల పెండింగ్‌కు సంబంధించి ప్రజాప్రతినిధుల్లో హాట్‌టాపిక్‌గా మారింది. ఇప్పటికే వాలంటీర్, సచివాలయ వ్యవస్థలను తెచ్చి స్థానిక ప్రజాప్రతినిధులైన సర్పంచి, ఎంపిటిసిలను ప్రభుత్వం ఉత్సవ విగ్రహాలుగా మార్చేసింది. ప్రభుత్వ పథకాలన్నీ ప్రజాప్రతినిధులతో సంబంధం లేకుండానే జరిగిపోతున్నాయి. పంచాయతీలకు వచ్చే ఆర్థికసంఘం నిధులను సైతం కరెంటు బిల్లుల పేరుతో ప్రభుత్వం లాగేసుకుంటుంది. దీంతో గ్రామాల్లో అభివృద్ధి లేకుండాపోయింది. స్థానిక ప్రజాప్రతినిధులకు ఇవ్వాల్సిన జీతాల విషయంలోనూ ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు విమర్శలకు తావిస్తోంది. ఎంపిటిసిలకు పెండింగ్ జీతాలు జమచేయాలని ప్రజాప్రతినిధులు కోరుతున్నారు.

మహారాజశ్రీ నరసరావుపేట అడిషనల్ సీనియర్ సివిల్‌జడ్జి గారి కోర్టులో
ఐ.ఎ. నెం. 229/2023
ఇన్ ఓ.యస్.నెం. 68/2016

దేవళ్ళ కోటయ్య వగైరాలు ... పిటీషనర్లు / వాదులు
మరియు
కొమేరపు రాముడు వగైరాలు
... రెస్పాండెంట్స్ / ప్రతివాదులు

టు
ఆర్-4 : కొమెరపు రాంబాబు తండ్రి : రాముడు, బ్లాక్ నెం. ఎ-299, విజయవాడ.
ఆర్-5 : కొమెరపు శ్రీనివాసరావు, తండ్రి : రాముడు, డోర్ నెం. 29/3-43, పుట్టరోడ్డు, రాణిగారితోట, కృష్ణలంక, విజయవాడ.
ఆర్6 : కొమెరపు క్రిష్ణ, తండ్రి : రాముడు, ప్రకాశ్‌నగర్, నరసరావుపేట.

పై నెంబరు దావాలో మిమ్మల్ని వారులుగా చేర్పించమని కోరుతూ పిషటీన్ దాఖలు చేయగా మీరు కోర్టువారి నోటీసులు తీసుకోని కారణంగా ఈ పేపరు ప్రకటన ద్వారా మీ యొక్క నోటీసు నిమిత్తం ది. 10-11-2023కి వాయిదా అయివున్నది. కావున వాయిదారోజు ఉదయం 10-30 గం.లకు పై కోర్టువారి యెదుట హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొన గలరు. లేనియెడల పిటీషను మీ పరోక్షమందు తీర్మానించబడును.

(బై కోర్టు ఆర్డర్)

బి.అనిల్‌కుమార్,
పిటీషనర్లు తరపు అడ్వకేట్,
నరసరావుపేట.

తుగ్గలిని కరువు మండలంగా ప్రకటించాలి

ప్రజాశక్తి - తుగ్గలి

కర్నూలు జిల్లా తుగ్గలి మండలాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించాలని నాయకులు, రైతులు డిమాండ్ చేశారు. గురువారం సిపిఎం, సిపిఐ, టిడిపి, కాంగ్రెస్, జనసేన ఆధ్వర్యంలో తుగ్గలిలోని గుత్తి, పత్తికొండ ప్రధాన రహదారిని దిగ్బంధించారు. వివిధ గ్రామాలకు చెందిన రైతులు ఎడ్లబండ్లతో నిరసన వ్యక్తం చేశారు.

క్షేత్రస్థాయి పరిశోధనలతో ఆక్వాకల్చర్ అభివృద్ధి

- మోదడుగు విజయ్ గుప్తా

ప్రజాశక్తి - కాళ్ల(పశ్చిమగోదావరి)

క్షేత్రస్థాయి పరిశోధనలతో ఆక్వాకల్చర్ మరింత అభివృద్ధి చెందుతుందని పద్మశ్రీ అవార్డు గ్రహీత, చేపల శాస్త్రవేత్త మోదడుగు విజయ్ గుప్తా అన్నారు. గురువారం పెదఅమిరంలో రాధాకృష్ణ కన్వెన్షన్ హాల్లో ఈ నెల 2, 3, 4 తేదీల్లో అక్వా ఎక్స్ ఇండియా ప్రదర్శనను కైకలూరు ఎంఎల్‌ఎ దూలం నాగేశ్వరరావు, శాసన మండలి సభ్యులు జయమంగళ వెంకటరమణ తొలుత జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ ప్రదర్శనకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన శాస్త్రవేత్త విజయ్ గుప్తా మాట్లాడుతూ చేపల పెంపకానికి తక్కువ ఖర్చుతో జంతు మాంసకృత్తులు అందించడం, మానవాళి భవిష్యత్తు ఆహార సంక్షోభాన్ని పరిష్కరించడంలో కీలకమన్నారు. కైకలూరు ఎంఎల్‌ఎ డి.నాగేశ్వరరావు మాట్లాడుతూ రైతు కళ్లల్లో ఆనందం ఉండాలంటే నాణ్యమైన సీడ్, ఫీడ్ ఉపయోగించాలన్నారు. ప్రస్తుతం ఆక్వా రంగం ఒడిదుడులతో సాగుతోందన్నారు. క్షేత్ర స్థాయి పరిశీలన చేపట్టాలన్నారు. సముద్రతీరంలో రొయ్య సాగు చేపట్టి గణనీయమైన ఎగుమతుల్లో రాష్ట్రం దేశంలోనే ప్రధాన భాగంగా ఉందన్నారు. ఉండి ఎంఎల్‌ఎ మంతెన రామరాజు మాట్లాడుతూ ఆక్వా సాగులో ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించి దిగుబడి పెంచేందుకు అనుసరించాల్సిన ఆధునిక విధానాలపై ఆక్వా అంతర్జాతీయ ప్రదర్శన ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఎంఎల్‌సి జయ మంగళ వెంకటరమణ మాట్లాడుతూ రైతులకు సాంకేతిక పరిజ్ఞానం, యాంత్రికరణకు సంబంధించిన పరికరాలు ఒక చోట ప్రదర్శనగా ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ ఛైర్మన్ పాతపాటి వెంకట శ్రీనివాసరాజు మాట్లాడుతూ ఆక్వా రైతులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహ రాజు, సదస్సు ఆర్గనైజర్ దంతులూరి వేణు, సికెఎన్ మూర్తి, పెనుమత్స విశ్వనాథరాజు, కాలవ వెంకట్రావు, స్టాల్స్ నిర్వాహకులు పాల్గొన్నారు.

ముంబయికి బరోడా ఝలక్

సయ్యద్ ముస్తాక్ అలీ టి20 టోర్నీ

ముంబయి: సయ్యద్ ముస్తాక్ అలీ టి20 టోర్నీలో సంచలనం నమోదైంది. పటిష్ట ముంబయికి బరోడా ఝలక్ ఇచ్చి సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. శుక్రవారం జరిగిన తొలి క్వార్టర్‌ఫైనల్లో తొలిగా బ్యాటింగ్‌కు దిగిన ముంబయి జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 8వికెట్ల నష్టానికి 148పరుగులు చేసింది. శివమ్ దూబే(48), సర్ఫరాజ్ ఖాన్(33) బ్యాటింగ్‌లో రాణించగా.. బరోడా బౌలర్లు సోయెట్ సోఫారియాకు మూడు, అభిమన్యుసింగ్ రాజ్‌పుత్‌కు రెండు వికెట్లు దక్కాయి. ఛేదనలో బరోడా జట్టు 18.5ఓవర్లలో 7వికెట్ల నష్టానికి 149పరుగులు చేసి గెలిచింది. విష్ణు సోలంకి (49నాటౌట్), జ్యోత్సల్ సింగ్(34) బ్యాటింగ్‌లో రాణించారు. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ విష్ణు సోలంకికి లభించింది. ఇతర క్వార్టర్‌ఫైనల్ పోటీల్లో పంజాబ్ జట్టు 5వికెట్ల తేడాతో ఉత్తరప్రదేశ్‌పై, అస్సాం జట్టు 6వికెట్ల తేడాతో కేరళపై, ఢిల్లీ జట్టు 39పరుగుల తేడాతో విదర్భపై గెలిచాయి.

సెమీఫైనల్స్ (4న)..
పంజాబ్ × ఢిల్లీ, అస్సాం × బరోడా

HDB FINANCIAL SERVICES
హెచ్‌డిబి ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్.
రిజిష్టర్డు ఆఫీసు: రాధిక, 2వ అంతస్తు, లా గార్డెన్ రోడ్డు, నవరంగపురం, అహ్మదాబాద్-09.
బ్రాంచి ఆఫీసు: 76-8-10/1, ఫ్లాట్ నం.4, భవాని టవర్స్, స్వాతి థియేటర్ రోడ్డు, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రక్కన, భవానిపురం, విజయవాడ-520012.

ముందస్తు అమ్మకపు ప్రకటన

టు: 1. సనా ట్రేడర్స్, డోర్ నం.27-18-117/1, గ్రౌండ్ ఫ్లోర్, వెంకటేశ్వర టెంపుల్, కాంగ్రెస్ ఆఫీసు రోడ్డు, విజయవాడ-520002. **2) చెన్ను వెంకట కుమారి (చట్టబద్ధ వారసుల ద్వారా మరణించిన), (ఎ) సిహెచ్‌ఎస్ కిరణ్ కుమార్ (చట్టబద్ధ వారసులు),** డోర్ నం.4-134/3, నేతాజి నగర్, గొల్లపూడి, విజయవాడ-521225. **3) సిహెచ్‌ఎస్ కిరణ్ కుమార్,** డోర్ నం.4-134/3, నేతాజి నగర్, గొల్లపూడి, విజయవాడ-521225.

డియర్ సర్/మ్యాడం,
విషయం: ముందస్తు అమ్మకపు ప్రకటన
రెఫరెన్స్: సనా ట్రేడర్స్ పేరున ఖాతా నం.లు 8507105

1. మీరు హామీచూపిన పై చెప్పిన సదుపాయం పొంది, **లోన్ ఖాతా నం.లు 8507105** పరిధిలో మీరు ఒక రుణ సదుపాయం పొందియున్నారు. మీరు ఆస్తికి సంబంధించిన టైటిల్ డీడ్స్ తాకట్టుపెట్టినవి ఇందు దిగువ ప్రత్యేకంగా వివరించబడినవి.
2. రికార్డుల ప్రకారం, రుణానికి సంబంధించిన వడ్డీ వాయిదాలు & అసలు ను చెల్లించుటలో మీరు డిఫాల్టిచెందారు మరియు మీ రుణ ఖాతా అనునది నాన్-పెర్ఫామింగ్ అసెట్‌గా వర్గీకరించబడినది. మీరు తదుపరి జాగ్రత్త వహించవలసింది ఏమనగా, దానినను సరించి చెల్లించు తేదీ వరకు తదుపరి వడ్డీ మరియు దానిపై ఇతర వ్యయాలుతో **19.04.2022** నాటికి **రూ.1,00,63,254/- పై.లు (రూపాయలు ఒక కోటి అరవై మూడు వేల రెండు వందల యాభై నాలుగు పైసలు మాత్రమే)**ల కొరకు చెల్లించవలసిందిగా కోరుతూ సెక్షన్ 13(2) క్రింద మిమ్ములను మేము డిమాండ్ చేశాము. అయితే, పై సదరు నోటీసుకు మీరు స్పందించలేదు మరియు అందుకుగాను అవసరమైన పంచనామా& పరిశోధించి డ్రాయింగ్ ద్వారా **స్వాధీనతా ప్రకటన తేది 24.08.2022** ఆధారంగా పై సదరు ఆస్తిని లాంఛనప్రాయంగా స్వాధీనంచేసుకున్నాము మరియు **ఆస్తిని 18.10.2023న ఆస్తిని భౌతిక స్వాధీనంచేసుకున్నాము.**
3. సెక్యూరిటీ ఇంటెరెస్ట్ (ఎన్ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 8 సబ్-రూల్ (5)(6)తో చదువబడే సదరు చట్టం యొక్క సెక్షన్ 13(4) క్రింద పేరు పేర్కొన్న ఆస్తిని స్వాధీనంచేసుకున్నామని మీరు తదుపరి జాగ్రత వహించండి, పేరు చూపిన ఆస్తిని ప్రజల నుండి టెండర్లు ఆహ్వానించుట ద్వారా లేదా బహిరంగ వేలం నిర్వహించుట ద్వారా లేదా ప్రైవేట్ ట్రీటి ద్వారా అమ్మకానికి ముందుకుసాగుతాము: మీ రుణ ఖాతా పై మీ మిగతా పూర్తి బకాయి **27.10.2023** నాటికి **రూ.1,28,16,796/-**గా దయచేసి గమనించండి మరియు ఈ నోటీసు తేదీ నుండి 30 రోజుల్లోగా వాటిని చెల్లించవలసిందిగా మిమ్ములను కోరబడుచున్నది, విఫలం చెందిన పేరుగల ఏదైతే స్థిరాస్తిని **బహిరంగ వేలం** ద్వారా విక్రయించబడుతుంది.
4. షార్ఫసీ యాక్ట్ యొక్క సెక్షన్ 13(8) తో చదువబడే ది సెక్యూరిటీ ఇంటెరెస్ట్ (ఎన్ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 8(5)&(6) క్రింద దీనిని దయచేసి నోటీసుగా భావించగలరు, ఏదైతే అన్ని ఖర్చులు, చార్జీలు మరియు వ్యయాలతో మీ రుణ ఖాతా పై మిగతా మొత్తాలను రికవరీ చేయుల కొరకు తాకట్టుపెట్టిన ఆస్తిని అమ్మకానికి పెట్టబడుతుంది, ఏదైతే దయచేసి గమనించగలరు.

సెక్యూరిటీస్-1 యొక్క షెడ్యూలు

కృష్ణా జిల్లా, ఇబ్రహీంపట్నం సబ్-రిజిస్ట్రీ, విజయవాడ రూరల్ మండలం, గొల్లపూడి గ్రామం యొక్క ఆర్ఎస్ నం.559/1 ప్లాట్ నం.39 లో గల డోర్ నం.3-115 దగ్గర ఆధానంగా నిర్మించిన జి+3 ఆర్‌సిసి బిల్డింగ్ లో 200చ.గ.లు లేదా 167.226చ.మీ.ల విస్తీర్ణపు సైటు. **సరిహద్దులు: ఉత్తరం:** ప్లాట్ నం.40 అ.లు 54.00, **దక్షిణం:** ప్లాట్ నం.38 అ.లు 53.0, **తూర్పు:** ప్లాట్ నం.22 అ.లు 34.0, **పడమర:** 40.0అ.ల వెడల్పు రోడ్డు, 34.0అ.లు.

తేది: 27.10.2023 — సం/- అధీకృత అధికారి,
ప్రదేశం: విజయవాడ — హెచ్‌డిబి ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్

IDBI BANK — **ఐడిబిఐ బ్యాంక్ లిమిటెడ్**
CIN: L65190MH2004GOI148838
రీజినల్ ఆఫీసు, # 9-14-15, ఫైడా ఛాంబర్స్, 1వ అంతస్తు, వి.ఐ.పి.రోడ్, సిరిపురం, విశాఖపట్నం, పిన్ : 530003, ఆంధ్రప్రదేశ్.

ముందస్తు అమ్మకం - ప్రకటన

ఋణగ్రహీత : 1) మెస్సర్స్ ఇందు ఇండస్ట్రీ ("ది ఫరమ్") ప్లాటు నెం.56, 1వ అంతస్తు, ALEAP ఇండస్ట్రియల్ ఎస్టేట్, సూరంపల్లి, కృష్ణా జిల్లా, ఆంధ్ర ప్రదేశ్-521212.
2) ప్రొప్రైటర్ మరియు తనఖాదారు : శ్రీ ఉదమాల రంగనాథ రాఘవేంద్ర, ఇంటి నెం.డి-40 ఎస్‌విఎన్ కాలనీ, 7వ లేన్, పార్క్ ఎదురుగా, గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్-522006.
3) హామీదారు : శ్రీమతి మజుందారు ఇందిర, ఇంటి నెం.డి-40 ఎస్‌విఎన్ కాలనీ, 7వ లేన్, పార్క్ ఎదురుగా, గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్-522006.

1) పైన తెలిపిన రుణగ్రహీత మరియు తనఖాదారులు మరియు/లేదా హామీదారులు ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా **ఐడిబిఐ బ్యాంకు**కు తనఖా పెట్టబడిన దిగువ వివరించిన స్థిరాస్తికి సంబంధించి సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 ("రూల్స్")తో చదవబడు విధంగా సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 ("చట్టము") సంక్రమించిన అధికారములను వినియోగించుకొనుచూ **ఐడిబిఐ బ్యాంక్ లిమిటెడ్ ("ఐడిబిఐ బ్యాంక్")** యొక్క అధీకృత అధికారి (ఎఓ) చర్యలు తీసుకున్నారు.
ఆస్తి యజమాని మరియు తనఖాదారు : శ్రీ ఉదమాల రంగనాథ రాఘవేంద్ర.
ఆంధ్రప్రదేశ్-521180, కృష్ణా జిల్లా, కంచికచెర్ల ఎస్ఆర్ఓ, కంచికచెర్ల మండలం, బాతినపాడు గ్రామం, బాతినపాడు గ్రామ పంచాయితీ, ఆర్ఎస్ నెం.134/3లో, మొత్తం ఎ.0.62 సెంట్లు నందు రెసిడెన్సియల్ ప్లాట్లు 30 మరియు 31 గా మార్చబడిన ఖాళీ స్థలం నందు 336.70 చ॥గ॥లు అన్ని సౌకర్యాలు మరియు ఈజుమెంటరీ హక్కులతో సహా యావత్తు ఆస్తి.
1. ప్లాటు నెం.30 : ఆంధ్రప్రదేశ్-521180, కృష్ణా జిల్లా, కంచికచెర్ల ఎస్ఆర్ఓ, కంచికచెర్ల మండలం, బాతినపాడు గ్రామం, బాతినపాడు గ్రామ పంచాయితీ, ఆర్ఎస్ నెం.134/3లో ఎ.0.62 సెంట్లులోని ఖాళీ స్థలం ప్లాటు నెం.30 నందు గల విస్తీర్ణం 180.70 చ॥గ॥లు లేదా 151 చ॥మీ॥లు అందుగల అన్ని సౌకర్యాలు మరియు ఈజుమెంటరీ హక్కులతో సహా యావత్తు ఆస్తి. **హద్దులు : తూర్పు :** నున్నం శ్రీను గారి ఆస్తి, **దక్షిణం:** ప్లాటు నెం.31, **పడమర :** 40 అడుగుల వెడల్పు గల రోడ్, **ఉత్తరం :** నెమలిపురి భద్రయ్య గారి ఆస్తి.
2. ప్లాటు నెం.31 : ఆంధ్రప్రదేశ్-521180, కృష్ణా జిల్లా, కంచికచెర్ల ఎస్ఆర్ఓ, కంచికచెర్ల మండలం, బాతినపాడు గ్రామం, బాతినపాడు గ్రామ పంచాయితీ, ఆర్ఎస్ నెం.134/3లో ఎ.0.62 సెంట్లులోని ఖాళీ స్థలం ప్లాటు నెం.31 నందు గల విస్తీర్ణం 156 చ॥గ॥లు లేదా 130.43 చ॥మీ॥లు అందుగల అన్ని సౌకర్యాలు మరియు ఈజుమెంటరీ హక్కులతో సహా యావత్తు ఆస్తి. **హద్దులు : తూర్పు :** నున్నం శ్రీను గారి ఆస్తి, **దక్షిణం:** ప్లాటు నెం.31, **పడమర :** 40 అడుగుల వెడల్పు గల రోడ్, **ఉత్తరం :** నెమలిపురి భద్రయ్య గారి ఆస్తి.. **హద్దులు : తూర్పు :** నున్నం శ్రీను గారి ఆస్తి, **దక్షిణం :** ప్లాటు నెం.32, **పడమర :** 40 అడుగుల వెడల్పు గల రోడ్, **ఉత్తరం :** ప్లాటు నెం.30.
దానిపై ఉన్న అన్ని నిర్మాణాలు మరియు భూమికి అనుసంధానించబడిన అన్ని వస్తువులు లేదా భూమికి అనుసంధానించబడిన దేనివైనా శాశ్వతంగా కట్టుబడి ఉంటాయి.
2) దిగువ సంతకముదారు పైన తెలిపిన స్థిరాస్తిని విక్రయించాలని ప్రతిపాదించినారు మరియు ఆ ప్రకారం రూల్స్ లోని రూల్స్ 8(6) మరియు 9(1) నిబంధన ప్రకారం **తేది: 12.10.2023** గల అమ్మకము ప్రకటన రిజిస్టర్ పోస్టు ద్వారా రుణగ్రహీత, హామీదారు మరియు తనఖాదారులకు పంపబడింది. అయితే సదరు నోటీసు గ్రహీతలందరికి అందజేయబడలేదు. అందువలన రూల్స్ లోని 8(5)ని అనుసరిస్తూ ఈ బహిరంగ ప్రకటన జారీ చేయడమైనది.
3) రూల్స్ లోని రూల్ 8(5)లో పేర్కొన్న ఏవేని విధానాలను అనుసరించడం ద్వారా ఈ నోటీసు తేది నుండి 30 రోజుల తరువాత పైన తెలిపిన స్థిరాస్తి అమ్మబడుతుందని గమనించగలరు.
మీరు, కింద పేర్కొన్న రుణగ్రహీత/ తనఖాదారుకి, కంపెనీ మీకు వ్యతిరేకంగా సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రెస్ట్ యాక్ట్, 2002 క్రింద మరియు రిజిస్టర్డ్ పోస్ట్ యాక్ ద్వారా మీకు చట్టంలోని 13(2) కింద నోటీసు పంపబడిందని మీకు తెలియజేస్తున్నాము. రుణగ్రహీతల బకాయిలు అందచేయబడలేదు. అందువవల్ల మీరు నోటీసు తీసుకుని, ఈ పబ్లికేషన్ తేదీ నుండి 60 రోజులలోపు వడ్డీతోపాటు పేర్కొన్న ఖాతాకు వ్యతిరేకంగా పేర్కొన్న బకాయి రుణ మొత్తాన్ని చెల్లించవలసిందిగా కోరుతున్నారు. లేని పక్షంలో చట్టంలోని సెక్షన్ 13లోని సబ్ సెక్షన్ (4) కింద కంపెనీ మీ పై చర్య తీసుకుంటుంది. పేర్కొన్న సెక్యూరిటీని వడ్డీలు మరియు ఖర్చులతో దాని బకాయిలను గ్రహించడం ద్వారా కంపెనీకి అందుబాటులో ఉన్న మరే ఇతర నివారణకు పక్షపాతం లేకుండా ఈ నోటీసు మీకు అందించబడిందని ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు.

క్ర.సం	రుణగ్రహీతలు/సహ-రుణగ్రహీతలు/హామీదారలు/తనఖాదారుల పేర్లు	లోన్ ఎకౌంట్ నెం	ఎన్‌పిఎ తేది మరియు డిమాండ్ నోటీసు తేదీ	బాకాయి మొత్తం రూ॥ ప్రకారం
1	1. అల్లాబక్షు జువెలరీ వర్క్స్, డో.నం.16-26-32, మాజేటి నాగేశ్వరరావు వీధి, షరోఫ్ బజార్, తెనాలి-522201, ఆంధ్రప్రదేశ్. ఇక్కడ కూడా : డబ్ల్యూ.నం.10, బి.నం.6, టి.ఎస్.నం.495/18, 101.5 చ.గ.లు., డో.నం.2-8-28, ఆర్‌సిసి దాబా ఇ-డి రత్తయ్య ఆస్తి, డబ్ల్యూ-ఎమ్ గల్లి బజార్, తెనాలి-522201. ఇక్కడ కూడా : డబ్ల్యూ.నం.5, బి.నం.1, టి.ఎస్.నం.63, డో.నం.16-26-32, తెనాలి టౌన్, షరీఫ్ బజార్, ఎమ్ఎన్ఆర్ వీధి, 9 చ.గ.లు. ఇ-జె గల్లీ, డబ్ల్యూ-సిహెచ్ శ్రీనివాసరావు, టి.ఎమ్.కృష్ణ, తెనాలి-522201. 2. షేక్ షంషున్నిసా, డో.నం.19-1-47, కొత్త డో.నం.19-1-40/2, ఆంధ్ర రత్న రోడ్డు, ఎమ్.ఎస్.పాలెం, తెనాలి-522201, ఆంధ్రప్రదేశ్. 3. షేక్ అల్లాబక్షు, డో.నం.19-1-47, కొత్త డో.నం.19-1-40/2, ఆంధ్ర రత్న రోడ్డు, ఎమ్.ఎస్.పాలెం, తెనాలి-522201, ఆంధ్రప్రదేశ్. 4. షేక్ కాలేషావలి, డో.నం.19-1-47, కొత్త డో.నం.19-1-40/2, ఆంధ్ర రత్న రోడ్డు, ఎమ్ఎస్ పాలెం, తెనాలి-522201, ఆంధ్రప్రదేశ్.	13303056	ఎన్‌పిఎ తేది : 02.10.2023 డిమాండ్ నోటీసు తేది : 14.10.2023	రూ॥32,56,147/- 12.10.2023 నాటికి భవిష్యత్ మరియు ఒప్పంద వడ్డీ వాస్తవికత వరకు కలిసి యాదృచ్ఛిక ఖర్చులు, ఖర్చు మరియు ఛార్జీలు మొదలైనవి.

సెక్యూర్డ్ అసెట్ వివరణ: సెక్యూరిటీస్-1 షెడ్యూల్ : గుంటూరు జిల్లా, తెనాలి సబ్ రిజిస్ట్రీ, తెనాలి మున్సిపల్ లో ఉన్న సైట్ విస్తీర్ణం 101.5 చ.గ.లు. లేదా 84.86 చ.మీ.లు. సైట్ మరియు ఆర్‌సిసి దాబా ఇంటి బేరింగ్ డో.నం.2-8-28, టౌన్ సర్వే, వార్డు నం.10, బ్లాక్ నం.6, టి.ఎస్.నం.495/18, ఎసి. 0.10 సెంట్లు. ఆ ఆస్తి దక్షిణం వైపు 204 చ.గ.లు. ఉన్న హద్దులు : ఉత్తరం: బొల్ల శ్రీలత ఆస్తి-46'.6", దక్షిణం: ఈ దాబా ఇంటి గోడ సైట్ ద్వారా అల్లిమున్నిసా బీబీ ఆస్తి-49 అ.లు., తూర్పు: దేవభక్తుని రతలయ్య ఆస్తి-19.1, పడమర: మున్సిపల్ గల్లీ బజార్-19'.2" శాతం.
సెక్యూరిటీస్-2 షెడ్యూల్ : గుంటూరు జిల్లా, తెనాలి సబ్ రిజిస్ట్రీ, తెనాలి మున్సిపల్, మాజేటి నాగేశ్వరరావు వీధి, షరీఫ్ బజార్‌లో ఉన్న సైట్ విస్తీర్ణం 9 చ.గ.లు. లేదా 7.52 చ.మీ.లు. సైట్ మరియు ఆ ఆర్‌సిసి దాబా షాప్ 81 చ.అ.లు. తో అన్నీ ఇతర ఉపకరణాలు. పడమర వైపు బేరింగ్ డో.నం.16-26-32, వార్డు నం.5, బ్లాక్ నం.1, టి.ఎస్.నం.63, ఉన్న హద్దులు : ఉత్తరం: ఏమినేని సాంబల ఆస్తి మరియు ఈ ఆస్తి మధ్య ఉమ్మడి గోడ-12.06", దక్షిణం: 6 అ.లు. వెడల్పు ఉమ్మడి గల్లీ-12.05, తూర్పు: ఉమ్మడి గల్లీ-6.06, పడమర: చందు శ్రీనివాసరావు, తునుగుంటియ మురళీకృష్ణ ఆస్తి-6.06".
సెక్యూరిటీస్ 3 షెడ్యూల్ : గుంటూరు జిల్లా, తెనాలి సబ్ రిజిస్ట్రీ, తెనాలి మున్సిపల్, మాజేటి నాగేశ్వరరావు వీధి, షరీఫ్ బజార్ లో ఉన్న సైట్ విస్తీర్ణం 2.4.9 చ.గ.లు., లేదా 2.09 చ.మీ.లు. సైట్ ఖాళీ మెట్ల సైట్ మరియు ఆ ఉమ్మడి సగం సైట్ ఎల్.ఇ. 1.2.4 శాతం చ.గ.లు. లేదా 1.045 చ.గ.లు. సైట్ మాత్రమే. పడమర వైపు బేరింగ్ డో.నం.16-26-32, వార్డు నం.5, బ్లాక్ నం.1, టి.ఎస్.నం.63. ఉన్న హద్దులు : ఉత్తరం: ఈ ఆస్తి మరియు ఏమినేని సాంబయ్య ఆస్తి మధ్య ఉమ్మడి గోడ-3.06", దక్షిణం: 6 అ.లు. వెడల్పు ఉమ్మడి గల్లీ-3.06", తూర్పు: చందు శ్రీనివాసరావు, తునుగుంట్ల మురళీకృష్ణ ఆస్తి-6.06", పడమర: ఆర్.శ్రీనివాస్ నాయక్ కి అనుకూలంగా తరణి సత్యనారాయణ ద్వారా విక్రయించబడిన ఆస్తి-6.06".
సెక్యూరిటీస్ 4 షెడ్యూల్ : గుంటూరు జిల్లా, తెనాలి సబ్ రిజిస్ట్రీ, తెనాలి మున్సిపల్, మాజేటి నాగేశ్వరరావు వీధి, షరీఫ్ బజార్ లో ఉన్న సైట్ విస్తీర్ణం 9 చ.గ.లు. లేదా 7.52 చ.మీ.లు. సైట్ మరియు ఆ ఆర్‌సిసి దాబా షాప్ పైన ఓపెన్ టెర్రస్ అన్నీ ఇతర ఉపకరణాలతో హక్కులు. బేరింగ్ డో.నం.16-26-32, వార్డు నం.5, బ్లాక్ నం.1, టి.ఎస్.నం.63. ఉన్న హద్దులు : పైన ఓపెన్ టెర్రస్ హక్కుతో అన్నీ ఇతర ఉపకరణాలు అందులో ఆర్‌సిసి దాబా షాప్ బేరింగ్ డో.నం.16-26-32 ఆర్‌సిసి దాబా షాప్ లో మరియు సైట్ విస్తీర్ణం 9 చ.గ.లు. లేదా 7.52 చ.మీ.లు. సైట్ క్రింది విధమైన సరిహద్దులు : ఉత్తరం : ఈ ఆస్తి మరియు ఏమినేని సాంబయ్య ఆస్తి మధ్య ఉమ్మడి గోడ 12'.06", దక్షిణం: 6 అ.లు. వెడల్పు ఉమ్మడి గల్లీ-12.04", తూర్పు: 1వ అంశం ఆస్తి-6'.06", పడమర: ఆర్.శ్రీనివాస నాయక్ మరియు పై 2వ అంశం సైట్‌కు ఉమ్మడి మెట్లు 6'.06".

తేది: 02.11.2023 ప్రదేశం: గుంటూరు సం/-అధీకృత అధికారి హెచ్‌డిబి ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్

అధికార పార్టీకే అధిక విరాళాలు ఎందుకు వెళ్తున్నాయి?

- అన్ని పార్టీలకూ సమానంగా పంచొచ్చుకదా!
- ఎలక్టోరల్ బాండ్లతో లంచాలను చట్టబద్ధం చేశామా?
- సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి డివై చంద్రచూడ్
- పార్టీలు పొందిన విరాళాల వివరాలు రెండు వారాల్లో ఇవ్వాలని ఇసికి ఆదేశం
- ఎలక్టోరల్ బాండ్లపై తీర్పు రిజర్వు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

రాజకీయ పార్టీలకు నిధులు సమకూర్చేందుకు తీసుకొచ్చిన ఎన్నికల బాండ్ల చెల్లుబాటుపై దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టులో వాదనలు ముగిశాయి. మూడు రోజులపాటు సుదీర్ఘంగా విచారణ జరిపిన సుప్రీం రాజ్యాంగ ధర్మాసనం తీర్పును రిజర్వు చేసింది. కేంద్రప్రభుత్వం 2018 జనవరి 2న అమల్లోకి తెచ్చిన ఎలక్టోరల్ బాండ్ల పథకాన్ని సవాల్ చేస్తూ సిపిఎం, ఎడిఆర్, కాంగ్రెస్ నాయకులు జయా ఠాకూర్, మరో పిటిషనర్ దాఖలు చేసిన పిటిషన్లను సిజెఐ జస్టిస్ డివై చంద్రచూడ్ నేతృత్వంలో జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ బిఆర్ గవాయ్, జస్టిస్ జెబి పార్దీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాతో కూడిన రాజ్యాంగ ధర్మాసనం విచారణ జరిపింది. 2024 సార్వత్రిక ఎన్నికల కోసం ఎన్నికల బాండ్లను ప్రారంభించడానికి ముందే సమగ్ర విచారణ జరపాలని అక్టోబరు 10న న్యాయవాది ప్రశాంత్ భూషణ్ చేసిన విజ్ఞప్తిని సుప్రీంకోర్టు పరిగణనలోకి తీసుకుని, అక్టోబరు 31 నుంచి విచారణ జరిపింది. ఎన్నికల బాండ్ల పథకం పారదర్శకత కొరవడడంతోపాటు ప్రజాస్వామ్యాన్ని విధ్వంసం చేస్తోందని పిటిషనర్ల తరపున సీనియర్ న్యాయవాదులు ప్రశాంత్ భూషణ్, కపిల్ సిబల్ వాదించారు. అధికార, ప్రతిపక్ష పార్టీలకు సమాన అవకాశాలు కల్పించకపోగా అవినీతిని ప్రోత్సహిస్తోందని తెలిపారు. ఎన్నికల బాండ్ల ద్వారా ఇప్పటి వరకూ సమకూరిన నిధుల్లో అత్యధిక భాగం కేంద్రంలో, రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న పార్టీలకే వెళ్లాయని ఎడిఆర్ తరపు న్యాయవాది ప్రశాంత్ భూషణ్ గణాంకాలతో సహా వివరించారు. ఒక్క సిపిఎం మాత్రమే ఎలక్టోరల్ బాండ్లను వ్యతిరేకిస్తూ కోర్టును ఆశ్రయించిందన్నారు.

లక్ష్య సాధనలో సమస్యలు : ధర్మాసనం

ఎన్నికల బాండ్ల పథకం లక్ష్య సాధనలో కొన్ని సమస్యలున్నాయని సర్వోన్నత న్యాయస్థానం అభిప్రాయపడింది. ఈ పథకం గోప్యత, విశ్వసనీయత కొందరికే పరిమితమవుతోందని పేర్కొంది. ఎస్‌బిఐ వద్ద ఉన్న వివరాలను దర్యాప్తు సంస్థల ద్వారా ఏ రాజకీయ పార్టీకి, ఎవరు ఎంత విరాళం ఇచ్చారన్నది అధికారంలో ఉన్న వారు తెలుసుకోగలరని, అదే ప్రతిపక్షంలో ఉన్న వారికి అటువంటి అవకాశం లేదని రాజ్యాంగ ధర్మాసనం అభిప్రాయపడింది. అన్ని రాజకీయ పార్టీలకు సమాన అవకాశాలు కల్పించలేనప్పుడు పథకం నిష్పాక్షికత, పారదర్శకత ప్రశ్నార్థకమవుతుందని పేర్కొంది.

ఈ పథకం ద్వారా లంచాలను చట్టబద్ధం చేశామా?

ఎలక్టోరల్ బాండ్ల ద్వారా నిధులు సమీకరించే పథకం ద్వారా లంచాలను చట్టబద్ధం చేశామా? అని సిజెఐ జస్టిస్ డివై చంద్రచూడ్ ప్రశ్నించారు. 'అధికార పార్టీకే అధిక విరాళాలు ఎందుకు వెళ్తున్నాయి. దీనికి కారణమేమిటి? ఎన్నికల బాండ్ల ద్వారా సమకూరిన మొత్తం నిధులను ఎన్నికల సంఘం వద్ద ఉంచి, దాని ద్వారా అన్ని పార్టీలకూ సమానంగా పంపిణీ చేయొచ్చు కదా' అని ఆయన సూచించారు. దీనికి తుషార్ మెహతా బదులిస్తూ.... 'అప్పుడు అసలు విరాళాలే రావు' అని అభిప్రాయపడ్డారు.

పార్టీలు పొందిన విరాళాల వివరాలు రెండు వారాల్లో ఇవ్వండి

రాజకీయ పార్టీలు ఎలక్టోరల్ బాండ్ల ద్వారా సెప్టెంబర్ 30 వరకూ పొందిన విరాళాల వివరాలను రెండు వారాల్లోగా తమకు అందించాలని ఎన్నికల సంఘాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది. 2019 ఏప్రిల్ 12 నాడు సుప్రీంకోర్టు జారీ చేసిన మధ్యంతర ఆదేశాలను ప్రస్తావిస్తూ, నాటి ఉత్తర్వులు ప్రకటించిన తేదీకే పరిమితం కాదని పేర్కొంది. ఈ విషయంలో ఎన్నికల సంఘానికి ఏదైనా సందేహాలుంటే సర్వోన్నత న్యాయస్థానం నుంచి స్పష్టత తీసుకోవాలని నొక్కి చెప్పింది. అనంతరం తీర్పును రిజర్వు చేసింది. అంతకుముందు కేంద్ర ప్రభుత్వం తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కేంద్రం తరపున తన వాదనలు కొనసాగిస్తూ.. 'నిర్ణయం మరీ ఏకపక్షమైంది కానంత వరకూ ప్రయోగాలు చేసే హక్కు చట్టసభలకు ఉంది. ఎలక్టోరల్ బాండ్ల పథకాన్ని ప్రవేశపెట్టిన తరువాత ఏమైందన్నది ప్రశ్న. ఆ ధోరణులను ధర్మాసనం ముందు ఉంచాం' అని అన్నారు. ఈ సందర్భంగా న్యాయవాది కనూ అగర్వాల్ కల్పించుకుని గతంలో రూ.20 వేల కంటే తక్కువ మొత్తం నిధులు చెల్లించే వారి వివరాలు నమోదు చేయాల్సిన అవసరం ఉండేది కాదని, పార్టీలు అధికశాతం విరాళాలు ఈ మొత్తం కంటే తక్కువ ఉండేలా జాగ్రత్త పడ్డాయని, పథకాన్ని దుర్వినియోగం చేశాయని ఆరోపించారు. సొలిసిటర్ జనరల్ దీనికి సమాధానమిస్తూ.. ప్రస్తుతం కొంచెం అనుమానాస్పదమైన రూ.20 వేల కంటే తక్కువ మొత్తమున్న విరాళాలు తగ్గాయని, ఎలక్టోరల్ బాండ్లు పెరిగాయని తెలిపారు.

జస్టిస్ ఖన్నా కలుగజేసుకుని రూ.20 వేల కంటే తక్కువ మొత్తమున్న ఎలక్టోరల్ బాండ్లు ఎంత మేరకు వచ్చాయో చూపాలని కోరారు. ఎలక్టోరల్ బాండ్ల ద్వారా నిధులు సేకరించేందుకు నిరాకరించిన పార్టీ ఇప్పటికీ అంతకంటే తక్కువ మొత్తమున్న స్వచ్ఛంద విరాళాలను స్వీకరిస్తోందని సొలిసిటర్ జనరల్ తెలిపారు. ఎలక్టోరల్ బాండ్లు పెరిగితే రూ.20 వేల కంటే తక్కువ విరాళాలు తగ్గుతాయని చెప్పారు. ఎలక్టోరల్ బాండ్ల ద్వారా నిధులు సేకరించబోమన్న పార్టీ విషయంలో మాత్రమే రూ.20 వేల కంటే తక్కువ విరాళాలు తగ్గడం లేదని తెలిపారు. అందుకే ఆ పార్టీ పాత పద్ధతి కోసం డిమాండ్ చేస్తోందని ఆరోపించారు.

అంతకుముందు ఈ పిటిషన్లపై కేంద్ర ప్రభుత్వం తరపున అటార్నీ జనరల్ ఆర్ వెంకటరమణి సుప్రీంకోర్టుకు అఫిడవిట్ సమర్పించారు. ఎన్నికల బాండ్ల నిధుల మూలాలకు సంబంధించిన సమాచారాన్ని తెలుసుకునే హక్కు దేశ పౌరులకు లేదని అందులో పేర్కొన్నారు. ఎలక్షన్ ఫండింగ్, పార్టీ ఫండింగ్, క్యాంపెయిన్ ఫండింగ్ ఇవన్నీ కాలిడోస్కోప్ (రంగురంగుల చిత్రాలను ప్రదర్శించే గాజుగొట్టం) లాంటిదని, ఇదంతా ఆసక్తికరమైన ప్రయోగాంశమేనని అన్నారు.

ఎసిబికి చిక్కిన ఇద్దరు ఇడి అధికారులు

జైపూర్ : లంచం తీసుకుంటూ ఇద్దరు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) అధికారులు పట్టుబడ్డారు. ఇద్దరు ఇడి అధికారులు లంచం సొమ్ము తీసుకుంటూ గురువారం పట్టుబడినట్లు రాజస్తాన్ అవినీతి నిరోధక విభాగం (ఎసిబి) ఓ ప్రకటనలో తెలిపింది. చిట్ ఫండ్ వ్యవహారంలో కేసు నమోదు చేయకుండా ఉండేందుకు వారు రూ.15 లక్షలు అడిగినట్లు అధికారులు తెలిపారు. వారి కార్యాలయాల్లోనూ సోదాలు చేపడుతున్నట్లు వెల్లడించింది.

హ్యాక్ గుట్టు విప్పాల్సిందే..?

- ప్రతిపక్ష నేతలు, జర్నలిస్టులకు యాపిల్ అలర్ట్‌పై 'అత్యవసర సమావేశం' ఏర్పాటు చేయాలి
- ఐటి స్టాండింగ్ కమిటీ ఛైర్‌పర్సన్‌కు సిపిఐ(ఎం) ఎంపి జాన్ బ్రిట్టాస్ లేఖ

ప్రజాశక్తి - న్యూఢిల్లీ బ్యూరో

ప్రతిపక్ష నేతలు, జర్నలిస్టులకు యాపిల్ అలర్ట్ మేసేజ్‌ల వెనుక ఎవరున్నారో తేల్చడానికి సత్వరమే 'అత్యవసర సమావేశం' ఏర్పాటు చేయాలని సిపిఐ(ఎం) ఎంపీ జాన్ బ్రిట్టాస్ డిమాండ్ చేశారు. ఈ మేరకు కమ్యూనికేషన్స్, ఐటి పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ ఛైర్‌పర్సన్‌కు ఆయన లేఖ రాశారు. పలువురు ప్రతిపక్ష నేతలకు యాపిల్ నుంచి హెచ్చరికలు అందుతున్న నేపథ్యంలో అత్యవసరంగా ప్యానెల్ సమావేశాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. "ఈ పరిస్థితిని తక్కువగా అంచనా వేయలేం. ఎందుకంటే ఇది వ్యక్తిగత డేటా భద్రత గురించి మాత్రమే కాకుండా జాతీయ భద్రతకూ చిక్కులను తెచ్చిపెడుతుంది. ఈ నోటిఫికేషన్ పెగాసస్ స్పైవేర్ కుంభకోణాన్ని గుర్తుచేస్తున్నది. ఇది పాలక వ్యవస్థను విమర్శించే గొంతులను లక్ష్యంగా చేసుకుంది. ఇది మన ప్రజాస్వామ్యానికి తీవ్ర ఆందోళన కలిగించే విషయం" అని బ్రిట్టాస్ పేర్కొన్నారు. "పౌరుల ప్రాథమిక హక్కులు ప్రమాదంలో ఉన్నందున స్టాండింగ్ కమిటీ, ఈ సమస్యను సమగ్రంగా పరిశీలించడానికి తక్షణమే చర్య తీసుకోవాలి. దర్యాప్తు చేయడం కమిటీ పరిధిలో ఉందని నేను నమ్ముతున్నాను" అని లేఖలో పేర్కొన్నారు. యాపిల్ గుర్తించిన భద్రతా ముప్పు స్వభావం, విశ్వసనీయత, ప్రభుత్వం మద్దతు ఉన్న హ్యాకర్ల ప్రమేయం, వారి ప్రేరణలు, సైబర్ భద్రతా చర్యల సమర్థతను కమిటీ పరిశీలించాలని జాన్ బ్రిట్టాస్ అన్నారు. దేశంలోని మొబైల్ ఫోన్ వినియోగదారుల గోప్యత, భద్రతను కాపాడాలని అన్నారు. "గోప్యతా హక్కు మానవ ఉనికికి పవిత్రమైనది. మానవ గౌరవం, స్వయం ప్రతిపత్తి విడదీయరానివి" అని ఆయన అన్నారు.

ఎథిక్స్ కమిటీ సమావేశంలో గందరగోళం

- ప్రతిపక్ష ఎంపీల వాకౌట్
- నీచమైన ప్రశ్నలంటూ మొయిత్రా ఆగ్రహం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

'క్యాష్ ఫర్ క్వైరీ' (ప్రశ్నకు డబ్బు) వ్యవహారంలో టిఎంసి ఎంపి మహువా మొయిత్రా గురువారం పార్లమెంటరీ ఎథిక్స్ కమిటీ ముందు హాజరయ్యారు. ఆమె వ్యక్తిగత అంశాలకు సంబంధించి ప్రశ్నలు అడగడంతో విచారణ జరుగుతుండగానే.. మహువా మొయిత్రాతోపాటు కమిటీలో ఉన్న ప్రతిపక్ష సభ్యులు వాకౌట్ చేశారు. కమిటీ ఛైర్మన్ వినోద్ కుమార్ సోంకార్ గౌరవం లేని, అనైతికమైన, గోప్యతకు సంబంధించిన ప్రశ్నలు అడిగారని వారు విమర్శించారు. లోక్‌సభలో టిఎంసి ఎంపి మొయిత్రా లంచం తీసుకుని అదానీ గ్రూప్‌పై ప్రశ్నించారని బిజెపి ఎంపి నిషికాంత్ దూబె ఫిర్యాదును పరిశీలించేందుకు పార్లమెంట్ అనెక్స్ భవనంలో నాలుగు గంటలపాటు జరిగిన సమావేశంలో అసాధారణ పరిణామాలు చోటు చేసుకున్నాయి.

15 మంది సభ్యుల కమిటీలో గురువారం సమావేశానికి 11 మంది హాజరయ్యారు. బిఎస్‌పి ఎంపి డానిష్ అలీ, సిపిఎం ఎంపి పిఆర్ నటరాజన్ సహా ఐదుగురు ప్రతిపక్ష సభ్యులు వాకౌట్ చేశారు. ఆ తరువాత కూడా సమావేశం కొనసాగింది. దర్శన్‌తో ఉన్న సంబంధాలపై కమిటీ మహువాను ప్రధానంగా అడిగినట్లు సమాచారం. దర్శన్, ఆయన మాజీ స్నేహితుడు న్యాయవాది దేహద్రాయ్‌తో తనకున్న సంబంధాన్ని మహువా వివరించారు. అఫిడవిట్‌లోని కొన్ని విషయాలను ఛైర్మన్ అడగడంతో వాగ్వాదం చోటుచేసుకుంది. ప్రతిపక్ష సభ్యులు మహువాకు మద్దతు పలికారు.

మొయిత్రా వ్యక్తిగత అంశాలకు సంబంధించి అనైతిక ప్రశ్నలను కమిటీ వేసిందని, దాంతో పెద్ద దుమారం చెలరేగిందని బిఎస్‌పి ఎంపి డానిష్ అలీ పేర్కొన్నారు. 'ఛైర్మన్ అడిగిన ప్రశ్నలు అమర్యాదగా ఉన్నాయి. కమిటీ వ్యవహరించిన తీరు సిగ్గుచేటు. ఎవరు ఎవరితో మాట్లాడతారు? ఏం మాట్లాడతారు? మీరు రాత్రి ఎవరితో మాట్లాడతారు? మీరు ఎలా మాట్లాడతారు? వంటి అనైతిక ప్రశ్నలను ఒక మహిళను అడిగారని, ఇలాంటి ప్రశ్నలు ఎవరైనా అడుగుతారా?' అని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. విచారణ జరుగుతుండగానే ఆ వివరాలన్నీ బయటకు ఎలా వచ్చాయని ప్రశ్నించారు. ఛైర్మన్ ఎవరికోసమో వ్యవహరిస్తున్నట్లు కనిపిస్తోందని కాంగ్రెస్ ఎంపి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. మహిళను వ్యక్తిగత విషయాలపై అడిగే హక్కు కమిటీకి లేదని జెడియు ఎంపి గిరిధారి యాదవ్ వ్యాఖ్యానించారు. బిజెపి ముందే తయారు చేసుకున్న స్క్రిప్ట్‌ను బట్టి ఛైర్మన్ ప్రశ్నలు అడిగారని విమర్శించారు.

ఇదేం మీటింగ్ : మొయిత్రా

"అసలు ఇదేం మీటింగ్? కమిటీ సభ్యులు నీచమైన ప్రశ్నలు అడుగుతున్నారు. వ్యక్తిగత విషయాలపై ప్రశ్నలు వేస్తున్నారు. విచారణ సమయంలో నా కళ్లల్లో నీళ్లు వచ్చాయని అన్నారు. నా కళ్లలో నీళ్లు మీకు కనిపిస్తున్నాయా" అంటూ మీడియాతో మాట్లాడుతూ మొయిత్రా అన్నారు. తన వ్యక్తిగత విషయాల్ని మీటింగ్‌లో చర్చించాల్సిన అవసరం లేదని ఆమె పదేపదే పునరుద్ఘాటించారని తెలిసింది. తన స్నేహితుడి వద్ద నుంచి బహుమతి లభిస్తే, ఈ విషయాన్ని ఎథిక్స్ కమిటీ ముందుకు ఎలా తీసుకొస్తారని మొయిత్రా ప్రశ్నించారు.

మొయిత్రా సహకరించలేదు : కమిటీ ఛైర్మన్ సోంకార్

క్రాస్ ఎగ్జామినేషన్ చేస్తున్న సమయంలో మహువా మొయిత్రా ఏమాత్రం సహకరించలేదని ఎథిక్స్ కమిటీ ఛైర్మన్, బిజెపి ఎంపి వినోద్ కుమార్ సోంకార్ తెలిపారు. తమ ప్రశ్నలకు సమాధానం ఇవ్వకుండా ఆమె తమ మీద కోపం ప్రదర్శించారని, అన్‌పార్లమెంటరీ భాషను ఉపయోగించారని ఆరోపించారు. మొయిత్రాతోపాటు ప్రతిపక్ష ఎంపీలు తమపై నిందలు మోపుతూ సమావేశం నుంచి వాకౌట్ చేశారని చెప్పుకొచ్చారు. అన్ని ఆధారాలు కమిటీ ముందు ఉన్నాయని, మహువాను ఏ శక్తీ కాపాడలేదని బిజెపి ఎంపి నిషికాంత్ దూబె అన్నారు.

కేంద్ర మంత్రి రాజీవ్ చంద్రశేఖర్‌పై కేరళ పోలీసుల మరో కేసు

కొచ్చి : కలమసేరి పేలుళ్లకు సంబంధించి కేంద్ర మంత్రి రాజీవ్ చంద్రశేఖర్‌పై కేరళ పోలీసులు రెండో కేసు నమోదు చేశారు. సోషల్ మీడియాలో మతపరమైన రెచ్చగొట్టే పోస్టులు చేశారనే అభియోగాలతో ఎర్నాకులం సెంట్రల్ పోలీసులు కేంద్ర మంత్రిపై గురువారం ఎఫ్‌ఐఆర్ నమోదు చేశారు. ఈ ఎఫ్‌ఐఆర్‌లో బిజెపి జాతీయ కార్యదర్శి అనిల్ కె ఆంటోని పేరును కూడా చేర్చారు. కేరళ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (కెపిసిసి) డిజిటల్ మీడియా సెల్ కన్వీనర్ సరిన్ పి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈ కేసు నమోదైంది. కేరళలో మత సామరస్యానికి విఘాతం కలిగించే విధంగా రాజీవ్ చంద్రశేఖర్ సోషల్ మీడియా పోస్టులు చేశారని సరిన్ పి ఫిర్యాదులో ఆరోపించారు. కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ సహాయ మంత్రి అయిన రాజీవ్ చంద్రశేఖర్‌పై మూడు రోజుల వ్యవధిలో ఇది రెండో కేసు. కలమసేరి పేలుళ్లపైనే అక్టోబర్ 31న మొదటి కేసును ఎర్నాకులం సెంట్రల్ పోలీసులు నమోదు చేసిన సంగతి తెలిసిందే.

వచ్చే వారం అమెరికా మంత్రుల రాక

- భారత విదేశాంగ, రక్షణ మంత్రులతో ముఖాముఖి చర్చలు

న్యూఢిల్లీ : అమెరికా విదేశాంగ, రక్షణ మంత్రులు ఆంటోనీ బ్లింకెన్, లాయిడ్ ఆస్టిన్ వచ్చే వారం భారత్ వస్తున్నారు. భారత విదేశాంగ మంత్రి జై శంకర్, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌లతో ముఖాముఖి సమావేశాలు జరిపేందుకు వీరు ఢిల్లీ రానున్నారని అమెరికా విదేశాంగ శాఖ తెలిపింది. ఇండో-పసిఫిక్ ప్రాంతంలో ద్వైపాక్షిక, అంతర్జాతీయ ఆందోళనలు, పరిణామాలను మంత్రుల బృందం చర్చిస్తుంది. బ్లింకెన్ నవంబరు 2 నుండి 10 వరకు టెల్ అవీవ్, అమ్మాన్, టోక్యో, సియోల్‌లో పర్యటిస్తున్నారు. అందులో భాగంగానే న్యూఢిల్లీలో పర్యటన వుంటుంది. 9, 10 తేదీల్లో పర్యటించే అవకాశం వుంది. క్వాడ్ సమావేశానికి భారత్ ఆతిధ్యం ఇవ్వడానికి కొన్ని మాసాలు ముందుగా ఈ సమావేశం జరుగుతోంది. జనవరి 26 భారత గణతంత్ర దినోత్సవాలకు ముఖ్య అతిథిగా జో బైడెన్ హాజరవుతారు. ఆ మరుసటి రోజు 27న క్వాడ్ సమావేశం జరిగే అవకాశం వుంది. భారత్, అమెరికా మధ్య వచ్చే వారం జరిగే సమావేశం ఈ తరహాలో జరగనున్న ఐదవ వార్షిక సమావేశం. ఇజ్రాయిల్ యుద్ధంపై ఈ సమావేశంలో చర్చ జరిగే అవకాశం వుంది. ఉక్రెయిన్, రష్యా యుద్ధం, ప్రపంచ బ్యాంక్, అంతర్జాతీయ ద్రవ్య నిధి వంటి ప్రపంచ ఆర్థిక సంస్థల్లో సంస్కరణలపై కూడా చర్చిస్తారని భావిస్తున్నారు. చైనా, మాల్దీవుల్లో ఇటీవలి పరిణామాలపై కూడా చర్చిస్తారని భావిస్తున్నారు.

మూడు వారాల్లో 10వేలకు పైగా మృతులు !

ఇజ్రాయిల్ దాడుల్లో ఆప్తులను కోల్పోయి రోదిస్తున్న కుటుంబసభ్యులు

జెరూసలెం, గాజా : ఇజ్రాయిల్ - హమాస్ మధ్య ఘర్షణల్లో ఇప్పటివరకు 10వేల మందికి పైగా మరణించారు. అమెరికా, ఇతర పశ్చిమ దేశాల దన్ను చూసుకుని నెతన్యాహు గాజాలో నరమేధానికి పాల్పడుతున్నాడు. అంతర్జాతీయ చట్టాలను, నియమ నిబంధనలను తుంగలో తొక్కి యథేచ్ఛగా దాడులు చేస్తున్నాడు. ఈ దాడుల్లో ఇంతవరకు 8,796 మంది పాలస్తీనీయులు మరణించారు. వీరిలో 3,648మంది చిన్నారులు, 2,290మంది మహిళలు వున్నారని పాలస్తీనా ఆరోగ్య మంత్రిత్వ శాఖ వర్గాలు తెలిపాయి. ఇజ్రాయిల్ వైపు మరణాలు 1400దాటాయని ఇజ్రాయిల్ విదేశాంగ మంత్రిత్వ శాఖ తెలిపింది.

ఇజ్రాయిల్, ఈజిప్ట్, హమాస్ మధ్య కుదిరిన ఒప్పందం మేరకు బుధవారం 320మంది విదేశీ పౌరులు రఫా క్రాసింగ్ ద్వారా ఈజిప్ట్‌లోకి ప్రవేశించారు. క్షతగాత్రులైన గాజా ప్రజలు కూడా డజన్ల సంఖ్యలో వెళ్లారు. ఉత్తర సినాయ్‌లోని ఆస్పత్రుల్లో గాయపడిన వారిని చేర్చి చికిత్స అందిస్తున్నామని, 117మంది విదేశీయులకు రఫా క్రాసింగ్ దగ్గర క్వారంటైన్ డాక్టర్లు వైద్య పరీక్షలు నిర్వహించారని ఈజిప్ట్ ఆరోగ్య మంత్రిత్వ శాఖ అధికారులు తెలిపారు. వీరిలోని 35మంది చిన్నారులకు అవసరమైన వ్యాక్సిన్లు కూడా వేశారు.

కేవలం మూడు వారాల వ్యవధిలోనే గాజాలో దాదాపు 3,200మంది చిన్నారులు మరణించడం పట్ల సేవ్ ది చిల్డ్రన్ సంస్థ తీవ్రంగా ఆందోళన వ్యక్తం చేసింది. 2019 నుంచి యుద్ధ ప్రాంతాల్లో ఏటా మరణిస్తున్నవారి సంఖ్యను ఇది అధిగమించిందని ఐక్యరాజ్య సమితి పాలస్తీనా శరణార్థుల సంస్థ కమిషనర్ జనరల్ ఫిలిప్ లాజారిని తెలిపారు.

కాల్పుల విరమణ జరగాలంటూ అంతర్జాతీయంగా విజ్ఞప్తులు అందుతున్నా వాటినే మాత్రం పట్టించుకోకుండా ఇజ్రాయిల్ సైన్యం బాంబుదాడులను కొనసాగిస్తోంది. పాలస్తీనా భూభాగంలోకి వెళ్లి మరీ యుద్ధం చేయాల్సిందిగా కమాండర్లను, సైనికులకు పంపిన లేఖలో ఐడిఎఫ్ చీఫ్ ఆఫ్ జనరల్ స్టాఫ్ హెర్జి హలెవి కోరారు. ఈ యుద్ధం సుదీర్ఘంగా వుండబోతోందని అన్నారు. చివరిదాకా పోరాడాల్సిందేనన్నారు.

రాజస్థాన్ పిసిసి చీఫ్‌కు ఇడి సమన్లు

జైపూర్: మరి కొద్దిరోజుల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న రాజస్థాన్‌లో అక్కడి పిసిసి అధ్యక్షులు గోవింద్ సింగ్ డోటాస్రా, ఆయన కుమారులకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) సమన్లు జారీచేసింది. పరీక్షా పత్రం లీక్ కేసుకు సంబంధించిన మనీలాండరింగ్ కేసు దర్యాప్తులో భాగంగా వీరికి ఇడి ఈ నోటీసులు అందాయి. కొద్దిరోజుల క్రితం రాజస్థాన్ కాంగ్రెస్ అధ్యక్షులు గోవింద్ సింగ్ డోటాస్రా నివాసంలో ఇడి అధికారులు తనిఖీలు చేపట్టిన సంగతి తెలిసిందే. రాష్ట్ర ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాట్ కుమారుడు వైభవ్‌కు కూడా ఇడి సమన్లు జారీ చేసింది. విదేశీ విరాళాల నిబంధనల ఉల్లంఘనలకు సంబంధించిన కేసులో వైభవ్‌కు ఇడి సమన్లు జారీ చేసింది.

ఎన్నికలకు కేవలం కొన్నిరోజుల ముందు రాష్ట్రంలో ఇడి ఇలా సమన్లు ఇవ్వడం, సోదాలు చేపట్టడం చర్చనీయాంశంగా మారింది. ఇడి చర్యలపై ముఖ్యమంత్రి గెహ్లాట్ ఇప్పటికే బిజెపిపై విమర్శలు గుప్పించారు. 200 ఎమ్మెల్యే స్థానాలు ఉన్న రాష్ట్రంలో ఈ నెల 25న ఎన్నికలు జరగనున్నాయి. డిసెంబరు 3న ఫలితాలను ప్రకటించనున్నారు.

అభివృద్ధి, కాంగ్రెస్ ఒకే చోట ఉండవు : మోడీ

రాయ్‌పూర్: కాంగ్రెస్, అభివృద్ధి.. ఈ రెండూ ఒకేదగ్గర మనుగడ సాగించలేవని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆరోపించారు. ఛత్తీస్‌గఢ్ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంకెర్‌లో గురువారం ఏర్పాటు చేసిన సభలో మోడీ మాట్లాడుతూ.. భూపేశ్ బఘేల్ పాలనలో రాష్ట్రంలో అవినీతి పెరిగిపోయిందన్నారు. 'కుటుంబ పాలన, బంధుప్రీతి, అవినీతి అనేవి కాంగ్రెస్ విధానాలు. ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా ఛత్తీస్‌గఢ్ యువతను కాంగ్రెస్ పార్టీ మోసం చేసింది. ఐదేళ్ల కాంగ్రెస్ పాలనలో రాష్ట్రంలో కేవలం ఆ పార్టీ నేతల పిల్లలు, బంధువులే ప్రయోజనం పొందారు. పేదలకు ఎటువంటి లబ్ధి చేకూరలేదు. కాంగ్రెస్ ఉన్నచోట అభివృద్ధి ఉండదు. ఆ రెండూ ఒకేదగ్గర మనుగడ సాగించలేవు. దేశాభివృద్ధికి ఛత్తీస్‌గఢ్ వేగంగా అభివృద్ధి చెందడం ఎంతో అవసరం' అని మోడీ చెప్పారు. ఛత్తీస్‌గఢ్ అసెంబ్లీ ఎన్నికలు ఈనెల 7న, ఈ నెల 17న రెండు దశల్లో పోలింగ్ జరగనుంది.

ఫలితాల నాటికి ఎక్కడుంటానో..

- మధ్యప్రదేశ్ ప్రచారంలో కేజ్రీవాల్

భోపాల్: త్వరలో జరిగే ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు ఫలితాలు వెల్లడయ్యేలోపు తాను ఎక్కడుంటానో.. అని ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ వ్యాఖ్యానించారు. తాను జైలులో ఉంటానో..? బయట ఉంటానో..? తెలియదని అన్నారు. గురువారం మధ్యప్రదేశ్‌లోని సింగ్రౌలీలో అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో కేజ్రీవాల్ పాల్గొన్నారు. గురువారం ఇడి ఎదుట విచారణకు హాజరుకావాల్సి ఉన్నా. కేజ్రీవాల్ ప్రచారంలో పాల్గొన్నారు. 'అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వచ్చే సమయానికి నేను జైలులో ఉంటానో..? బయట ఉంటానో..? తెలీదు. నాకు జైలు జీవితం గురించి ఏ మాత్రం భయం లేదు. ఢిల్లీ, పంజాబ్ ప్రజలవలే మీరు కూడా ఆప్‌కు విజయం అందించాలి' అని కేజ్రీవాల్ చెప్పారు.

డిసెంబరు1 వరకు ప్రబీర్, అమిత్‌ల రిమాండ్ పొడిగింపు

న్యూఢిల్లీ : న్యూస్‌క్లిక్ వ్యవస్థాపకుడు ప్రబీర్ పుర్కాయస్థ, హెచ్‌ఆర్ విభాగం అధిపతి అమిత్ చక్రవర్తి రిమాండ్‌ను డిసెంబరు 1 వరకు ఢిల్లీ కోర్టు పొడిగించింది. న్యూస్ క్లిక్‌పై కత్తిగట్టిన మోడీ సర్కార్ తప్పుడు కేసులు బనాయించి అక్టోబరు3న వీరిని జైలులో ఎట్టింది. అక్టోబరు 10 వరకు తొలుత జ్యూడీషియల్ కస్టడీకి పంపారు. ఆ తర్వాత అక్టోబరు 25న పోలీసులు ఇంటరాగేషన్ కోసం మళ్లీ వారి కస్టడీని కోరారు. అక్టోబరు 3న ఢిల్లీ, మరో ఏడు రాష్ట్రాల్లో 88చోట్ల ఒకేసారి దాడులు జరిగాయి. మొత్తంగా 300కి పైగా ఎలక్ట్రానిక్ పరికరాలను స్వాధీనం చేసుకున్నారు. తొమ్మిది మంది మహిళా జర్నలిస్టులతో సహా 46మందిని పోలీసులు ప్రశ్నించారు. కేంద్రంలోని మోడీ సర్కారు అనుసరిస్తున్న ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలపై కథనాలను ప్రచురిస్తున్నందునే కక్షపూరితంగా అరెస్టు చేయించారంటూ దేశవ్యాప్తంగా పాత్రికేయులు ఆందోళనలు నిర్వహించిన సంగతి తెలిసిందే. ఇడి, ఢిల్లీ పోలీసులు, సిబిఐ దాడులు నిర్వహించినప్పటికీ ఇప్పటివరకూ ఎటువంటి ఆధారాలను చూపలేకపోయింది.

కేజ్రీవాల్ విచారణకు ముందే.. మరో మంత్రి ఇంటిపై ఇడి దాడులు

న్యూఢిల్లీ: సివిల్ లైన్స్‌లోని ఢిల్లీ ప్రభుత్వ సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి రాజ్ కుమార్ ఆనంద్ అధికారిక నివాసంపై ఇడి దాడులు చేసింది. దిగుమతులపై కస్టమ్ డ్యూటీని ఆదా చేసేందుకు ఇడికి తప్పుడు సమాచారం ఇచ్చారంటూ 12 చోట్ల సోదాలు కొనసాగుతున్నాయి.

అణు పరీక్షల నిషేధ ఒప్పంద ఆమోదం రద్దు

- ఆదేశాలపై సంతకం చేసిన పుతిన్

మాస్కో : సమగ్ర అణు పరీక్షల నిషేధ ఒప్పందానికి (సిటిబిటి) దేశం యొక్క ఆమోదాన్ని రద్దు చేస్తూ గురువారం రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ సంతకం చేశారు. ఈ ఒప్పందం నుండి రష్యా వైదొలగుతోందని గతంలోనే క్రెమ్లిన్ ప్రకటించింది. ఒప్పందం నుండి వైదొలగుతున్నామంటే దానర్థం అణు పరీక్షలను పునరుద్ధరిస్తామని కాదని కూడా క్రెమ్లిన్ స్పష్టం చేసింది. డ్యూమా ఛైర్మన్ వచెస్లావ్ వొలొదిన్ మాట్లాడుతూ, ఈ ఒప్పందం అమెరికా ధ్రువీకరించాలని 23సంవత్సరాలు రష్యా వేచి చూస్తోందని చెప్పారు. అంతర్జాతీయ భద్రతా సమస్యల పట్ల అమెరికా బాధ్యతారాహిత్య ధోరణిని ఇది సూచిస్తోందని విమర్శించారు. శాంతియుత ప్రయోజనాలకు లేదా సైనిక ప్రయోజనాలకు దేనికైనా అణు పరీక్షలను నిర్వహించడాన్ని నిషేధించే బహుళపక్ష ఒప్పందమే సిటిబిటి.

రెండు దేశాల ఏర్పాటే పరిష్కారం

- పాలస్తీనా సమస్యకు పోప్ సూచన

వాటికన్ సిటీ : యుద్ధంలో విజేతలంటూ ఎవరూ వుండరని పోప్ ఫ్రాన్సిస్ వ్యాఖ్యానించారు. ఇటాలియన్ బ్రాడ్‌కాస్టర్ ఆర్‌ఎఐకి బుధవారం ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఇరుగు పొరుగు వారిగా ఇజ్రాయిలీలు, పాలస్తీనియన్లు కలిసి జీవించాలని అన్నారు. "యుద్ధంలో, ఒకరు చెంపదెబ్బ కొట్టడం మరొకరిని కవ్విస్తుంది. ఒకరు బలంగా వుంటే మరొకరు ఇంకా బలవంతులుగా వుంటారు. ఇది ఇలాగే కొనసాగుతుంది." అని పోప్ పేర్కొన్నారు. స్వతంత్ర పాలస్తీనా దేశాన్ని గుర్తించడమే ఈ సమస్యకు, హింసకు పరిష్కారమని అన్నారు. "ఇరు వర్గాల ప్రజలు కలిసి జీవించాలి. తెలివైన పరిష్కారమేమిటంటే రెండు వర్గాలు, రెండు దేశాలు వుండాలి. జెరూసలేంకు ప్రత్యేక ప్రతిపత్తి కల్పించి రెండు స్పష్టంగా విభజించిన దేశాలు ఏర్పడాలి అని ఓస్లో ఒప్పందం పేర్కొంటోం దన్నారు. 1990ల్లో కుదిరిన ఓస్లో ఒప్పందం 2000ల్లో కుప్పకూలింది. ప్రతి యుద్ధంలోనూ ఓటమి వుంటుంది. ఏదీ కూడా యుద్ధంతో పరిష్కారం కాదు, శాంతి, చర్చలతోనే ప్రతీదీ సాధించగలుగుతామని పోప్ స్పష్టం చేశారు. ప్రస్తుతం పరిస్థితులు చాలా దారుణంగా వున్నాయి. తెలివిగా, వివేచనతో ఆలోచించే సామర్థ్యం వున్నట్లు కనిపించడం లేదని అన్నారు. అన్నింటికంటే చాలా తీవ్రమైన సమస్య ఆయుధ పరిశ్రమ అని చెప్పారు.

గాజా నుండి 7వేల మందికి పైగా విదేశీయులను తరలిస్తాం

- సంసిద్ధమైన ఈజిప్ట్

కైరో : గాజా స్ట్రిప్ నుండి ఏడు వేల మంది విదేశీయులను తరలించేందుకు ఈజిప్ట్ సాయపడుతుందని ఈజిప్ట్ విదేశాంగ మంత్రిత్వ శాఖ గురువారం ప్రకటించింది. ఈజిప్ట్ సహాయ విదేశాంగ మంత్రి ఇస్మాయిల్ ఖరియత్ బుధవారం కైరోలో విదేశీ రాయబారులు, దౌత్యవేత్తలతో సమావేశమయ్యారు. గాజాలో మానవతా సంక్షోభాన్ని కొంతమేర పరిష్కరించేందుకు ఈజిప్ట్ చేస్తున్న కృషిని వివరించారు. రఫా క్రాసింగ్ ద్వారా విదేశీయులను తమ దేశంలోకి తరలించేందుకు సాయపడతామని చెప్పారు. ఈ మేరకు ఒక ప్రకటన జారీ చేశారు. 60కి పైగా దేశాల జాతీయులైన దాదాపు ఏడు వేల మందిని తమ దేశానికి పంపడానికి సాయపడేందుకు ఈజిప్ట్ సిద్ధంగా వుందని ఆ ప్రకటన పేర్కొంది. పది లక్షల మందికి పైగా గాజా ప్రజలను దక్షిణ ప్రాంతం వైపునకు పంపించేందుకు ఇజ్రాయిల్ చేస్తున్న ప్రయత్నాలను ఈజిప్ట్ తీవ్రంగా విమర్శించింది.

ఎన్నికల్లో పాత్రికేయులకు రక్షణ

- మార్గదర్శకాలు జారీ చేసిన యునెస్కో

పారిస్ : ప్రపంచ దేశాల్లో ఎన్నికల సమయంలో పాత్రికేయులపై జరుగుతున్న దాడులకు సంబంధించి ఐక్యరాజ్యసమితి విద్య, శాస్త్ర, సాంస్కృతిక సంస్థ (యునెస్కో) ఓ నివేదికను రూపొందించింది. 2019 నుండి 2022 జూన్ వరకూ 70 దేశాల్లో జరిగిన 89 ఎన్నికల సందర్భంగా పాత్రికేయులపై జరిగిన దాడులను యునెస్కో పరిశీలించింది. 759 మంది పాత్రికేయులు, మీడియా సిబ్బందిపై దాడులు జరిగాయని, వాటిలో 42% అంటే 320 దాడులు చట్టాన్ని అమలు చేసే సంస్థలే చేశాయని, దాడులకు గురైన వారిలో 29% (218) మంది మహిళలని ఆ సంస్థ వివరించింది. ముఖ్యంగా చట్టాన్ని అమలు చేయాల్సిన ప్రభుత్వ సంస్థలే దాడులకు తెగబడ్డాయని ఎత్తిచూపింది. అనేక మంది పాత్రికేయులను నిర్బంధించాయని, కొందరిని తాత్కాలికంగా అరెస్ట్ చేశారని, కొందరిపై మోపిన ఆరోపణల్ని ఆ తర్వాత వెనక్కి తీసుకున్నారని పేర్కొంది. నిరసన ప్రదర్శనలకు సంబంధించిన వార్తలను అందించే సమయంలో చాలా మంది పాత్రికేయులను అరెస్ట్ చేశారని తెలిపింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ సంస్థలకు యునెస్కో మార్గదర్శకాలు విడుదల చేసింది. 'పాత్రికేయులు, ప్రభుత్వ సంస్థల మధ్య మంచి, వృత్తిపరమైన సంబంధాలు ఉండాలి. పాత్రికేయులను కలుసుకుంటూ, వారి పాత్రపై చర్చించాలి. జర్నలిస్టులు తమ పని తాము చేసుకునేలా అనువైన వాతావరణం కల్పించాలి. సకాలంలో సమర్థవంతమైన ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటూ జర్నలిస్టులకు రక్షణ కల్పించాలి. పాత్రికేయులపై ఏ రూపంలోనూ బలప్రయోగం, ఒత్తిడి చేయకూడదు. ప్రజా ప్రయోజనాలకు సంబంధించిన కార్యక్రమాల వార్తలు అందించే జర్నలిస్టులను అధీకృత పత్రాలు అడగకూడదు. అక్రెడిషన్ కలిగిన వారిని ప్రోత్సహించాలి. వారిని తేలికగా గుర్తించేలా దుస్తులు, సామగ్రి పైన ప్రెస్ అనే చిహ్నాన్ని ప్రదర్శించాలి. ఎన్నికల సమయంలో తటస్థంగా ఉండాలి. ఎన్నికలు వచ్చినప్పుడు ప్రభుత్వ సంస్థలకు, పాత్రికేయులకు తరచుగా శిక్షణ ఇవ్వాలి' అని యునెస్కో సూచించింది.

చిన్నారి

మీ కోసం

కుక్కర్‌లో అన్నం, పప్పు వండేటప్పుడు అందులో పొడవాటి చెంచా వేస్తే ఎసరు బయటికి రాకుండా ఉంటుంది.

జీవన సౌరభం

ఇంగిత జ్ఞానం లేని మెదడులో ప్రశ్న ఉదయించదు. మౌఢ్యం నిండిన మనసుల్లో ఆలోచన పుట్టదు.

నిర్ణయం

అనగనగా ఒక అడవి. ఆ అడవిలో ఒక కోయిల వుండేది. అది అందమైన పక్షుల్ని చూసి, తను అందంగా లేనని చాలా బాధ పడేది. కొన్ని రోజులకి వసంతకాలం వచ్చింది. ఆ కోయిల గొంతు సవరించుకొని, ఆనంద పారవశ్యంతో గొంతెత్తి పాడసాగింది. కొద్ది సేపటికే ఏదో అలికిడీ అనిపించి, చుట్టూ చూసింది. తన చుట్టూ ఎన్నో పక్షులు కనిపించాయి. అవి కోయిల గానామృతాన్ని ఎంతగానో మెచ్చుకున్నాయి. కోయిలకి చాలా ఆశ్చర్య మేసింది. ఆనందమూ కలిగింది.

'ప్రతి వారిలో కూడా ఏదో గొప్పతనం దాగి వుంటుంది. ఉన్న లోపాన్ని చూసుకొని, బాధ పడకూడదు. దాగున్న గొప్పతనాన్ని గుర్తించి, సాధన చేస్తే చాలా గొప్పవాళ్ళు అవుతారు' అని కోయిల తన మనసులో అనుకుంది. ఇకనుంచి తను బాధ పడకూడదు. గొప్పపేరు తెచ్చుకునేలా తన గానాన్ని ఇంకా బాగా సాధన చేయాలని నిర్ణయించుకుంది. అప్పట్నుంచీ వసంతకాలం రాగానే తన గానామృతంతో ప్రకృతిని పరవశింపజేస్తూ, జంతువులన్నింటి నుండి అభినందనలు అందుకోసాగింది.

– మా శ్రీ రాజు,
పాల్వంచ, 92487 91885.

గజిబిజి

పిల్లలూ, ఇక్కడ ఆంగ్లంలో ఇచ్చిన పదాలు పక్కనే ఉన్న గళ్లల్లో గజిబిజిగా ఉన్నాయి. ఏ పదం ఎక్కడ ఉందో మీరు కనిపెట్టండి.

can
pea
robot
snake
brown
house

u	t	o	b	o	r
r	e	n	i	v	s
p	s	w	c	a	n
p	u	o	e	a	a
e	o	r	b	b	k
a	h	b	y	n	e

నేను గీసిన బొమ్మ

జయసాయి హరి కీర్తన,
కె.వి స్కూల్,
కర్నూల్ జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

ఈ యుద్ధం.. వారి రుతుక్రమాన్ని తప్పిస్తోంది..

యుద్ధ భయంతో 41 ఏళ్ల సల్మా రెండు వారాల క్రితం గాజా నగరంలోని బెల్ అల్ హవా పరిసరాల్లోని తన ఇంటి నుండి పారిపోయి సెంట్రల్ గాజాలోని డెయిర్ ఎల్‌బలాహ్ శరణార్థి శిబిరంలో తలదాచుకుంటోంది. తీవ్ర ఒత్తిడి, భయంతో ఆమె రుతుక్రమం గాడితప్పింది. 'ఈ యుద్ధంతో నేను అత్యంత ఇబ్బందికర పరిస్థితులను ఎదుర్కొంటున్నాను. ఎప్పుడూ లేనిది ఈ నెలలో నాకు రెండు సార్లు రుతుక్రమం వచ్చింది. ఒత్తిడివల్ల అధిక రక్తస్రావమై ఎంతో బాధపడ్డాను. అయితే నన్ను అంతకంటే బాధించిన మరో విషయమేమంటే.. ఇక్కడ తాగడానికి నీరు లేని పరిస్థితి ఉంది. ఈ పరిస్థితుల్లో రుతుక్రమంలో పాటించాల్సిన పరిశుభ్రతపై శ్రద్ధ పెట్టలేకపోయాను. శానిటరీ నాప్కిన్స్ అందుబాటులో లేవు. షాపులన్నీ మూసేసి ఉన్నాయి. వందలమంది వరకు తలదాచుకుంటున్న మేము, నీళ్ల రేషన్‌గా వాడుకుంటున్నాం. మరుగుదొడ్డి కూడా అంతే. వారంలో ఒకటి లేదా రెండుసార్లే స్నానం చేస్తున్నాం. ఈ పరిస్థితుల్లో గత్యంతరం లేక పీరియడ్ క్రమం తప్పించేందుకు పిల్స్ వేసుకోవాలని నిర్ణయించుకున్నాను' అంటూ ఎంతో బాధగా చెబుతోంది.

'ఇక్కడి ఫార్మాస్టిట్యువల్స్‌లో ఎక్కువమంది ఉపయోగించే శానిటరీ నాప్కిన్లు దొరక్కపోయినా రుతుక్రమం తప్పించే పిల్స్ మాత్రం అందుబాటులో ఉంటున్నాయి. ఈ యుద్ధం ఎంత త్వరగా ముగిస్తే అంత మంచిది. ఎందుకంటే ఈ పిల్స్ వాడడం చాలా హానికరం. సైడ్ ఎఫెక్ట్స్ వస్తాయి. ఒకటి కంటే ఎక్కువసార్లు ఉపయోగించలేను' అంటూ సల్మా ఆందోళన చెందుతోంది.

'సాధారణంగానే పీరియడ్ సమయంలో మానసికంగా, శారీరకంగా చాలా ఒత్తిడికి గురవుతారు. ప్రస్తుత పరిస్థితిలో వారు మరింత ఆందోళచెందుతున్నారు. ఈ ప్రభావం హార్మోన్ల అసమతుల్యతకు దారితీస్తుంది. నిద్రలేమి, భయం, విపరీతమైన ఒత్తిడి అనుభవిస్తున్నారు. ఇట్లాంటి పరిస్థితుల్లో రుతుక్రమం తప్పించే పిల్స్ వారి ఆరోగ్యాన్ని మరింత ప్రభావితం చేస్తాయి' అని గాజా సిటీలోని మానసిక వైద్య నిపుణురాలు, సామాజిక కార్యకర్త నివేని అద్నాన్ ఆందోళన చెందుతున్నారు.

సహజ హార్మోనుల మార్పుల వల్ల వచ్చే రుతుక్రమాన్ని తప్పించడమంటే అది తరువాతి నెలలో వచ్చే రుతుస్రావంపై ప్రభావం చూపుతుంది. వైద్యుల సలహా లేకుండా పిల్స్ ఉపయోగించకూడదు. వాటివల్ల అధిక రక్తస్రావం, విపరీతమైన నొప్పి, ఇంకా ఇతర బాధలు వేధిస్తాయి' అని అద్నాన్ అంటున్నారు.

నాకు మరో మార్గం లేదు..

గాజా వెస్ట్ ఆఫ్ ఖాన్ యౌన్నిస్ నుండి ఐక్యరాజ్యసమితి నిర్వహించే శిబిరంలో ఆశ్రయం పొందుతున్న సమీరా అల్ సాదీ తన 15 ఏళ్ల కూతురు గురించి తీవ్రంగా ఆందోళన చెందుతోంది. కొన్ని నెలల క్రితమే ఆ పాపకు మొదటి పీరియడ్ వచ్చింది. ఇప్పుడు ఇంత జనసందోహంలో, మృగ్యమైన సౌకర్యాల మధ్య రెండో పీరియడ్ వస్తే ఎలా అన్నది ఆ తల్లి ఆవేదన. 'శానిటరీ ప్యాడ్లు, శుభ్రం చేసుకునేందుకు నీళ్లు ఇక్కడ అందుబాటులో లేవు. అందుకే నేను నా కూతురుకు రుతుక్రమం తప్పించే పిల్స్ వేయాలనుకుంటున్నాను. అయితే అవి ఆమె ఆరోగ్యాన్ని దెబ్బతీస్తాయోమోనని భయపడుతున్నాను. నేను ఇలా ఎందుకు చేస్తున్నానో అర్థం చేసుకోలేని వయసు ఆమెది. కానీ నా చేతుల్లో ఇంతకంటే మరో మార్గం లేదు' అని ఆ తల్లి కన్నీటిపర్యంతమౌతోంది.

పేకమేడల్లా కూలిపోతున్న భవనాలు, తెగిపడుతున్న శరీరభాగాలు, క్షిపణిదాడుల భీకర శబ్దాల మధ్య ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని తలోదిక్కూ పారిపోతున్న పౌరులను ఇప్పుడు ఇజ్రాయిల్-గాజా యుద్ధంలో చూస్తున్నాం. ఈ యుద్ధం మహిళలను, పిల్లలను ఎంతలా ప్రభావితం చేస్తుందో అనడానికి ఎన్నో ఉదాహరణలు చదువుతున్నాం. వైద్య సౌకర్యం అందుబాటులో లేక గర్భిణీలు పడుతున్న వెతలు తెలుసుకుని ఆందోళనచెందాం. ఇప్పుడు తాజాగా రుతుక్రమాన్ని తప్పించడం కోసం ప్రమాదమని తెలిసినా వాళ్లు అనుసరిస్తున్న మార్గాలు అక్కడి దయనీయ పరిస్థితిని ప్రతిబింబిస్తున్నాయి.

రుబా సైఫీ. తన కుటుంబంతో కలసి ఈ శిబిరంలోనే తలదాచుకుంటోంది. 'ఇక్కడ గోప్యత లేదు. మరుగుదొడ్లలో నీరు లేదు. మాకు ఏం కావాలో తెచ్చుకునేందుకు బయటికి వెళ్లే పరిస్థితి లేదు. విపరీతమైన చలి, నిద్రలేమి, ఒళ్లంతా తిమ్మిరి తిమ్మిరిగా ఉంటోంది. ఈ పరిస్థితుల్లో రుతుక్రమం వస్తే భరించలేను. అందుకే పిల్స్ వేసుకుందామనుకుంటున్నాను. ఎంతో కష్టపడి వాటిని సంపాదించాను. నా చుట్టూ ఉన్న వాళ్లల్లో చాలామంది వీటిని అడుగుతున్నారు. తన జీవితంలో అత్యంత బాధాకర రుతుక్రమాన్ని ఎదుర్కొన్నానని ఒకామె నాతో చెప్పింది. మన చుట్టూ పడుతున్న క్షిపణులు, మరణభయం, విధ్వంసం కంటే ఈ పిల్స్ ప్రమాదకరం కాదులే అని ఆమె సర్దిచెప్పుకుంటోంది' అని రుబా చెబుతున్నప్పుడు అక్కడి మహిళలు ఎంత తీవ్ర నిరాశనిస్పృహల్లో ఉన్నారో అర్థమౌతుంది.

యుద్ధం మొదలైన అక్టోబరు 7 నుండి గాజాలో 14 లక్షల మంది ఒక చోట నుండి మరోచోటకి స్థానభ్రంశం చెందారు. అపరిశుభ్ర వాతావరణంలో ఇరుకైన ప్రదేశాల్లో గోప్యతకు స్థానం లేని చోట వారంతా తలదాచుకుంటున్నారు.

'ఈ యుద్ధం మా జీవితాలను అల్లకల్లోలం చేసింది. మా ప్రాణాలు, ఆరోగ్యంతో పాటు పిల్లల భద్రత, రక్షణ ప్రతి ఒక్కటీ మమ్మల్ని వేధిస్తోంది. ఈ యుద్ధం మా చేతుల్లో ఏమీ లేకుండా చేసింది' అని పునరావాస కేంద్రాల్లో తలదాచుకుంటున్న మహిళలంతా ముక్తకంఠంతో తమ బాధను, భయాలను పంచుకున్నారు. తగినంత ఆహారం, నీరు, దుస్తులు, నిత్యావసరాలు ఇలా రోజువారీ అవసరాల్లో సరిపడినన్ని నిరాశ్రయులకు అందడం లేదు. ఇక రుతుక్రమం, దాని పర్యవసనాలు, పిల్స్ వాడకం, వాటి దుష్ప్రభావాలు పట్టించుకునేవారు ఎవరు? ఈ విపరీత పరిస్థితుల నుండి వారు బయటపడాలంటే యుద్ధం ముగియడం ఒక్కటే మార్గం. ఆ దిశగా ప్రపంచదేశాలు ఏకమవ్వాలి. సంఘీభావాలు తెలపడం కంటే ముందు శాంతియుత వాతావరణం నెలకొనేలా చర్యలు తీసుకోవాలి.

సలార్ పై మెట్టు ఎక్కించింది

ప్రభాస్ ప్రధాన పాత్రలో, ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో తెరకెక్కిన 'సలార్' చిత్రం డిసెంబర్ 22, 2023న ప్రపంచ వ్యాప్తంగా థియేటర్లలో విడుదలకానుంది. ఈ సినిమాలో జగపతిబాబు కూడా నటిస్తున్నారు. తాజాగా ఆ పాత్ర గురించి తన ఇన్‌స్టాలో జగపతిబాబు ఓ పోస్టు చేశారు. 'సలార్‌తో పై మెట్టు ఎక్కబోతున్నా' అంటూ ఒక ఫోటోను షేర్ చేశారు. హొంబలే ఫిలింస్ పతాకంపై నిర్మిస్తున్న ఈ చిత్రానికి రవి బస్రూర్ సంగీతం అందించారు. శృతి హాసన్ హీరోయిన్‌గా నటిస్తుండగా, పృధ్వీ రాజ్, జగపతి బాబు, శ్రియా రెడ్డి కీలక పాత్రల్లో నటించారు.

ఆస్కార్ యాక్టర్స్ బ్రాంచ్‌లో రామ్ చరణ్

ఆర్ ఆర్ ఆర్ సినిమాలో అద్భుత నటన కనబర్చినందుకు ప్రఖ్యాత అస్కార్స్ యాక్టర్స్ బ్రాంచ్‌లో రామ్ చరణ్‌కి చోటు కల్పిస్తున్నట్లు 'ది అకాడమీ' పేర్కొంది. ఈ మేరకు ఇన్‌స్టాలో ఓ పోస్టు పెట్టింది. ఇటీవల విడుదల చేసిన రెండో జాబితాలో జూ. ఎన్టీఆర్‌కు స్థానం దక్కగా తాజాగా బుధవారం విడుదల చేసిన లిస్టులో రామ్ చరణ్ స్థానం దక్కించుకున్నారు. ఈ సందర్భంగా 'ఎన్నో సినిమాల్లో ప్రత్యేకమైన నటనతో ప్రేక్షకులను రంజింపజేసిస్తున్నారు. వారి హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయేలా ఆయా పాత్రలకు జీవం పోస్తున్నారంటూ' ది అకాడమీ పోస్టు చేసింది.

డ్యూయెట్ సినిమా ప్రారంభం

హీరో ఆనంద్ దేవరకొండ నటిస్తున్న కొత్త సినిమా 'డ్యూయెట్'. స్టూడియో గ్రీన్ బ్యానర్‌లో కేఈ జ్ఞానవేల్ రాజా నిర్మిస్తున్నారు. మధుర శ్రీధర్ రెడ్డి సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ఏఆర్ మురుగదాస్ దగ్గర పనిచేసిన మిథున్ వరదరాజ కృష్ణన్ దర్శకుడిగా పరిచయమవుతున్నారు. రితిక నాయక్ హీరోయిన్. హైదరాబాద్ అన్నపూర్ణ స్టూడియోస్‌లో సినిమా ప్రారంభోత్సవం గురువారం జరిగింది. హీరో విజయ్ దేవరకొండ, దర్శకులు హరీశ్ శంకర్, చందూ మొండేటి, సాయి రాజేశ్,హీరో సత్య దేవ్, ఆనంద్ తల్లిదండ్రులు గోవర్ధన్ దేవరకొండ, మాధవి అతిథులుగా హాజరయ్యారు. మూహూర్తపు సన్నివేశానికి హీరో హీరోయిన్లపై దర్శకుడు హరీశ్ శంకర్ క్లాప్ నివ్వగా...దర్శకుడు సాయిరాజేశ్, జ్ఞానవెల్ రాజా, సహ నిర్మాత మధుర శ్రీధర్ స్క్రిప్ట్‌ను దర్శకుడు మిథున్‌కి అందజేశారు. ఫస్ట్ షాట్ డైరెక్షన్ చందూ మొండేటి చేశారు. ఆనంద్ పేరెంట్స్ గోవర్ధన్ దేవరకొండ, మాధవి దేవరకొండ కెమెరా స్విచ్చాన్ చేశారు.



తంగలాన్' టీజర్ విడుదల

విక్రమ్ హీరోగా నటిస్తున్న కొత్త సినిమా 'తంగలాన్'. దర్శకుడు పా రంజిత్ ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. పార్వతీ, మాళవిక మోహనన్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. పా రంజిత్ నీలమ్ ప్రొడక్షన్స్‌తో కలిసి స్టూడియో గ్రీన్ పతాకంపై కేఈ జ్ఞానవేల్ రాజా నిర్మిస్తున్నారు. వచ్చే ఏడాది జనవరి 26న ఈ సినిమా విడుదల చేయనున్నారు. హైదరాబాద్ ఏఎంబీ మల్టీప్లెక్స్‌లో సినిమా టీజర్ విడుదల కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హీరో విక్రమ్, దర్శక నిర్మాత పా.రంజిత్, నిర్మాత కేఈ జ్ఞానవేల్ రాజా, దర్శక నిర్మాత మధుర శ్రీధర్ రెడ్డి, హీరో సత్యదేవ్, డైరెక్టర్లు బాబి, సురేందర్ రెడ్డి, కరుణ కుమార్, వేణు ఊడుగుల పాల్గొన్నారు. ఎడిటర్ ఆర్కే సెల్వ, సినిమాటోగ్రాఫర్ కిషోర్ కుమార్, దర్శక నిర్మాత మధుర శ్రీధర్ రెడ్డి మాట్లాడారు.

మా ఊరి పొలిమేర-2 విజయం సాధిస్తుంది

- చిత్ర కథానాయకుడు సత్యంరాజేష్

మా ఊరి పొలిమేర-2 సినిమా తప్పకుండా విజయం సాధిస్తుందనే నమ్మకం తనకుందని ఆ చిత్ర కథానాయకుడు సత్యంరాజేష్ చెప్పారు. 'మాఊరి పొలిమేర' చిత్రానికి సీక్వెల్‌గా రూపొందుతున్న చిత్రం 'మా ఊరి పొలిమేర 2'.డా.అనిల్ విశ్వనాథ్. దర్శకుడు. సత్యం రాజేష్, కామాక్షి భాస్కర్ల ముఖ్యతారలుగా నటిస్తున్న విషయం తెలిసిందే. శుక్రవారంనాడు ఈ సినిమా విడుదల కానుంది. గురువారంనాడు విలేకరులతో సత్యంరాజేష్ మాట్లాడారు. 'పార్ట్ 1 చూసిన ఆడియన్స్ మా సినిమా కోసం ఎదురుచూస్తున్నారు. మా సినిమాకు ప్రత్యేకమైన ఆడియన్స్ ఉన్నారు.

రికార్డు గెలుపుతో
సెమీస్‌కు టీమిండియా

శ్రీలంకపై 302 పరుగుల తేడాతో అద్భుత విజయం

బ్యాటింగ్‌లో గిల్, కోహ్లి, శ్రేయస్... బౌలింగ్‌లో షమీ, సిరాజ్...

ఐసిసి వన్డే ప్రపంచకప్‌లో టీమిండియా పలు రికార్డులను నెలకొల్పింది. ముంబయిలోని వాంఖడే స్టేడియంలో శ్రీలంకపై 302 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. దీంతో వన్డే ప్రపంచకప్‌లో టీమిండియా వరుసగా ఏడు మ్యాచుల్లో గెలుపొందడం ఇదే తొలిసారి. అలాగే మహ్మద్ షమీ(5/18) బౌలింగ్‌లో మెరిసి.. వన్డే ప్రపంచకప్‌లో 45వికెట్లు తీసిన తొలి భారత బౌలర్‌గా నిలిచాడు. ఈ క్రమంలో జహీర్‌ఖాన్, జవగళ్ శ్రీనాథ్(44వికెట్లు) రికార్డును చెరిపేసాడు. అలాగే విరాట్ కోహ్లి వ్యక్తిగత స్కోర్ 34 పరుగుల వద్ద ఈ ఏడాది వెయ్యి పరుగుల మార్క్‌ను అందుకొని టీమిండియా తరఫున అత్యధికసార్లు ఒక ఏడాదిలో వెయ్యి పరుగులు పూర్తి చేసుకున్న సచిన్(11) సరసన నిలిచాడు.

ముంబయి:
ఐసిసి వన్డే ప్రపంచకప్‌లో భాగంగా శ్రీలంకతో వాంఖడే స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో టీమిండియా పలు రికార్డులు నెలకొల్పింది. వన్డే ప్రపంచ కప్‌లో టీమిండియా 302 రికార్డు గెలుపుతో సెమీస్‌కు చేరింది. తొలిగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ నిర్ణీత 50 ఓవర్లలో 8వికెట్ల నష్టానికి 357పరుగులు చేయగా.. ఛేదనలో శ్రీలంక 19.3ఓవర్లలో 55పరుగులకే కుప్పకూలింది. షమీ(5/18), సిరాజ్(3/16) బౌలింగ్‌లో మెరిసారు.

టాస్ ఓడి తొలిగా బ్యాటింగ్ దిగిన భారత్‌కు తొలి ఓవర్‌లోనే ఎదురుదెబ్బ తగిలింది. ఫామ్‌లో ఉన్న కెప్టెన్ రోహిత్ శర్మ(4) ఔటయ్యాడు. మధుశంక వేసిన రెండో బంతికి రోహిత్ క్లీన్ బౌల్డ్ అయ్యాడు. ఆ తర్వాత మరో ఓపెనర్ శుభ్‌మన్ గిల్ (92), విరాట్ కోహ్లీ(88) అర్ధసెంచరీలతో మెరిసి జట్టును ఒడ్డున పడేశారు. వీరిద్దరూ కలిసి 2వ వికెట్‌కు 189పరుగులు జతచేశారు. రన్ రేట్ 6కు తగ్గకుండా ఆడుతూ వచ్చారు. సెంచరీల దిశగా వెళ్తున్న వీరిని మధుశంక డబుల్ స్ట్రోక్ ఇచ్చాడు. 30వ ఓవర్లో గిల్‌ను ఔట్ చేసిన మధుశంక.. మరుసటి ఓవర్లో కోహ్లీని కూడా పెవిలియన్‌కు పంపాడు. ఆ తర్వాత కెఎల్ రాహుల్(21), శ్రేయాస్ అయ్యర్‌తో కలిసి నాల్గో వికెట్‌కు 60 పరుగులు జోడించాడు. 40వ ఓవర్లో ఛమీరా బౌలింగ్‌లో హేమంతకు క్యాచ్ ఇచ్చి కెఎల్ రాహుల్ పెవీలియన్‌కు చేరాడు. ఆ సమయానికి భారతజట్టు స్కోర్ 5వికెట్ల నష్టానికి 276పరుగులు చేసింది. టి20 స్పెషలిస్ట్ బ్యాటర్ సూర్యకుమార్ యాదవ్(12) మరోసారి నిరాశపరిచాడు. చివర్లో శ్రేయాస్ అయ్యర్ ఆకాశమే హద్దుగా చెలరేగాడు. కసున్ రజిత వేసిన 36వ ఓవర్లో భారీ సిక్సర్ బాదిన అయ్యర్.. తీక్షణ వేసిన 41వ ఓవర్లో లాంగాఫ్ మీదుగా అద్భుతమైన సిక్స్ కొట్టాడు. 36 బంతుల్లోనే అర్ధ సెంచరీ పూర్తిచేసిన అయ్యర్.. మధుశంక వేసిన 48వ ఓవర్లో రెండు భారీ సిక్సర్లు మూడోబంతినీ సిక్సర్ కొట్టేందుకు ప్రయత్నించి తీక్షణ చేతికి చిక్కాడు. చివర్లో రవీంద్ర జడేజా (35) ధాటిగా ఆడటంతో భారత్ 350 పరుగుల మైలురాయిని దాటింది. శ్రీలంక బౌలర్లలో దిల్షాన్ మధుశంకకు ఐదు, ఛమీరాకు ఒక వికెట్ దక్కాయి.

భారీ లక్ష్య ఛేదనలో శ్రీలంక జట్టు పరుగుల ఖాతా తెరవకుండానే నిస్సంక(0) వికెట్ కోల్పోయింది. ఆ తర్వాత కరుణరత్నే, సమరవిక్రమ కూడా పరుగుల ఖాతా తెరవకుండానే పెవీలియన్‌కు చేరడంతో లంక జట్టు 2పరుగులకే 3వికెట్లు కోల్పోయింది. ఆ తర్వాత టీమిండియా పేసర్లు షమీ, సిరాజ్ వరుసగా వికెట్లు తీయడంతో లంక జట్టు 29పరుగులకే 8వికెట్లు కోల్పోయి ఓటమికోరల్లో నిలిచింది. చివరి రెండు వికెట్లకు లంక 26పరుగుల జతచేయడంతో ఊపిరి పీల్చుకుంది. బుమ్రా(1/8), జడేజా(1/4)కి తోడు షమీకి ఐదు, సిరాజ్‌కు మూడు వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ మహ్మద్ సిరాజ్‌కు లభించింది.

షమీ రికార్డు..

ఐసిసి వన్డే ప్రపంచకప్‌లో మహ్మద్ షమీ ఓ రికార్డును తన పేర లిఖించుకున్నాడు. వాంఖడే స్టేడియంలో శ్రీలంకపై షమీ(5/14) అద్భుత బౌలింగ్‌తో రాణించాడు. దీంతో ఈ ప్రపంచకప్‌లో కేవలం మూడు మ్యాచుల్లోనే 14 వికెట్లు తీసినట్లయ్యింది. అలాగే ఓవరాల్‌గా వన్డే ప్రపంచకప్‌లో 45వికెట్లు కూల్చాడు. దీంతో వన్డే ప్రపంచకప్‌లో టీమిండియా తరఫున అత్యధిక వికెట్లు తీసిన జహీర్ ఖాన్, జవగళ్ శ్రీనాథ్ (44వికెట్లు) రికార్డును షమీ బ్రేక్ చేశాడు.

టీమిండియా తక్కువ పరుగులకే ఆలౌట్ చేసిన జట్లు..

50 : శ్రీలంక, (కొలంబో 2023)
55 : శ్రీలంక, (ముంబయి, 2023)
58 : బంగ్లాదేశ్, (మీర్‌పూర్, 2014)
65 : జింబాబ్వే, (హరారే 2005)
73 : శ్రీలంక, (త్రివేంద్రం, 2023)

అత్యధిక పరుగుల తేడాతో గెలిచిన జట్లు..

317 : ఇండియా (శ్రీలంకపై, త్రివేంద్రం 2023)
309 : ఆస్ట్రేలియా (నెదర్లాండ్స్‌పై, ఢిల్లీ 2023)
304 : జింబాబ్వే (యుఏఇపై, హరారే 2023)
302 : ఇండియా (శ్రీలంకపై, వాంఖడే 2023)

వన్డే ప్రపంచకప్‌లో నేడు..
నెదర్లాండ్స్ × ఆఫ్ఘనిస్తాన్
(వేదిక: లక్నో, మ.2.00గం॥లకు)

స్కోర్‌బోర్డు..

భారత్ ఇన్నింగ్స్: రోహిత్ (బి)మధుశంక 4, శుభ్‌మన్ (సి)కుశాల్ మెండీస్ (బి)మధుశంక 92, కోహ్లి (సి)నిస్సంక (బి)మధుశంక 88, శ్రేయస్ (సి)తీక్షణ (బి)మధుశంక 82, కెఎల్ రాహుల్ (సి)హేమంత (బి)ఛమీర 21, సూర్యకుమార్ యాదవ్ (సి)కుశాల్ మెండీస్ (బి)మధుశంక 12, జడేజా (రనౌట్) సమరవిక్రమ/కుశాల్ మెండీస్ 35, షమీ (రనౌట్)కుశాల్ మెండీస్ 2, బుమ్రా (నాటౌట్) 1, అదనం 20. (50 ఓవర్లలో 8వికెట్ల నష్టానికి) 357పరుగులు. వికెట్ల పతనం: 1/4, 2/193, 3/196, 4/256, 5/275, 6/233, 7/355, 8/357 బౌలింగ్: మధుశంక 10-0-80-5, ఛమీర 10-2-71-1, రజిత 9-0-66-0, మాథ్యూస్ 3-0-11-0, తీక్షణ 10-0-67-0, హేమంత 8-0-52-0.

శ్రీలంక ఇన్నింగ్స్: నిస్సంక (ఎల్‌బి) బుమ్రా 0, కరుణరత్నే (ఎల్‌బి)సిరాజ్ 0, కుశాల్ మెండీస్ (బి)సిరాజ్ 1, సమరవిక్రమ (సి)శ్రేయస్ (బి)సిరాజ్ 0, అసలంక (సి)జడేజా (బి)షమీ 1, మాథ్యూస్ (బి)షమీ 12, హేమంత (సి)కెఎల్ రాహుల్ (బి)షమీ 0, ఛమీర (సి)కెఎల్ రాహుల్ (బి)షమీ 0, తీక్షణ (నాటౌట్) 12, రజిత (సి)శుభ్‌మన్ (బి)షమీ 14, మధుశంక (సి)శ్రేయస్ (బి)జడేజా 5, అదనం 10. (19.4ఓవర్లలో ఆలౌట్) 55పరుగులు. **వికెట్ల పతనం:** 1/0, 2/2, 3/2, 4/3, 5/14, 6/14, 7/22, 8/29, 9/49, 10/55 **బౌలింగ్:** బుమ్రా 5-1-8-1, సిరాజ్ 7-2-16-3, షమీ 5-1-18-5, కుల్దీప్ 2-0-3-0, జడేజా 0.4-0-4-1.

పాయింట్ల పట్టిక

వ.స.	దేశం	ఆ	గె	ఓ	పా	నె.ర.
1.	భారత్	7	7	0	14	+2.10
2.	దక్షిణాఫ్రికా	7	6	1	12	+2.29
3.	ఆస్ట్రేలియా	6	4	2	8	+0.97
4.	న్యూజిలాండ్	7	4	3	8	+0.48
5.	పాకిస్తాన్	7	3	4	6	-0.02
6.	ఆఫ్ఘనిస్తాన్	6	3	3	6	-0.71
7.	శ్రీలంక	7	2	5	4	-1.16
8.	నెదర్లాండ్స్	6	2	4	4	-1.27
9.	బంగ్లాదేశ్	7	1	6	2	-1.44
10.	ఇంగ్లండ్	6	1	5	2	-1.65

ఆ:ఆడినవి; గె:గెలుపు; ఓ:ఓటమి; పా:పాయింట్లు; నె.ర:నెట్‌రన్‌రేట్

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68